జాతీయ తెలుగు దినపత్రిక

# ప్రజాజ్యోతి

ప్రతి అక్షరం ప్రజల కోసం

### భారత సంతతి మహిళ నవనీతమ్ పిళ్లైకి నోబెల్ శాంతి పురస్కారం

అంతర్జాతీయ న్యాయరంగంలో విశేష సేవలందించిన దక్షిణాఫ్రికా న్యాయ నిపుణురాలు, భారత సంతతికి చెందిన నవనీతం 'నవి' పిళ్లైకి 2026 నోబెల్ శాంతి బహుమతి లభించింది. శాంతి స్థాపన, అంతర్జాతీయ చట్టాల పరిరక్షణ, మానవ హక్కుల కోసం ఆమె చేసిన దశాబ్దాల కృషిని గుర్తిస్తూ నార్వేజియన్ నోబెల్ కమిటీ ఈ పురస్కారానికి ఎంపిక చేసింది. అంతర్జాతీయ స్థాయిలో న్యాయం, జవాబుదారీతనాన్ని బలోపేతం

మిగతా 2లో..

### కెప్టెన్ స్మిత్ మచ్చర్‌కి ఇజ్రాయెల్ అత్యున్నత శౌర్య పురస్కారం

సాహసానికి మెచ్చి పురస్కారం ప్రకటించిన ఐజాక్ హెర్జోగ్

విమానం గాల్లో ఉండగా.. ఉన్నట్టుండి కో పైలెట్ అత్యంత ఘోరమైన దాడి చేసినప్పటికీ.. ప్రాణాలకు ఎదురొడ్డి 170 మందికి పైగా ప్రయాణికుల ప్రాణాలను కాపాడిన భారతీయ పైలట్ కెప్టెన్

మిగతా 2లో..

ఆదిలాబాద్, హైదరాబాద్ | శనివారం 10 అక్టోబర్ 2026 | సంపుటి: 19 | సంచిక: 214 | పేజీలు: 12 | వెల: రూ.3 | RNI No : TELTEL/2008/24799

పరాభవ నామ సంవత్సరం , భాద్రపద మాసము , తిథి: షష్టి - 10:17:05 వరకు నక్షత్రంమృగశిర - 26:55:46 వరకు కరణంవణిజ - 10:17:05 వరకు, విష్టి - 21:08:34 వరకు పక్షంకృష్ణ యోగంవ్యతీపాత - 18:17:27 వరకు

Published from ADILABAD, RANGAREDDY (HYDERABAD), NIZAMABAD, WARANGAL http://www.prajajyothinews.com Mail: prajajyothidaily@gmail.com

## భూ వివాద రహిత తెలంగాణే లక్ష్యం

- రాష్ట్రాన్ని 7 జోన్లుగా విభజించి రీసర్వే
- 125 ఏళ్ల తర్వాత సమగ్ర రీసర్వే
- ఏడాదిన్నరలో మొత్తం సర్వే పూర్తి
- జీవో 59 క్రమబద్ధీకరణకు అనుమతి
- 500 గజాలలోపు వారికి నెలలో పరిష్కారం
- తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం
- పట్టా భూముల సమస్యపైనా ప్రత్యేక దృష్టి
- 245 గ్రామాల్లో ఇప్పటికే పూర్తైన సర్వే
- మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వెల్లడి




తెలంగాణలో భూ వివాదాలకు శాశ్వత పరిష్కారం చూపడమే ధ్యేయంగా ప్రభుత్వం సమగ్ర భూ పునఃసర్వేపై దృష్టి సారించింది. సుమారు 125 ఏళ్ల తర్వాత రాష్ట్రంలో చేపట్టిన ఈ రీసర్వేను ఏడాదిన్నరలో పూర్తి చేయాలని రెవెన్యూ శాఖ లక్ష్యంగా పెట్టుకుంది. సర్వేలో వేగం పెంచడంతోపాటు పారదర్శకత, కచ్చితత్వానికి పెద్దపీట వేయాలని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అధికారులను ఆదేశించారు. ఇందుకోసం రాష్ట్రాన్ని 7 జోన్లుగా విభజించి, పర్యవేక్షణకు 14 మంది అధికారులను నియమించారు. తొలి దశలో 2,768 గ్రామాల్లో సర్వే చేపట్టగా ఇప్పటివరకు 245 గ్రామాల్లో పూర్తయినట్లు మంత్రి వెల్లడించారు. నవంబర్ చివరి నాటికి తొలి దశ సర్వే పూర్తి చేయాలని అధికారులకు లక్ష్యంగా నిర్దేశించారు. సర్వే పురోగతిని ఎప్పటికప్పుడు తెలుసుకునేందుకు హైదరాబాద్‌లో ప్రత్యేక డాష్ బోర్డు ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్లు మంత్రి పొంగులేటి వెల్లడించారు. ఎవరైనా అధికారులు

మిగతా 12లో..



## అష్ట దిగ్బంధనం!?

- పోలీసు వలయంలో ఢిల్లీ
- మెట్రో రైల్ స్టేషన్స్ మూసివేత
- వరుస ఆందోళనలతో నిర్ణయం
- 24 గంటలు ఇంటర్నెట్ బంద్
- నేడు సిజేపీ ఆందోళనకు పిలుపు
- నిరసనకు పోలీసులు నో పర్మిషన్

దేశ రాజధాని ఢిల్లీలో వరుస ఆందోళనలతో టెన్షన్ టెన్షన్ వాతావరణం నెలకొంది. గత మూడ్రోజులుగా విపక్ష పార్టీలు సీఈసీ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా కోసం చేస్తున్న ఆందోళనలకు కాక్రోచ్ జనతా పార్టీ తోడైంది. అక్టోబర్10న జంతర్ మంతర్ దగ్గర నిరసన చేపట్టాలని నిర్ణయించుకుంది. అయితే పోలీసులు దీనికి అనుమతి నిరాకరించారు. ప్రొటెస్ట్ చేయడానికి కనీసం పది రోజుల ముందు పర్మిషన్ కోసం అప్లై

మిగతా 12లో..



## తంగేడు పువ్వెక్కడ ?



## కనుమరుగవుతున్న తంగేడు..!

### సంప్రదాయాలకు ఇబ్బందులు తప్పవా?

### పండుగ పూట పూల కొరతతో మహిళల ఆందోళన

### అంతరించిపోతున్న తంగేడు పువ్వు..

### బంతి పూలతోనే సరిపెట్టుకోవాల్సిన పరిస్థితి

### నేటి నుంచి సద్దుల బతుకమ్మ ప్రారంభం..

### తంగేడు పూల కోసం వెతుకులాట

తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగలో తంగేడు పువ్వుకు ప్రత్యేక స్థానం ఉంది. ప్రకృతిలో సహజంగా లభించే తంగేడు పూలతో బతుకమ్మను పేర్చి, రంగురంగుల పూల మధ్య గౌరమ్మను కొలుస్తూ మహిళలు, యువతులు సంబరాలు జరుపుకోవడం అనాదిగా వస్తున్న ఆచారం. అయితే నేడు తంగేడు పూల లభ్యత తగ్గుతుందనే ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. ఒకప్పుడు గ్రామీణ ప్రాంతాల్లో విరివిగా కనిపించిన తంగేడు చెట్లు, పూలు ప్రస్తుతం కొన్ని ప్రాంతాల్లో అరుదుగా కనిపిస్తుండటంతో బతుకమ్మ పండుగ వేళ వాటి కోసం వెతుకులాడాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని మహిళలు చెబుతున్నారు.

ఇల్లందు, అక్టోబర్ 9 (ప్రజా జ్యోతి)

**తంగేడు పూలకు ప్రత్యేక ప్రాధాన్యం**

బతుకమ్మ అంటేనే రంగురంగుల పూలతో పేర్చిన పూల పండుగ. గునుగు, తంగేడు, బంతి, చామంతి తదితర పూలతో బతుకమ్మను అందంగా అలంకరిస్తారు. వీటిలో తంగేడు పువ్వుకు ప్రత్యేకమైన ప్రాముఖ్యత ఉంది. పసుపు రంగులో ఆకర్షణీయంగా కనిపించే ఈ పూలు బతుకమ్మలో కీలకంగా నిలుస్తాయి. పల్లెల్లో చెరువుల గట్లు, పొలాల గట్ల వెంట, బీడు భూముల్లో సహజంగా పెరిగే తంగేడు మొక్కలు గతంలో పూల సేకరణకు ఎంతో ఉపయోగపడేవి. పండుగ వచ్చిందంటే మహిళలు, యువతులు గుంపులుగా వెళ్లి పూలను సేకరించి బతుకమ్మలను పేర్చుకునేవారు.

**కనుమరుగవుతున్నాయా.. తంగేడు మొక్కలు?**

కాలక్రమేణా భూముల వినియోగంలో మార్పులు, సహజ వృక్ష సంపద తగ్గుదల, రహదారులు మరియు నిర్మాణాల విస్తరణ వంటి కారణాలతో కొన్ని ప్రాంతాల్లో తంగేడు మొక్కలు తగ్గిపోయాయనే అభిప్రాయాలు వినిపిస్తున్నాయి. అయితే తంగేడు పూల లభ్యత తగ్గడానికి గల అసలు కారణాలపై సమగ్ర పరిశీలన అవసరం. ప్రకృతిలో సహజంగా పెరిగే ఈ మొక్కల పరిరక్షణపై తగిన శ్రద్ధ చూపకపోతే భవిష్యత్తులో సంప్రదాయ పూల సేకరణ మరింత కష్టతరమయ్యే అవకాశం ఉందని పర్యావరణ ప్రేమికులు అభిప్రాయపడుతున్నారు.

**బంతి పూలతోనే సరిపెట్టుకోవాలా?**

తంగేడు పూలు తగినంతగా లభించకపోవడంతో మార్కెట్లలో అందుబాటులో ఉన్న బంతి, చామంతి తదితర

మిగతా 2లో..

## రాష్ట్రంలో ఎల్‌నినో తాండవం

- పలు జిల్లలో వర్షాభావ పరిస్థితులు
- నెలకొన్న కరువు పరిస్థితులు
- ముందస్తు చర్యలకు ప్రభుత్వం సిద్ధం
- ఈనెల 12న సీఎం ప్రత్యేక సమావేశం
- మంత్రులతో సీఎం రేవంత్ చర్చలు



తెలంగాణలో వర్షాభావ పరిస్థితులు తీవ్ర ఆందోళన కలిగిస్తున్న నేపథ్యంలో రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం అలర్ట్ అయింది. ఎల్‌నినో ప్రభావంతో వర్షాలు ఆశించిన స్థాయిలో కురవకపోవడంతోపాటు.. సాగు పనులకు తీవ్ర ఆటంకాలు ఎదురవుతుండటంతో రైతులకు అండగా నిలిచేందుకు రాష్ట్ర ప్రభుత్వం తదుపరి తీసుకోవాల్సిన చర్యలపై దృష్టి పెట్టింది. ఈ పరిస్థితులను సమగ్రంగా సమీక్షించేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలో ఈనెల 12వ తేదీన మంత్రులతో ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేయనున్నారు. వ్యవసాయ రంగంతో పాటు సాగునీరు, తాగునీటి సరఫరా, విద్యుత్ అవసరాలు వంటి కీలక అంశాలపై ఈ భేటీలో చర్చించనున్నారు. రాష్ట్రంలో వర్షపాతం తగ్గడం వ్యవసాయ రంగంపై తీవ్ర ప్రభావం చూపిస్తోంది. పంటల సాగు,

మిగతా 12లో..

## 95 లక్షల ఓట్ల తొలగింపు..

### ఏఎస్‌డీడీ కేటగిరీలో 73,39,235 ఓట్లు

### సీఈవో సుదర్శన్‌రెడ్డి కీలక వ్యాఖ్యలు



తెలంగాణలో 95 లక్షల ఓట్లు తొలగించారంటూ జరుగుతున్న ప్రచారంపై రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి (సీఈవో) సి. సుదర్శన్‌రెడ్డి స్పష్టత ఇచ్చారు. ఈ వార్తలో వాస్తవం లేదని.. ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియ ఇంకా కొనసాగుతోందని తెలిపారు. ఓటర్ల వివరాల పరిశీలన, నోటీసుల జారీ,

మిగతా 2లో..

## నీట్ విధానంలో మరిన్ని సంస్కరణలు

### పార్లమెంటరీ ప్యానెల్ సిఫార్సులు

### పరీక్ష ఆన్‌లైన్‌లో జరగాలని సూచన

ఈ ఏడాది నీట్ యూజీ 2026 ప్రశ్నాపత్రం లీక్ ఆరోపణలు, పరీక్ష రద్దు నేపథ్యంలో ఈ వ్యవహారంపై పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ తన రిపోర్టును విడుదల చేసింది. నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ నిర్వహించే జాతీయ స్థాయి పోటీ పరీక్షల్లో పారదర్శకతను పెంచడానికి, అక్రమాలను అరికట్టేందుకు కీలక సంస్కరణలను ప్రతిపాదించింది. ఇక్కడ చీ పార్లమెంటుకు (లోక్‌సభ, రాజ్యసభ) జవాబుదారీగా ఉండేలా చట్టపరమైన వ్యవస్థను ఏర్పాటు చేయాలని

మిగతా 2లో..



## మొదలైన దసరా సందడి

- సొంతూళ్లకు పయనమైన ప్రజలు
- కిటకిటలాడుతున్న బస్టాండ్‌లు
- ఇప్పటికే ఆర్టీసీ ముందస్తు ఏర్పాట్లు
- 7వేల స్పెషల్ బస్సులు సిద్ధం

రాష్ట్రంలో దసరా పండుగ సందడి మొదలైంది. సొంతూళ్లకు ప్రజలు ఇప్పటి నుంచే పయనమయ్యారు. వారి రాకతో హైదరాబాద్‌లో పలు బస్టాండ్‌లు ప్రయాణికులతో కిటకిటలాడుతున్నాయి. దసరా సెలవుల నేపథ్యంలో నగరవాసులు తమ సొంతూళ్లకు పయనమవుతున్నారు. ఫలితంగా వివిధ జిల్లాలతోపాటు ఆంధ్రప్రదేశ్‌కు వెళ్లే వారితో బస్టాండ్‌లలో రద్దీ నెలకొంది. పండుగ సందర్భంగా ప్రయాణికుల సౌకర్యం కోసం ఆర్టీసీ ప్రత్యేక బస్సులను ఏర్పాటుచేసింది.

మిగతా 2లో..



# సంపాదకీయం

## ఎల్‌నినో తీవ్ర ప్రభావం..

ఎల్‌నినో ప్రభావం రానున్న నెలల్లో మరింత బలపడనుందని ప్రపంచ వాతావరణ సంస్థ తెలిపింది. 2026 అక్టోబర్, నవంబర్, డిసెంబర్ నెలల్లో మధ్య, తూర్పు ఉష్ణమండల పసిఫిక్ మహాసముద్ర ఉపరితల ఉష్ణోగ్రతలు రికార్డు స్థాయికి చేరుకోవచ్చని అంచనా వేసింది. ఈ పరిణామం ప్రపంచవ్యాప్తంగా వాతావరణ పరిస్థితులు, పర్యావరణ వ్యవస్థలు, ఆర్థిక వ్యవస్థలు, ప్రజల జీవనంపై ప్రభావం చూపనుంది. 13 ప్రముఖ జాతీయ, అంతర్జాతీయ వాతావరణ కేంద్రాల అంచనాలను సమీక్షించిన తర్వాత ఈ నివేదికను రూపొందించారు.ఎల్‌నినో అనేది పసిఫిక్ మహాసముద్రంలోని భూమధ్యరేఖకు సమీప ప్రాంతాల్లో సముద్ర ఉపరితల ఉష్ణోగ్రతలు సాధారణం కంటే ఎక్కువగా పెరగడం వల్ల ఏర్పడే సహజ వాతావరణ పరిణామం. దీని కారణంగా గాలుల దిశ, వాతావరణ పీడనం, వర్షపాతం వంటి అంశాల్లో మార్పులు చోటుచేసుకుంటాయి. ఈ మార్పులు ప్రపంచంలోని వివిధ ప్రాంతాల వాతావరణంపై ప్రభావం చూపుతాయి. సాధారణంగా ప్రతి రెండు నుంచి ఏడేళ్లకు ఒకసారి ఎల్‌నినో ఏర్పడుతుంది. దీని ప్రభావం 9 నుంచి 12 నెలల పాటు కొనసాగుతుంది. ఎల్‌నినోకు వ్యతిరేకంగా పనిచేసే వాతావరణ దశను 'లా నినా' అంటారు. ఈ రెండింటి మధ్య సాధారణ పరిస్థితులు కూడా ఉంటాయి. ఎల్‌నినో ఇప్పటికే బలంగా ఏర్పడిందని, దాని తీవ్రత వేగంగా పెరుగుతోంది. 2027 ఫిబ్రవరి వరకు ఎల్‌నినో కొనసాగే అవకాశం ఉందనీ ఇది 1950 తర్వాత నమోదైన అత్యంత బలమైన ఎల్‌నినో ఘటనల్లో ఒకటి కావచ్చని అంచనా వేస్తున్నారు. ప్రస్తుతం సముద్రాలు గతంలో ఎన్నడూ లేనంత వేడిగా ఉండటంతో, విడుదలయ్యే వేడి పరిమాణం కూడా ఎక్కువగా ఉంటుంది. ఎల్‌నినో ప్రభావంతో ప్రపంచంలోని అనేక ప్రాంతాల్లో ఉష్ణోగ్రతలు సాధారణం కంటే ఎక్కువగా నమోదవుతాయి. అదే సమయంలో వర్షాలు కురిసే తీరులో మార్పులు వస్తాయి. ఫలితంగా కొన్ని ప్రాంతాల్లో వర్షాభావం, నీటి కొరత, పంట నష్టం తీవ్రమవుతాయి. మరికొన్ని ప్రాంతాల్లో భారీ వర్షాలు, వరదల ప్రమాదం పెరుగుతుంది. మధ్య అమెరికాలో ఇప్పటికే ఎల్‌నినో ప్రభావం కనిపిస్తోంది. అక్కడ కరువు కారణంగా పంటలు ఎండిపోయి, జంతువులు కూడా ప్రాణాలు కోల్పోతున్నాయి.సాధారణంగా ఎల్‌నినో ప్రభావం నవంబర్ నుంచి ఫిబ్రవరి మధ్య గరిష్ఠ స్థాయికి చేరుకుంటుంది. గతంలో ఏర్పడిన ఎల్‌నినో కూడా ప్రపంచ ఉష్ణోగ్రతలు పెరిగేలా చేసింది. 2023 సంవత్సరం రికార్డుల్లో రెండో అత్యంత వేడి సంవత్సరంగా నిలవగా, 2024 అత్యంత వేడి సంవత్సరంగా నమోదైంది. 2024లో ప్రపంచ సగటు ఉష్ణోగ్రత పారిశ్రామిక విప్లవానికి ముందు ఉన్న 1850–1900 సగటుతో పోలిస్తే సుమారు 1.55 డిగ్రీల సెల్సియస్ ఎక్కువగా. ఎల్‌నినో సహజ వాతావరణ పరిణామమే అయినప్పటికీ, గ్లోబల్ వార్మింగ్ దాని ప్రభావాన్ని తీవ్రతరం చేస్తోంది. మరోవైపు ఎల్‌నినో ప్రభావంతో ఆశించిన స్థాయిలో వర్షాలు కురవక నీటి వనరులు అడుగంటుతున్నాయి. రాష్ట్రంలో వ్యవసాయానికి చెరువులు, కుంటలే ఆధారం. ఇంతటి ప్రాధాన్యమున్నా ఏళ్లుగా నిర్వహణ లేక నానాటికీ తీసికట్టుగా మారుతున్నాయి. అలాగే పట్టణీకరణ, స్థిరాస్తి రంగం విస్తరణ, సాగు విస్తీర్ణం తగ్గిపోతుండటం. తదితర కారణాలతో చెరువులు, కుంటలు ఆక్రమణలకు గురై ఉనికి కోల్పోతున్నాయి. అయితే 2017–18 నుంచి 2023–24 మధ్య రాష్ట్రంలో 6,249 అంతరించిపోయినట్లు కేంద్ర జలశక్తి శాఖ నిర్వహించిన ఏడో మైనర్ ఇరిగేషన్ సెన్సెస్ తాజా నివేదికలో పేర్కొంది.రాష్ట్రంలో ఉన్న 18,40,578 పథకాల్లో 17,46,208 భూగర్భ జల, 94,370 ఉపరితల జల పథకాలు ఉన్నాయి. భూగర్భ జల పథకాలతో పోల్చితే చిన్న నీటి వనరుల ఉనికి వేగంగా తగ్గిపోతూ వస్తోంది. చెరువులు, కుంటలు, చెక్‌డ్యాంలు, తదితర వనరుల సంఖ్య ఏటికేడు తగ్గుతోంది. 2017–18లో ఉపరితల జల వనరులు 1,00,619 ఉన్నాయి. 2023–24కు వచ్చేసరికి 94,370కు చేరుకున్నాయి. ఈ ఆరేళ్ల కాలంలో 6.2 శాతం తగ్గిపోయాయి. రాష్ట్రంలో 52,829 చెరువులు, కుంటలు, చెక్‌డ్యాంలు ఉన్నాయి. 41,541 లిఫ్టులు ఉన్నాయి. రైతులు సాగునీటి కోసం ఎక్కువ శాతం బోరుబావుల మీదనే ఆధారపడుతున్నారు. ప్రతి ఏటా వేల సంఖ్యలో కొత్త బోర్లు వేయిస్తున్నారు. 2017–18లో భూగర్భ జల పథకాలు 15,79,249 ఉండగా 2023–24కు వచ్చేసరికి 10.6 శాతం పెరిగి (1,66,959 నుంచి 17,46,208)కి చేరాయి. వీటిలో ఎక్కువ లోతులో ఉన్న బోర్లు 4,83,985, మధ్యస్త లోతులో ఉన్నవి 7,08,815 తక్కువ లోతులోనివి 71,798 బావులు 4,81,610 ఉన్నాయి. రాష్ట్రంలో బోర్లపై ఆధారపడుతున్న రైతుల్లో అధికంగా ఉన్నది సన్నకారు రైతులే ఉన్నారు. సర్కారు యాజమాన్యం కింద 40,085 పథకాలు ఉంటే వ్యక్తిగత యాజమాన్య పథకాల్లో ఏకంగా 15,55,728 సన్నకారు రైతుల కిందనే ఉన్నాయి. వాటిలోనూ బోరు బావులే ఎక్కువ. 99 శాతం నీటి వనరుల గ్రామీణ ప్రాంతాల్లో ఉండగా పట్టణ ప్రాంతాల్లో ఉన్నవి కేవలం 1 శాతం. జల వనరుల్లో చెరువులు 45.05 శాతం ఉంటే, సరస్సులు 32.09 శాతం. ఇవన్నీ స్థానికంగా గృహ అవసరాలు, సంప్రదాయ వ్యవసాయ అవసరాలు తీరుస్తున్నాయి. నీటి వనరుల్లో 11.84 శాతం గిరిజన ప్రాంతాల్లో ఉన్నాయి. వీటిని ఎక్కువగా చేపల పెంపకానికి ఉపయోగిస్తున్నారు. పునరుద్ధరించిన 367 నీటి వనరుల్లో 192 చెరువులు, 115 సరస్సులు, 55 చెక్‌డ్యాంలు, మూడు లేక్స్, 2 రిజర్వాయర్లు ఉన్నాయి. రాష్ట్రంలోని గ్రామాల్లో నీటి వనరులు 53,244 ఉంటే పట్టణాల్లో 441 ఉన్నాయి. ఇందులో 87.45 శాతం ప్రభుత్వ, 12.55 శాతం ప్రైవేటు ఆధీనంలో ఉన్నాయి. రాష్ట్రంలోని మొత్తం నీటి వనరుల్లో 84.81 శాతం వినియోగంలో ఉన్నాయి. తొలి గణనలో వినియోగం 80.76 శాతమే. వినియోగంలో లేని నీటి వనరుల వాటా 19.24 శాతం నుంచి 15.19 శాతానికి తగ్గింది. వ్యవసాయ వినియోగ వనరులు 30,973. భూగర్భ జలాల వృద్ధి కోసం అందుబాటులోకి 12,519. పారిశ్రామిక అవసరాలకు 254 అందుబాటులో ఉన్నాయి. ఏది ఏమైనా ఈ సారి ప్రజలు అప్రమత్తంగా ఉండాలని నిపుణులు కోరుకుంటున్నారు.

## నీట్ విధానంలో మరిన్ని సంస్కరణలు

మొదటిపేజీ తరువాయి..

విద్యా వ్యవహారాలపై ఏర్పాటైన పార్లమెంటరీ స్థాయీ సంఘం సూచించింది. పరీక్షల నిర్వహణపై విద్యార్థులు, వారి తల్లిదండ్రులు సహా ప్రజల్లో నమ్మకాన్ని నిలబెట్టడం చాలా ముఖ్యమని స్పష్టం చేసింది. పరీక్షలపై విశ్వాసం దెబ్బతినకుండా చూసేందుకు తగిన పార్లమెంటరీ వ్యవస్థను విద్యాశాఖ ప్రవేశపెట్టాలని కమిటీ తెలిపింది. పరీక్షల్లో అక్రమాలకు పాల్పడాలనుకునే వ్యవస్థీకృత నెట్‌వర్క్‌లు నిరంతరం కొత్త మార్గాలను అన్వేషిస్తుంటాయని, పరీక్ష నిర్వహణలోని బలహీనతలను ఉపయోగించుకునేందుకు చూస్తాయని పేర్కొంది. ఈ నేపథ్యంలో అన్ని ముందస్తు జాగ్రత్తలు తీసుకున్నప్పటికీ నీట్ 2026 పరీక్షను రద్దు చేయాల్సి రావడం మాత్రం సంస్థాగత, విధానపరమైన లోపాలను సృష్టిస్తోందని కాంగ్రెస్ ఎంపీ దిగ్విజయ సింగ్ నేతృత్వంలోని ఈ కమిటీ అభిప్రాయపడింది. అందుకే ఎన్‌టీఏలో తగినంత సిబ్బంది, పటిష్టమైన భద్రతా విధానాలు, స్పష్టమైన జవాబుదారీ వ్యవస్థలు ఉండాలని సూచించింది. ముఖ్యంగా ప్రశ్నాపత్రాలను తయారు చేసే అధ్యాపకులు, నిపుణుల గత చరిత్ర ముఖ్యంగా నైతికతను పరిశీలించడానికి ఒక ప్రత్యేక ట్రాకింగ్ వ్యవస్థను ఏర్పాటు చేయాలని సిఫార్సు చేసింది. క్వశ్చన్ పేపర్లు తయారు చేసే వారికి కూడా ఏ ప్రశ్నలు పరీక్షలు వస్తున్నాయో ముందుగా తెలియకుండా ఉండేలా ఎన్‌టీఏ పెద్ద క్వశ్చన్ బ్యాంకులను రూపొందించాలని స్పష్టం చేసింది. ఇదే సమయంలో కంప్యూటర్ బేస్డ్ ఆటోమేటెడ్ సిస్టమ్ ద్వారా చివరి క్షణంలో ప్రశ్నలను ఎంపిక చేసే విధానం రావాలని కమిటీ పేర్కొంది. పెన్ అండ్ పేపర్ పద్ధతిలో నిర్వహించే నీట్‌లో ప్రశ్నాపత్రాల లీకేజీ ప్రమాదం ఎక్కువగా ఉందన్న కమిటీ, దీనిని అధిగమించడానికి నీట్ యూజీని పూర్తి స్థాయిలో కంప్యూటర్ బేస్డ్ టెస్టుగా నిర్వహించాలని రికమెండ్ చేసింది. ఇదే సమయంలో ప్రైవేట్ పరీక్షా కేంద్రాలపై ఆధారపడటాన్ని తగ్గించి, ప్రభుత్వ యాజమాన్యంలోని సంస్థలు, డిజిటల్ కేంద్రాల ద్వారానే ప్రవేశ పరీక్షలు నిర్వహించాలని సూచించింది. కొన్ని కారణాల వల్ల పరీక్ష కేంద్రాలకు కొద్దిగా ఆలస్యంగా వచ్చే విద్యార్థులను అండర్‌టేకింగ్ తీసుకొని పరీక్ష రాయడానికి అనుమతించాలని పార్లమెంటరీ ప్యానెల్ పేర్కొంది. ఈ ఏడాది మే 3న దేశవ్యాప్తంగా 551 నగరాలు, విదేశాల్లోని 14 కేంద్రాల్లో నీట్ యూజీ పరీక్ష నిర్వహించగా, సుమారు 22 లక్షల మందికిపైగా విద్యార్థులు హాజరయ్యారు. అయితే వ్యవస్థీకృత ముఠాలు ప్రశ్నాపత్రాన్ని లీక్ చేశారన్న ఆరోపణలతో మే 12న ఎన్‌టీఏ ఈ పరీక్షను రద్దు చేసింది. తర్వాత కేంద్ర ప్రభుత్వం ఆమోదంతో జూన్ 21న నీట్ యూజీ 2026 రీ ఎగ్జామ్ నిర్వహించారు. ఇక ఈ కేసును విచారించిన కేంద్ర దర్యాప్తు సంస్థ ఒక కెమిస్ట్రీ లెక్చరర్‌ను అరెస్ట్ చేసింది.

# తంగేడు పువ్వెక్కడ ?

మొదటిపేజీ తరువాయి..

పూలను కొనుగోలు చేసి బతుకమ్మలను అలంకరించుకోవాల్సి వస్తుందని కొందరు మహిళలు పేర్కొంటున్నారు. పండుగ సమయానికి పూలకు డిమాండ్ పెరగడంతో ధరలు కూడా భారంగా మారుతున్నాయని అంటున్నారు.



సహజంగా లభించే తంగేడు పూల కోసం గతంలో పెద్దగా ఖర్చు చేయాల్సిన అవసరం ఉండేది కాదని, ప్రస్తుతం పూల సేకరణకు సమయం వెచ్చించడంతో పాటు కొనుగోళ్లకు డబ్బు ఖర్చు చేయాల్సి వస్తుందని చెబుతున్నారు.

### సంప్రదాయానికి దూరమవుతున్నామా? :

బతుకమ్మ పండుగ కేవలం పూలను పేర్చే వేడుక మాత్రమే కాదు. ప్రకృతితో మమేకమై, కుటుంబ సభ్యులు, స్నేహితులు, గ్రామీణ మహిళలంతా కలసి జరుపుకునే సాంస్కృతిక ఉత్సవం. తంగేడు పూలను సేకరించడం నుంచి బతుకమ్మను పేర్చడం వరకు ప్రతి అంశంలోనూ సంప్రదాయం, సామూహిక భాగస్వామ్యం కనిపిస్తాయి. తంగేడు పూలు అందుబాటులో లేకపోవడం వల్ల ఆ అనుభూతి తగ్గిపోతుందేమోనని మహిళలు, యువతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. "తంగేడు పూలు దొరకకపోతే బతుకమ్మను ఎలా పేర్చుకోవాలి? మన సంప్రదాయాన్ని తరువాతి తరాలకు ఎలా అందించాలి?" అని వారు ప్రశ్నిస్తున్నారు.

### నేటి నుంచి సద్దుల బతుకమ్మ సందడి:

సద్దుల బతుకమ్మ వేడుకలు ప్రారంభం కావడంతో మహిళలు, యువతులు పండుగ ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. పూల సేకరణ, కొనుగోళ్లు, బతుకమ్మల అలంకరణలతో పండుగ వాతావరణం నెలకొంటుంది. ఈ సమయంలో తంగేడు పూల లభ్యతపై చర్చ సాగుతుంది. సంప్రదాయ పూలకు కొరత ఏర్పడకుండా సంబంధిత శాఖలు సహజ వృక్ష సంపద పరిరక్షణపై దృష్టి సారించాలని పలువురు కోరుతున్నారు.

### తంగేడు మొక్కలను కాపాడాల్సిన బాధ్యత ;

తంగేడు మొక్కలను పరిరక్షించడం, అందుబాటులో ఉన్న సహజ మొక్కలను సంరక్షించడం, స్థానిక పరిస్థితులకు అనుగుణంగా కొత్త మొక్కలను పెంచడం ద్వారా భవిష్యత్తు తరాలకు ఈ సంప్రదాయాన్ని అందించవచ్చని ప్రకృతి ప్రేమికులు సూచిస్తున్నారు. గ్రామాలు, పాఠశాలలు, కళాశాలలు, స్థానిక సంస్థల భాగస్వామ్యంతో తంగేడు మొక్కల పెంపకంపై అవగాహన కల్పించాల్సిన అవసరం ఉంది. బతుకమ్మ పండుగలో ప్రకృతిని పూజించే సంప్రదాయం కొనసాగాలంటే ప్రకృతిలోని పూలను కాపాడుకోవడంపైనా సమాజం దృష్టి పెట్టాల్సిన సమయం ఆసన్నమైంది.
ప్రకృతిని కాపాడితేనే సంప్రదాయాలకు భవిష్యత్తు. తంగేడు పూల పరిరక్షణకు ఇప్పటి నుంచే చర్యలు చేపడితేనే రాబోయే తరాల బతుకమ్మల్లోనూ పసుపు తంగేడు పూల పరిమళం కొనసాగుతుంది.

# మొదలైన దసరా సందడి

మొదటిపేజీ తరువాయి..

రాష్ట్రవ్యాప్తంగా 7 వేల ప్రత్యేక బస్సులను నడుపుతోంది. ఇవాళ్టి నుంచి ఈనెల 18న తేదీ వరకు వివిధ జిల్లాలకు ప్రత్యేక బస్సులు అందుబాటులో ఉంటాయి. ఈనెల 20వ తేదీ నుంచి 26 వరకు ప్రయాణికుల తిరుగు ప్రయాణం కోసం బస్సులను ఏర్పాటు చేయనుంది. దసరాకు ప్రభుత్వం ఈ నెల 10 నుంచి 22 వరకు పాఠశాలలకు సెలవులను ప్రకటించింది. తెలంగాణలో ఎంగిలిపూల బతుకమ్మతో రేపటి నుంచి బతుకమ్మ పండుగ ప్రారంభం కానుంది. ఈనెల 18వ తేదీన సద్దుల బతుకమ్మ వేడుకలతో ఈ వేడుకలు ముగియనున్నాయి. ప్రభుత్వ పరంగానూ బతుకమ్మ పండుగను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాటుచేసినట్లు ఇటీవల మంత్రి సీతక్క తెలిపారు. ప్రభుత్వం తరపున 18న హైదరాబాద్ ట్యాంక్‌బండ్‌పై ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించనున్నారు. సాయంత్రం 5 గంటల నుంచి రాత్రి 10 గంటల మధ్య వేడుకలు జరగనున్నాయి. మరోవైపు తెలంగాణ ఆర్టీసీ సంస్థ దసరా కోసం ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేసింది.ప్రయాణికులకు రవాణా సౌకర్యం కోసం సురక్షితంగా, సౌకర్యవంతంగా తమ స్వగ్రామాలకు చేరుకునేందుకు తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ భారీ ఏర్పాట్లు చేసింది. పండుగ రద్దీని దృష్టిలో ఉంచుకుని రాష్ట్రవ్యాప్తంగా సుమారు 7,000 ప్రత్యేక బస్సులను నడపనున్నట్లు బుధవారం ప్రకటించింది. రాష్ట్రంలోని వివిధ జోన్ల నుంచి వేల సంఖ్యలో సర్వీసుల ఏర్పాటు చేస్తున్నట్లుగా సంస్థ వెల్లడించింది. ఆర్టీసీ అధికారుల ప్రకారం కరీంనగర్ జోన్ పరిధిలో అత్యధికంగా 3,533 బస్సులు (ఆదిలాబాద్ 431, నిజామాబాద్ 719, కరీంనగర్ 1,175, వరంగల్ 530, ఖమ్మం 678) నడపనున్నారు. హైదరాబాద్ జోన్ నుంచి 2,155 బస్సులు (మహబూబ్‌నగర్ 645, మెదక్ 255, నల్గొండ 815, రంగారెడ్డి 440), గ్రేటర్ హైదరాబాద్ జోన్ నుంచి 1,312 ప్రత్యేక సర్వీసులు అందుబాటులో ఉంటాయి. అక్టోబర్ 9, 10, 16, 17 తేదీల్లో ప్రయాణికుల రద్దీ అధికంగా ఉంటుందని అంచనా వేస్తుండగా, తిరుగు ప్రయాణాల కోసం అక్టోబర్ 25, 26 తేదీల్లో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఈ ఏడాది ప్రయాణికుల సౌకర్యార్థం టీజీఎస్‌ఆర్టీసీ ఒక నూతన సదుపాయాన్ని అందుబాటులోకి తీసుకువచ్చింది. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని కాలనీలు, టౌన్‌షిప్‌లు, గేటెడ్ కమ్యూనిటీలు, హాస్టళ్లు, కళాశాలల నుంచి కనీసం 30 మంది ప్రయాణికులు ఒక బృందంగా ఏర్పడి ముందస్తుగా బుక్ చేసుకుంటే, వారి వద్దకే బస్సును పంపి పికప్ చేసుకునే వెసులుబాటు కల్పించింది. ఈ ప్రత్యేక బస్సు సర్వీసులకు రాష్ట్ర ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం టికెట్ ధరలను సవరించినట్లుగా టీజీఎస్‌ఆర్టీసీ అధికారులు వెల్లడించారు. అయితే గతంలో పండుగల సమయంలో టికెట్ ధరపై అదనంగా మరో 50 శాతం వసూలు చేసేవారు. ఈసారి దసరాకు వేర్వేరు జోన్ల ప్రకారం ఏసీ, వాల్వో, సూపర్ లగ్జరీ స్పెషల్ బస్సుల్లో వేర్వేరు ఛార్జీలు వసూలు చేయనుంది.మహాలక్ష్మి పథకం ప్రకారం అర్హత కలిగిన పల్లె వెలుగు, ఎక్స్‌ప్రెస్, సిటీ ఆర్డినరీ, మెట్రో ఎక్స్‌ప్రెస్ (సాధారణ మరియు ప్రత్యేక) సర్వీసులలో మహిళలు ఉచితంగా ప్రయాణించడం కొనసాగించవచ్చని పేర్కొంది. ఇక దసరా స్పెషల్ బస్సుల్లో అడ్వాన్స్ బుకింగ్ కోసం వెబ్ సైట్ ద్వారా టికెట్ బుక్ చేసుకోవచ్చు. ఏదైనా సందేహాలు, సలహాలు ఆర్టీసీ సమాచారం కోసం( 040–69440000 / 040–23450033) ఈ హెల్ప్ లైన్ నంబర్లకు ఫోన్ చేయగలరు. ఈసందర్భంగా దసరా, దీపావళి పండుగలకు వెళ్లే ప్రయాణికులు ప్రైవేట్ రవాణా సౌకర్యాలను కాకుండా ప్రజా రవాణా సంస్థగా పేరున్న టీజీఎస్ ఆర్టీసీ బస్సుల్లో తమ ప్రయాణాలు కొనసాగించి సంస్థ పురోగాభివృద్ధికి తోడ్పడాలని ఆర్టీసీ సంస్థ ప్రకటించింది. ఈ స్పెషల్ బస్సు సేవలను అందరూ ఉపయోగించుకోవాలని పిలుపునిచ్చింది.

# 95 లక్షల ఓట్ల తొలగింపు..

మొదటిపేజీ తరువాయి..

విచారణల అనంతరం అర్హత నిర్ధారణ వంటి దశలు పూర్తయిన తర్వాతే తుది జాబితాపై స్పష్టత వస్తుందని వెల్లడించారు. ప్రస్తుతం ఉన్న గణాంకాలను ఆధారంగా చేసుకుని 95 లక్షల ఓట్లు తొలగించినట్లు చెప్పడం సరైంది కాదని ఆయన పేర్కొన్నారు. ఎన్నికల జాబితా సవరణలో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా 73,39,235 మంది ఓటర్లను ఏఎస్‌డీడీ కేటగిరీలో గుర్తించినట్లు సీఈవో వివరించారు. ఈ ఏఎస్‌డీడీ విభాగంలో గైర్హాజరైనవారు, ఇతర ప్రాంతాలకు తరలివెళ్లినవారు, మరణించినవారు, ఒకటి కంటే ఎక్కువ చోట్ల పేర్లు నమోదైనవారు ఉంటారని పేర్కొన్నారు. అయితే ఈ కేటగిరీలో చేర్చిన సంఖ్యనే తుది జాబితా నుంచి శాశ్వతంగా తొలగించిన ఓట్ల సంఖ్యగా పరిగణించకూడదని ఎన్నికల అధికారులు స్పష్టం చేశారు. సంబంధిత ఓటర్ల వివరాలను పరిశీలించి, నోటీసుల ప్రక్రియను పూర్తి చేసి, అర్హతపై నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుంది. అందువల్ల ముసాయిదా జాబితాలో జరిగిన మార్పులను తుది తొలగింపులుగా భావించడం సరికాదు. ఓటర్ల వివరాల్లో ఉన్న వ్యత్యాసాలు, పాత రికార్డులతో వివరాలను అనుసంధానించలేకపోవడం వంటి కారణాలతో మొత్తం 92,88,187 నోటీసులు జారీ చేసినట్లు సీఈఓ సుదర్శన్‌రెడ్డి తెలిపారు. వీటిలో 92,23,486 నోటీసులు సంబంధిత ఓటర్లకు అందజేశారు. మరో 64,701 నోటీసుల పంపిణీ ఇంకా పూర్తి కావాల్సి ఉందని వెల్లడించారు. నోటీసులు అందుకున్న ఓటర్లు తమ వివరాలను సమర్పించి, అవసరమైన పత్రాలతో విచారణకు హాజరయ్యే అవకాశం ఉందని ఎన్నికల అధికారులు చెబుతున్నారు. ఆ తర్వాత ఈ ప్రక్రియ ద్వారా ఓటర్ల అర్హతను నిర్ధారించి, తుది జాబితాలో పేర్లను చేర్చాలా లేదా అనే అంశంపై నిర్ణయం తీసుకోనున్నారు.సీఈవో వెల్లడించిన వివరాల ప్రకారం.. ఇప్పటివరకు 82,11,205 మంది ఓటర్లకు సంబంధించిన విచారణలు పూర్తి అయ్యాయి. తుది ఓటర్ల జాబితాలో చోటు కల్పించేందుకు 74,62,851 మందిని అర్హులుగా గుర్తించారు. మరో 12,969 మందిని అనర్హులుగా గుర్తించినట్లు తెలిపారు. ఇంకా 18,12,367 మంది ఓటర్లకు సంబంధించిన కేసులపై నిర్ణయాలు తీసుకోవాల్సి ఉందని పేర్కొన్నారు. ఈ గణాంకాలు చూపిస్తున్నట్లుగా.. ఓటర్ల అర్హత నిర్ధారణ ప్రక్రియలో ఇంకా కొన్ని దశలు మిగిలి ఉన్నాయి. అందువల్ల తుది జాబితా ప్రచురణకు ముందే భారీ సంఖ్యలో ఓట్లు తొలగిపోయాయని నిర్ధారించడం సరికాదని ఎన్నికల అధికారులు చెబుతున్నారు. పెండింగ్‌లో ఉన్న నోటీసులు, క్లెయిమ్‌లు, అభ్యంతరాలపై నవంబర్ 5వ తేదీలోగా నిర్ణయాలు తీసుకోవాలని ఎన్నికల యంత్రాంగం లక్ష్యంగా పెట్టుకుంది. ఆ తర్వాత తుది ఓటర్ల జాబితాను నవంబర్ 9వ తేదీన ప్రచురించేందుకు షెడ్యూల్ ఉంది. మిగిలిన కేసులను గడువులోగా పరిష్కరించి.. అర్హులైన ఓటర్ల పేర్లను తుది జాబితాలో చేర్చే ప్రక్రియ కొనసాగుతుందని సీఈవో తెలిపారు. ఓటర్ల జాబితాలో తమ పేరు ఉందో లేదో ప్రతి ఒక్కరూ పరిశీలించుకోవడం ముఖ్యమని ఎన్నికల అధికారులు పేర్కొంటున్నారు. నోటీసు అందినవారు దాన్ని నిర్లక్ష్యం చేయకుండా.. అధికారులు సూచించిన విధంగా స్పందించి అవసరమైన ఆధారాలను సమర్పించాలని చెబుతున్నారు.




పేర్లు, అడ్రస్‌లు, ఇతర వివరాల్లో తప్పులు ఉంటే వాటిని సరిచేసుకునేందుకు ఎన్నికల అధికారులను సంప్రదించాల్సి ఉంటుందని వివరించారు. మొత్తంగా తెలంగాణలో 95 లక్షల ఓట్లు ఇప్పటికే తొలగించారన్న ప్రచారాన్ని సీఈవో సుదర్శన్ రెడ్డి ఖండించారు. ప్రస్తుతం కొనసాగుతున్నది ఓటర్ల వివరాల పరిశీలన, అర్హత నిర్ధారణ ప్రక్రియ మాత్రమేనని స్పష్టం చేశారు. పెండింగ్ కేసులపై నిర్ణయాలు, తుది జాబితా ప్రచురణ తర్వాతే ఓటర్ల సంఖ్యపై పూర్తి స్పష్టత రానుంది.

## భారత సంతతి మహిళ నవనీతమ్ పిళ్లైకి నోబెల్ శాంతి పురస్కారం

మొదటిపేజీ తరువాయి..

చేయడంలో ఆమె పోషించిన పాత్రకు ఈ గౌరవం దక్కింది. నవనీతం నవి పిళ్లై 1941 సెప్టెంబర్ 23న దక్షిణాఫ్రికాలోని డర్బన్‌లో జన్మించారు. భారతీయ తమిళ మూలాలున్న కుటుంబానికి చెందిన ఆమె, న్యాయ విద్యను అభ్యసించి అంతర్జాతీయ న్యాయ నిపుణురాలిగా ఎదిగారు. నాటల్ విశ్వవిద్యాలయంలో డిగ్రీలు పూర్తి చేసిన అనంతరం అమెరికాలోని హార్వర్డ్ విశ్వవిద్యాలయం నుంచి ఉన్నత న్యాయ పట్టాలు పొందారు. వర్ణవివక్ష కొనసాగుతున్న సమయంలోనే ఆమె తన న్యాయవాద వృత్తిని ప్రారంభించారు. ఆ కాలంలో జాతి వివక్షకు వ్యతిరేకంగా పోరాడిన కార్యకర్తలకు న్యాయ సహాయం అందించారు. జైళ్లలో ఖైదీలపై హింస, అమానవీయ ప్రవర్తనకు వ్యతిరేకంగా గళమెత్తారు. మహిళల హక్కులు, లింగ సమానత్వం కోసం కూడా నిరంతరం కృషి చేశారు. 1995లో దక్షిణాఫ్రికా హైకోర్టులో న్యాయమూర్తిగా నియమితులైన నవి పిళ్లై, ఆ పదవిని చేపట్టిన తొలి శ్వేతజాతీయేతర మహిళగా గుర్తింపు పొందారు. వివక్షకు వ్యతిరేకంగా సాగిన ఆమె ప్రస్థానం అంతర్జాతీయ న్యాయరంగంలోనూ కీలక బాధ్యతలు చేపట్టేందుకు మార్గం సుగమం చేసింది. 1995లో రువాండా అంతర్జాతీయ నేర న్యాయస్థానంలో న్యాయమూర్తిగా ఎన్నికైన ఆమె, 1999 నుంచి 2003 వరకు ఆ న్యాయస్థానానికి అధ్యక్షత వహించారు. అనంతరం అంతర్జాతీయ క్రిమినల్ కోర్టులో న్యాయమూర్తిగా పనిచేశారు. యుద్ధ నేరాలు, మానవత్వానికి వ్యతిరేకమైన నేరాలపై విచారణలు, బాధితులకు న్యాయం అందించే ప్రక్రియల్లో అంతర్జాతీయ న్యాయ వ్యవస్థల పాత్రను బలోపేతం చేయడంలో ఆమె సేవలు కీలకంగా నిలిచాయి. 2008 నుంచి 2014 వరకు నవి పిళ్లై ఐక్యరాజ్యసమితి మానవ హక్కుల హైకమిషనర్‌గా పనిచేశారు. ఈ సమయంలో ప్రపంచవ్యాప్తంగా మానవ హక్కుల ఉల్లంఘనలు, వివక్ష, మహిళలపై హింస వంటి అంశాలపై దృష్టి సారించారు. బాధితులకు న్యాయం అందించడంతోపాటు, ప్రభుత్వాలు తమ చర్యలకు జవాబుదారీగా ఉండాలనే అంశానికి ప్రాధాన్యం ఇచ్చారు. ఆక్రమిత పాలస్తీనా భూభాగాలు, తూర్పు జెరూసలేం, ఇజ్రాయెల్‌కు సంబంధించిన అంశాలపై విచారణ జరిపిన ఐక్యరాజ్యసమితి స్వతంత్ర అంతర్జాతీయ విచారణ కమిషన్‌కు కూడా ఆమె అధ్యక్షత వహించారు. ఈ కమిషన్ అంతర్జాతీయ మానవ హక్కుల చట్టాలు, అంతర్జాతీయ మానవతా చట్టాల ఉల్లంఘనలకు సంబంధించిన ఆరోపణలను పరిశీలించింది. వివిధ వర్గాల బాధ్యత, జవాబుదారీతనంపై కమిషన్ నివేదికలు అంతర్జాతీయ చర్చకు దారితీశాయి. నవి పిళ్లైకి నోబెల్ శాంతి బహుమతి ప్రకటించడం అంతర్జాతీయ న్యాయ వ్యవస్థలు, మానవ హక్కుల పరిరక్షణ ప్రాధాన్యాన్ని మరోసారి చాటిచెప్పింది. జాతి వివక్షకు వ్యతిరేకంగా న్యాయవాదిగా ప్రారంభమైన ఆమె ప్రయాణం, ఐక్యరాజ్యసమితి అత్యున్నత బాధ్యతల వరకు కొనసాగింది. శాంతి అంటే కేవలం యుద్ధాలు లేకపోవడం మాత్రమే కాదని, న్యాయం, సమానత్వం, మానవ గౌరవం, చట్టాల అమలు కూడా అందులో భాగమని ఆమె సుదీర్ఘ ప్రస్థానం గుర్తుచేస్తోంది. భారతీయ తమిళ మూలాలున్న దక్షిణాఫ్రికా మహిళకు దక్కిన ఈ అంతర్జాతీయ గౌరవం ఆమె జీవితకాల సేవలకు గుర్తింపుగా నిలిచింది.

## కెప్టెన్ స్మిత్ మచ్చర్‌కి ఇజ్రాయెల్ అత్యున్నత శౌర్య పురస్కారం

మొదటిపేజీ తరువాయి..

స్మిత్ మచ్చర్‌కు అంతర్జాతీయ స్థాయిలో అత్యున్నత గౌరవం దక్కింది. ఆపద సమయంలో ఆయన చూపిన సాటిలేని తెగువ, సమయస్ఫూర్తికి గుర్తింపుగా ఇజ్రాయెల్ ప్రభుత్వం తమ దేశపు అత్యున్నత శౌర్య పురస్కారమైన 'ప్రెసిడెన్షియల్ అవార్డ్ ఫర్ సివిలియన్ హీరోయిజం'ను అధికారికంగా ప్రకటించింది. ఇజ్రాయెల్ అధ్యక్షుడు ఐజాక్ హెర్జోగ్ ఈ ప్రతిష్టాత్మక అవార్డును కెప్టెన్ స్మిత్ మచ్చర్‌కు అందజేస్తున్నట్లు స్వయంగా వెల్లడించారు. సెప్టెంబర్ 30వ తేదీన దుబాయ్ నుంచి ఇజ్రాయెల్ వైపు పయనిస్తున్న విమానం కాక్‌పిట్ లోపల అత్యంత దిగ్భ్రాంతికర సంఘటన చోటుచేసుకుంది. విమానం గాల్లో ఉండగానే కో–పైలట్ ఊహించని రీతిలో కెప్టెన్ స్మిత్ మచ్చర్‌పై దాడికి తెగబడ్డాడు. ఈ అకస్మాత్తు దాడి వల్ల కెప్టెన్ తీవ్రంగా గాయపడ్డారు. శరీరం నుంచి విపరీతంగా రక్తస్రావం కావడం, కంటిచూపు మసకబారడం వంటి తీవ్రమైన శారీరక క్లిష్ట పరిస్థితులు ఎదురైనప్పటికీ.. కెప్టెన్ స్మిత్ ఏమాత్రం ఆత్మవిశ్వాసం కోల్పోలేదు. అత్యంత క్లిష్టమైన ఆ క్షణాల్లోనూ ధైర్యాన్ని కూడగట్టుకుని, చాకచక్యంగా కాక్‌పిట్ తలుపులను తెరిచి ప్రయాణికులను కాపాడారు.ప్రాణాలు పోయే స్థితిలో ఉన్న విమానంలోని ప్రయాణికులను కాపాడాలనే పట్టుదలతో.. ప్రాణమంతా బిగబట్టుకుని మరీ కాక్‌పిట్ తలుపులు తెరవగా.. పరిస్థితిని అర్థం చేస్కున్న ప్రయాణికుల్లోని డెంటిస్ట్, ఓ వ్యాపారి, ప్లంబర్, బ్యాంకర్లుఒక్కసారిగా కాక్‌పిట్‌లోకి వచ్చి దాడి చేస్తున్న వ్యక్తిని అడ్డుకున్నారు. అలాగే ప్రాణాపాయంలో ఉన్న కెప్టెన్ స్మిత్ మచ్చర్‌కు ప్రాథమిక చికిత్స చేశారు. అయితే విమానంలో ప్రయాణిస్తున్న మరో ఇద్దరు ఆఫ్–రోస్టర్ పైలట్లు విమానాన్ని సురక్షితంగా ల్యాండ్ చేశారు.

**CHANGE OF NAME**

I, BOGGULA GANESH, S/o MANOJ RAJARAM BHANGALE, Age: 6 years, Address: H.No. 2-52/16A, Near Hanuman Temple, Adilabad Mandal, Adilabad District, Telangana – 504001 hereby declare that my son's name has been wrongly entered in his Birth Certificate. Hence, as per his Aadhaar Card, his name shall hereafter be known as **BOGGULA ANIRUDH**, S/o BOGGULA GANESH, for all future purposes.

## బీజేపీ ఓబీసీ మోర్చా బాసర మండల అధ్యక్షుడు రువ్వాడ్ జలంధర్ కు ఘన సన్మానం

నమ్మి పదవి ఇచ్చినందుకు పార్టీ ఋణం తీర్చుకుంటా : జలంధర్



**బాసర అక్టోబర్ 9 (ప్రజా జ్యోతి) :** బాసర: నూతనంగా ఎన్నికైన బీజేపీ ఓబీసీ మోర్చా బాసర మండల అధ్యక్షుడు రువ్వాడ్ జలంధర్ ను బాసర మండల రెడ్డిక సంఘం ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఇలాంటి ఎన్నో ఉన్నత పదవులు చేపట్టాలని రెడ్డి కా సంఘ సభ్యులు కోరారు

ఈ కార్యక్రమంలో పుట్టి గంగాధర్, కిషోర్ కల్లోల, గడ్డం రాజేందర్, సందోళ్ల రవి, గడ్డం గణేష్, గడ్డం సాయికుమార్, రెడ్డిక సంఘం సభ్యులు పాల్గొన్నారు.

## సిరికొండ మండలాన్ని కరువు మండలం ప్రకటించాలి

బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో తాసిల్దార్‌కు వినతి



**సిరికొండ, అక్టోబర్ 9, (ప్రజా జ్యోతి) :** సిరికొండ మండలాన్ని కరు వు మండలం గా ప్రకటించా లని సిరికొండ మండల బీ ఆర్ఎస్ పార్టీ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం ఆ పార్టీ నా యకులు ఓరగంటి పెంటన్న, రోహిదాస్, సూర్యకాంత్, అమృత్ రావ్, సూర్యకాం త్, సునీల్, చిన్న రాజన్న, రాజారాం, రాజధానీ తది తరులు స్థానిక తహసీల్దార్ కు ఒక వినతి పత్రం సమ ర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎల్ నినో ప్రభావం వల్ల మండలంలో వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయని, పంటల దిగుబడి పూర్తిగా తగ్గిందని, కనీసం పెట్టిన పెట్టుబడులు కూడా వెల్ల లేదని, దీని దృ ష్ట్యా మండలంను కరువు ప్రాంతంగా ప్రకటించి, కరు వు నివారణ చర్యలు తీసు కోవాలని డిమాండ్ చేశారు. ఎల్ని నో ప్రభావంతో సరైన వర్షాలు కురవక రైతులు వేసిన పంటలు సో యా, పత్తి, మొక్కజొన్న, తదితర పంటలు ఎండి పోయి రైతులు దిగుబడి రాక ఇబ్బందులు ఎదుర్కొంటు న్నారని, రైతులందరూ ఆందోళన చెందుతూ ఆత్మహ త్య చేసుకునే పరిస్థితిలు ఏర్పడ్డాయని, వెంటనే సిరికొండ మండలాన్ని కరువు మండలంగా ఏర్పాటు చే యాలని కోరారు. శుక్రవారం సిరికొండ మండల కేంద్రం లోని తాసిల్దార్ కార్యాల యంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు తాసిల్దార్ అర వింద్ కుమార్, ఉప తహసి ల్దార్ ఉపేందర్‌కు వినతి పత్రం అందజేశారు. ప్రభు త్వం వెంటనే సిరికొండ మం డలాన్ని కరువు మండలం గా ప్రకటించాలని ఈ సంద ర్భంగా డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు గంగాధర్, కోసే రావు పటేల్, గణేష్ మి లన్ నర్సయ్య,లక్ష్మన్న, రవి, లస్మన్న, సంజీవ్, పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## దుర్గామాత ఆగమన్ వేడుకల్లో పాల్గొన్న సురేఖమ్మ



**మంచిర్యాల, 9, అక్టోబర్ (ప్రజాజ్యోతి) :** మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 32వ డివిజన్ రాంనగర్‌లో సీసీసీ కార్నర్ చౌరస్తా వద్ద శ్రీ వీరాంజనేయ స్వామి దేవాలయ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన దుర్గామాత నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా దుర్గామాత ఆగమన్ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మంచిర్యాల జిల్లా మాజీ డీసీసీ అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖ ప్రేమ్‌సాగర్ రావు, మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ ధర్ని మధుకర్, డిప్యూటీ మేయర్ సల్ల రమ్య-మహేష్ హాజరయ్యారు. భక్తుల సమక్షంలో దుర్గామాత భవానీ దేవి విగ్రహాన్ని ఆవిష్కరించిన సురేఖమ్మ ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా అమ్మవారి ఆశీస్సులు మంచిర్యాల ప్రజలందరిపై ఉండాలని, ప్రతి ఒక్కరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో జీవించాలని సురేఖమ్మ ఆకాంక్షించారు. భక్తిశ్రద్ధలతో ఇంతటి మంచి కార్యక్రమాన్ని నిర్వహించిన శ్రీ వీరాంజనేయ స్వామి దేవాలయ కమిటీ సభ్యులను, కార్యక్రమానికి సహకరించిన మేయర్ ధర్ని మధుకర్‌ను ఆమె అభినందించారు. అనంతరం నిర్వాహకులు సురేఖమ్మను శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో మంచిర్యాల పట్టణ మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు గజ్జల హేమలత, కార్పొరేటర్లు, కాంగ్రెస్ నాయకులు, మహిళా నాయకురాళ్లు, యువజన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## ప్రభుత్వ వైద్యశాలలో విద్యార్థులకు
# మెరుగైన వైద్య విద్యను అందించాలి






జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా

**నిర్మల్ జిల్లా ప్రతినిధి, అక్టోబర్ 9, (ప్రజాజ్యోతి) :** ప్రభుత్వ వైద్య కళాశాలలో విద్యార్థులకు మెరుగైన విద్యను అందించాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశించారు. జిల్లా కలెక్టర్ శుక్రవారం పట్టణంలోని ప్రభుత్వ వైద్య కళాశాలలో విద్యార్థులకు అందిస్తున్న విద్య, మౌలిక సదుపాయాల కల్పన, ప్రభుత్వ ఆసుపత్రిలో అవసరమైన సదుపాయాల కల్పన, తదితర అంశాలపై సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వైద్య విద్యను అభ్యసించే విద్యార్థులకు అవసరమైన ప్రాక్టికల్ శిక్షణ ఇచ్చినప్పుడే వారి సామర్థ్యాలు పెరుగుతాయని, అలాగే వారు మంచి వైద్యులుగా తీర్చిదిద్దబడతారని పేర్కొన్నారు. విద్యార్థులకు మెరుగైన విద్యాబోధన అందేలా అధికారులు చర్యలు తీసుకోవాలని వివరించారు. వైద్య కళాశాలలోని విద్యార్థుల సంఖ్య, వారి విద్యా సంబంధిత విషయాలను అధ్యాపకులను అడిగి తెలుసుకున్నారు. ఎప్పటికప్పుడు నిర్దేశిత పరీక్షలను నిర్వహిస్తూ, విద్యార్థుల అభివృద్ధికి కృషి చేయాలని పేర్కొన్నారు. విద్యార్థుల భద్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని తెలిపారు. ప్రభుత్వ ఆసుపత్రిలోని ఆయా విభాగాల్లో అవసరమైన వైద్య సేవలను అందించేందుకు కావలసిన పరికరాలన్నీ ప్రాధాన్యత క్రమంలో సమకూర్చుకోవాలని అన్నారు. ఈ సమావేశంలో డిఎంహెచ్ఓ రాజేందర్, వైద్య కళాశాల ప్రిన్సిపల్ శారద, ప్రభుత్వ సాధారణ ఆసుపత్రి పర్యవేక్షకులు గోపాల్ సింగ్, డిసిహెచ్ఓ కాశీనాథ్, ఇతర అధికారులు, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

## వడ్డూర్‌లో ఘనంగా ప్రీ ప్రైమరీ తరగతుల ప్రారంభం




- చిన్నారుల బంగారు భవిష్యత్తుకు విద్యా పునాది ఎంతో ముఖ్యం: సర్పంచ్ ఆడెపు శ్రీకాంత్

**నేరడిగొండ అక్టోబర్ 09( ప్రజాజ్యోతి):** గ్రామంలోని చిన్నారుల విద్యాభివృద్ధికి మరో కీలక అడుగు పడింది. వడ్డూర్ గ్రామ పంచాయతీ పరిధిలోని పాఠశాలలో ఏర్పాటు చేసిన ప్రీ ప్రైమరీ (నర్సరీ/ఎల్.కె.జి/యు.కె.జి) తరగతులను గ్రామ సర్పంచ్ ఆడెపు శ్రీకాంత్ ముఖ్య అతిథిగా హాజరై అధికారికంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ... చిన్నతనం నుంచే పిల్లలకు నాణ్యమైన విద్యను అందించడం వల్ల వారి మానసిక, మేధో వికాసం వేగంగా జరుగుతుందన్నారు. బంగారు భవిష్యత్తుకు నాంది పలికేలా ప్రీ ప్రైమరీ విద్య ఎంతో కీలకమైన పాత్ర పోషిస్తుందని, ప్రైవేటుకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పిస్తూ విద్యా ప్రమాణాలు పెంచేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. గ్రామ అభివృద్ధిలో విద్యాభివృద్ధికే తమ మొదటి ప్రాధాన్యం అని పునరుద్ఘాటించారు.

**హాజరైన ప్రజాప్రతినిధులు, నాయకులు :** ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ ఎరడ్ల మమత, స్థానిక నాయకులు చంద్రశేఖర్, ఆడుముల్లా రాములు, పాల శంకర్, నాయిడి శంకర్, ఆలూరి నవీన్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు మరియు వారి తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ప్రభుత్వ జూనియర్ కళాశాలలో
# ఘనంగా బతుకమ్మ సంబరాలు

తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక బతుకమ్మ: ప్రిన్సిపాల్ బి. శంకర్



**ఇచ్చోడ, అక్టోబరు 9 (ప్రజాజ్యోతి) :** మండలంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ సంబరాలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ బి.శంకర్ వేడుకలను ప్రారంభించి ముఖ్య అతిథిగా ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, బతుకమ్మ పండుగ తెలంగాణ ఆడపడుచుల ఆత్మగౌరవానికి, ప్రకృతి ఆరాధనకు మరియు పూల గొప్పతనానికి నిదర్శనమని పేర్కొన్నారు. భావితరాలకు మన సంస్కృతి, సంప్రదాయాలను అందించడంలో ఇలాంటి వేడుకల నిర్వహణ కీలక పాత్ర పోషిస్తుందన్నారు. విద్యార్థులు విద్యతో పాటు మన సంప్రదాయాలపై అవగాహన పెంపొందించుకోవాలని సూచించారు. వేడుకల్లో భాగంగా విద్యార్థినులు రంగురంగుల పూలతో రకరకాల బతుకమ్మలను పేర్చి, వాటి చుట్టూ చేరి బతుకమ్మ పాటలు పాడుతూ, సంప్రదాయ నృత్యాలతో అలరించారు. అధ్యాపకులు మాట్లాడుతూ.. బతుకమ్మ పండుగ మహిళల ఐక్యతకు, కుటుంబ బంధాలకు ప్రతీక అని, ఇటువంటి సాంస్కృతిక కార్యక్రమాలు విద్యార్థుల్లో సోదరభావాన్ని, ఐకమత్యాన్ని పెంపొందిస్తాయని తెలిపారు.

ఈ కార్యక్రమంలో అధ్యాపకులు శ్రీ సత్యనారాయణ, శ్రీ ప్రభాకర్ రెడ్డి, శ్రీ సోమన్న, డాక్టర్ కొండ గోవర్ధన్, శ్రీనివాస్, బాలాజీ, భాస్కర్, నాగభూషణ్, గంగాధర్, భీంరావు, దత్తు, అధ్యాపకురాళ్లు మాధవి, వీణ, వకుల తదితరులతో పాటు విద్యార్థినులు, కళాశాల సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## బతుకమ్మ పండుగ పురస్కరించుకుని పొనకల్‌లో శుభ్రత కార్యక్రమం



**జన్నారం, అక్టోబర్ 9 (ప్రజాజ్యోతి) :** బతుకమ్మ పండుగను పురస్కరించుకుని పొనకల్ గ్రామ పంచాయతీ పరిధిలోని అన్ని 14 వార్డుల్లో శుభ్రత కార్యక్రమాన్ని నిర్వహించారు. సర్పంచ్ జక్కు సుష్మా భూమేష్ ఆధ్వర్యంలో బతుకమ్మ ఆడే ప్రదేశాల్లో శుక్రవారం రోజున బ్లేడ్ ట్రాక్టర్ మరియు ఎంపీడబ్ల్యూ వర్కర్స్ సహాయంతో శుభ్రత పనులు చేయించారు. మహిళలు బతుకమ్మ పండుగను ఆనందోత్సా హాలతో జరుపుకునేందుకు వీలుగా బతుకమ్మ ప్రదేశాల్లో పేరుకుపోయిన చెత్తాచెదారాన్ని తొలగించి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచారు. ఈ సందర్భంగా సర్పంచ్ సుష్మా భూమేష్ గ్రామ ప్రజలకు, అన్నలకు, అక్కచెల్లెళ్లకు బతు కమ్మ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పొనకల్ సర్పంచ్ సుష్మా భూమేష్, పాలకవర్గ సభ్యులు, ఈఓ రాహుల్ తదితరులు పాల్గొన్నారు.

# రేవంత్ మళ్లీ సీఎం.. రాహుల్ ప్రధాని!

- 2028లో కాంగ్రెస్ మళ్లీ అధికారంలోకి రావాలంటూ బంబారా యువకుల పాదయాత్ర
- గాంధీ జయంతి నుంచి హైదరాబాద్‌కు కాలినడకన ప్రయాణం - యువకుల యాత్రకు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తల సంఘీభావం



**ఆసిఫాబాద్, అక్టోబర్ 9 ప్రజా జ్యోతి :** రాష్ట్రంలో కాంగ్రెస్ పాలన మరోసారి కొనసాగాలి.. రేవంత్‌రెడ్డి మళ్లీ ముఖ్యమంత్రి కావాలి.. కేంద్రంలో రాహుల్ గాంధీ ప్రధానమంత్రి బాధ్యతలు చేపట్టాలి.. ఈ ఆకాంక్షలతో కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లా వాంకిడి మండలం బంబారా గ్రామానికి చెందిన ఐదుగురు యువకులు హైదరాబాద్ బాట పట్టారు. గాంధీ జయంతిని పురస్కరించుకుని అక్టోబర్ 2న ప్రారంభించిన పాదయాత్రను కొనసాగిస్తూ తమ రాజకీయ ఆకాంక్షలను ప్రజల్లోకి తీసుకెళ్తున్నారు. గ్రామం నుంచి రాష్ట్ర రాజధాని వరకు కాలినడకన సాగుతున్న వీరి ప్రయాణానికి పలువురు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు సంఘీభావం ప్రకటించారు.

**కాంగ్రెస్ పునరాగమనమే లక్ష్యంగా.. :**
2028 అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ మరోసారి అధికారంలోకి రావాలని, రేవంత్‌రెడ్డి నాయకత్వంలో రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం కొనసాగాలని యువకులు ఆకాంక్షిస్తున్నారు. అలాగే దేశ రాజకీయాల్లో కాంగ్రెస్ పార్టీ బలోపేతం కావాలని, రాహుల్‌గాంధీ ప్రధానమంత్రి కావాలని కోరుకుంటున్నారు. ఈ లక్ష్యాలతోనే బంబారా నుంచి హైదరాబాద్ వరకు పాదయాత్ర చేపట్టినట్లు వారు తెలిపారు. తమ అభిప్రాయాలను ప్రజలకు తెలియజేయడంతోపాటు, తాము విశ్వసిస్తున్న రాజకీయ నాయకత్వానికి మద్దతుగా ఈ యాత్రను కొనసాగిస్తున్నట్లు పేర్కొన్నారు.

**గాంధీ జయంతి రోజున శ్రీకారం :** జాతిపిత మహాత్మా గాంధీ జయంతి అయిన అక్టోబర్ 2న బంబారా గ్రామం నుంచి యువకులు పాదయాత్రను ప్రారంభించారు. గాంధీజీ చూపిన మార్గాన్ని స్మరించుకుంటూ తమ ప్రయాణానికి శ్రీకారం చుట్టినట్లు తెలిపారు. గ్రామం నుంచి హైదరాబాద్ వరకు కాలినడకన వెళ్లాలనే సంకల్పంతో ముందుకు సాగుతున్నారు. మార్గమధ్యంలో తమ పాదయాత్ర ఉద్దేశాన్ని వివరిస్తూ, రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం మరోసారి అధికారంలోకి రావాలని, కేంద్రంలో రాహుల్‌గాంధీ ప్రధానమంత్రి కావాలని తమ ఆకాంక్షను వ్యక్తం చేస్తున్నారు.

**ఐదుగురు యువకుల సంకల్పం :** ఈ పాదయాత్రలో బంబారా గ్రామానికి చెందిన జాడి కిషోర్, కొత్రగాడే వసంత్‌రావు, చునర్కర్ రాజేశ్వర్, రత్నం రామారావు, సేనిగరపు వినోద్ పాల్గొంటున్నారు. ఒకే లక్ష్యంతో ఐదుగురు యువకులు గ్రామం నుంచి హైదరాబాద్ వరకు పాదయాత్ర చేపట్టడం స్థానికంగా చర్చనీయాంశంగా మారింది. తమ ప్రయాణం ద్వారా కాంగ్రెస్ పార్టీ పట్ల తమ అభిమానాన్ని, రేవంత్‌రెడ్డి నాయకత్వంపై తమ ఆకాంక్షను చాటుతున్నామని వారు పేర్కొన్నారు.

**యాత్రకు నాయకుల మద్దతు :** బంబారా యువకులు చేపట్టిన పాదయాత్రకు పలువురు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు సంఘీభావం తెలిపారు. యువకుల సంకల్పాన్ని అభినందిస్తూ వారి ప్రయాణానికి మద్దతు ప్రకటించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ తిరిగి అధికారంలోకి రావాలని, రేవంత్‌రెడ్డి మరోసారి ముఖ్యమంత్రి కావాలని, కేంద్రంలో రాహుల్‌గాంధీ ప్రధానమంత్రి కావాలని కోరుకుంటూ హైదరాబాద్‌కు పాదయాత్ర చేస్తున్నట్లు యువకులు స్పష్టం చేశారు. తమ ఆకాంక్షను ప్రజల్లోకి తీసుకెళ్లడమే ఈ యాత్ర ప్రధాన ఉద్దేశమని తెలిపారు.

## నేరడిగొండ పీహెచ్‌సీలో ఘనంగా ఆశా డే వేడుకలు



**నేరడిగొండ అక్టోబర్ 09 (ప్రజాజ్యోతి) :** స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శుక్రవారం 'ఆశా డే' కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామీణ ప్రాంత ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించడంలో ఆశా కార్యకర్తలు పోషిస్తున్న పాత్ర ప్రశంసనీయమని ఆరోగ్య సిబ్బంది కొనియాడారు. ప్రజారోగ్య పరిరక్షణలో ప్రతి ఒక్కరూ సమన్వయంతో పనిచేయాలని పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ (సిహెచ్ఓ) ప్రేమలత, హెల్త్ సూపర్‌వైజర్లు ఎ. సంతోష్, స్వర్ణలత, ఎంఎల్‌హెచ్‌పీలు మౌనిక, వాణి రాథోడ్, వైష్ణవి, ఇతర ఫీల్డ్ స్టాఫ్ ఎఎన్‌ఎంలు మరియు ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఎఫ్ఎంజీ డాక్టర్ల సమ్మెకు ఏఐటీయూసీ మద్దతు

- స్టైఫండ్ రూ.5 వేల నుంచి రూ.30 వేలకు పెంచాలి
- సమాన విధులకు సమాన వేతనం చెల్లించాలి




**ఆసిఫాబాద్ అక్టోబర్ 9 ప్రజా జ్యోతి :** ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో విధులు నిర్వహిస్తున్న విదేశీ వైద్య పట్టభద్రుల (ఎఫ్ఎంజీ) డాక్టర్లు స్టైఫండ్ పెంపు కోసం చేపట్టిన సమ్మెకు ఏఐటీయూసీ సంపూర్ణ మద్దతు ప్రకటించింది. సమాన విధులు నిర్వహిస్తున్న వైద్య ఇంటర్న్‌లకు సమాన స్టైఫండ్ చెల్లించాలని ఏఐటీయూసీ జిల్లా డిప్యూటీ ప్రధాన కార్యదర్శి ఆత్మకూరి చిరంజీవి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విదేశాల్లో ఎంబీబీఎస్ వైద్య విద్యను పూర్తి చేసి, అవసరమైన అర్హత పరీక్షల్లో ఉత్తీర్ణులైన ఎఫ్ఎంజీ డాక్టర్లు దేశంలో తప్పనిసరి వైద్య ఇంటర్న్‌షిప్ నిర్వహిస్తున్నారని తెలిపారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో రోగులకు వైద్య సేవలు అందిస్తూ కీలక బాధ్యతలు నిర్వర్తిస్తున్నప్పటికీ, దేశంలోనే వైద్య విద్య పూర్తి చేసిన ఇంటర్న్‌లతో పోలిస్తే స్టైఫండ్‌లో వ్యత్యాసం ఉండటం అన్యాయమని పేర్కొన్నారు. వైద్య విద్య కోసం ఎంతో ఆర్థిక భారాన్ని భరించిన యువ వైద్యులకు కనీస ఆర్థిక భరోసా కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. విధులు, బాధ్యతలు సమానంగా ఉన్నప్పుడు స్టైఫండ్ చెల్లింపుల్లోనూ సమానత్వం పాటించాలని కోరారు. ఎఫ్ఎంజీ డాక్టర్ల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. ప్రస్తుతం ఇస్తున్న రూ.5 వేల స్టైఫండ్‌ను రూ.30 వేలకు పెంచాలని, వారి సమస్యలపై ప్రభుత్వం తక్షణమే స్పందించి సమ్మె విరమణకు చర్యలు తీసుకోవాలని ఏఐటీయూసీ నాయకులు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి భోగే ఉపేందర్, ఇతర నాయకులు పాల్గొన్నారు.

## ఆర్కే-ఎన్‌టీ గనిపై ఐఎన్‌టీయూసీ 'శ్రమశక్తి విజయబాట' కార్యక్రమం

కార్మికుల సమస్యల పరిష్కారానికి యాజమాన్యం సానుకూల హామీ

**మంచిర్యాల, 9, అక్టోబర్ (ప్రజాజ్యోతి) :** ఐఎన్‌టీయూసీ యూనియన్ సెక్రటరీ జనరల్, తెలంగాణ రాష్ట్ర కనీస వేతనాల సలహా మండలి చైర్మన్ డాక్టర్ బి. జనక్ ప్రసాద్ ఆదేశాల మేరకు శుక్రవారం ఉదయం మొదటి బదిలీ లో శ్రీరాంపూర్ బ్రాంచ్ పరిధిలోని ఆర్కే-ఎన్‌టీ గనిపై 'శ్రమశక్తి--విజయబాట' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆర్కే-ఎన్‌టీ గని ఐఎన్‌టీయూసీ నూతన వైస్ ప్రెసిడెంట్ ల్యాగల శ్రీనివాస్, గని పిట్ సెక్రటరీ మేదరి మహేందర్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి ఐఎన్‌టీయూసీ శ్రీరాంపూర్ ఏరియా సీనియర్ ఉపాధ్యక్షులు, కేంద్ర సీనియర్ ఉపాధ్యక్షులు జెట్టి శంకర్‌రావు ముఖ్య అతిథిగా హాజరై కార్మికుల సమస్యలపై మాట్లాడారు. సింగరేణి కార్మికుల సంక్షేమం, ఉద్యోగపరమైన సమస్యల పరిష్కారమే లక్ష్యంగా యూనియన్ నిరంతరం కృషి చేస్తోందని ఆయన పేర్కొన్నారు. సంస్థ ఆర్జించిన లాభాల్లో కార్మికులకు 35 శాతం వాటాను దసరా పండుగకు ముందే నిర్ణయించి అందించే అంశాన్ని ప్రస్తావించారు. కార్మికుల వైద్య సమస్యల పరిష్కారానికి ప్రతి నెలా మెడికల్ బోర్డు నిర్వహించాలని, వైద్య పరీక్షల్లో అనర్హతకు గురైన కార్మికుల సమస్యలను పరిశీలించి, అర్హులైన వారికి మెడికల్ అన్‌ఫిట్ అవకాశం కల్పించాలని కోరారు. గతంలో నిర్వహించిన మెడికల్ బోర్డుల నిర్ణయాలను పునఃసమీక్షించి సంబంధిత కార్మికులకు మరో అవకాశం ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. సింగరేణి కార్మికుల సొంత ఇంటి పథకాన్ని త్వరగా అమలు చేసేందుకు అవసరమైన కార్యాచరణ చేపట్టాలని, కార్మికులకు చెల్లించే పెర్క్‌పై ఆదాయపు పన్ను మినహా యింపు సమస్యను కూడా దసరాలోపు పరిష్కరించాలని కోరినట్లు తెలిపారు. ఈ అంశాలపై ఐఎన్‌టీయూసీ ప్రతినిధి బృందం చేసిన విజ్ఞప్తులకు సింగరేణి యాజమాన్యం సానుకూలంగా స్పందించి, సమస్యల పరిష్కారానికి హామీ ఇచ్చినట్లు జెట్టి శంకర్‌రావు వివరించారు. ఈ కార్యక్రమంలో భాగంగా శ్రీరాంపూర్ బ్రాంచ్‌కు నూతనంగా నియమితులైన ఉపాధ్యక్షులు శీలం చిన్నయ్య, చాట్ల అశోక్, ల్యాగల శ్రీనివాస్‌లను కార్మికులకు పరిచయం చేశారు. అనంతరం యూనియన్ నాయకులు గనిపై కార్మికులను నేరుగా కలిసి వారి సమస్యలు, ఇబ్బందులు, ఉద్యోగపరమైన అంశాలను తెలుసుకున్నారు. సంబంధిత విభాగాల అధికారులతో చర్చించి సమస్యల పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఐఎన్‌టీయూసీ కేంద్ర ఉపాధ్యక్షులు గరిగ స్వామి, నూతన ఏరియా ఉపాధ్యక్షులు శీలం చిన్నయ్య, జనరల్ సెక్రటరీలు ఏనుగు రవీందర్‌రెడ్డి, ఏరియా సెక్రటరీ కిషన్, అసిస్టెంట్ పిట్ నాయకులు తిరుపతి, యూనియన్ కార్యకర్తలు, కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

## కేశంపేట పాఠశాలలో బతుకమ్మ సంబురాలు

రేవల్లి, అక్టోబర్ 9 (ప్రజాజ్యోతి): రేవల్లి మండలం కేశంపేట గ్రామంలోని ప్రాథమికోన్నత పాఠశాలలో బతుకమ్మ సంబురాలను ఘనంగా నిర్వహించారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా



నిలిచే బతుకమ్మ వేడుకల్లో విద్యార్థులు, ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ టీచర్లు, స్థానిక యువకులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వివిధ రకాల ప్రకృతి పూలతో రంగురంగుల బతుకమ్మలను అందంగా పేర్చారు. అనంతరం పాఠశాల ఆవరణలో బతుకమ్మలను ఏర్పాటు చేసి, సంప్రదాయ పాటలు పాడుతూ వాటి చుట్టూ చప్పట్లు కొడుతూ లయబద్ధంగా నృత్యాలు చేశారు. విద్యార్థులు, మహిళలు ఉత్సాహంగా పాల్గొనడంతో పాఠశాల ప్రాంగణం పండుగ శోభను సంతరించుకుంది. పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ టీచర్లు వేడుకల్లో పాల్గొని విద్యార్థులను ప్రోత్సహించారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాల విశిష్టతను చాటుతూ అందరూ కలిసిమెలిసి బతుకమ్మ సంబురాలను జరుపుకున్నారు.

## మల్దకల్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఘనంగా బతుకమ్మ సంబరాలు

మల్దకల్ అక్టోబర్ 09(ప్రజా జ్యోతి ప్రతినిధి): ప్రభుత్వ జూనియర్ కళాశాల మల్దకల్‌లో జాతీయ సేవా పథకం (ఎన్ఎస్ఎస్) యూనిట్ల ఆధ్వర్యంలో కళాశాల ప్రిన్సిపాల్ శ్రీలత





రెడ్డి అధ్యక్షతన బతుకమ్మ సంబరాలను ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా విద్యార్థినీ,విద్యార్థులు సంప్రదాయ దుస్తులు ధరించి,తంగేడు ఆకులు,వివిధ రకాల బంతిపూలతో బతుకమ్మలను అందంగా పేర్చి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం బతుకమ్మ పాటలు పాడుతూ,ఆటపాటలతో సంబరాలను ఉత్సాహంగా జరుపుకున్నారు.ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ శ్రీలత రెడ్డి మాట్లాడుతూ,బతుకమ్మ తెలంగాణ రాష్ట్ర సంస్కృతి,సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే పండుగ అని పేర్కొన్నారు.తెలంగాణ ఆడపడుచులు,మహిళలు,రైతులు ఈ పండుగను దాదాపు తొమ్మిది రోజులపాటు వివిధ రూపాల్లో ఆనందోత్సాహాలతో జరుపుకుంటారని తెలిపారు.ప్రతి ఒక్కరి జీవితం సుఖసంతోషాలతో,ఆయురారోగ్యాలతో,సంపదతో నిండాలని కోరుకుంటూ బతుకమ్మను పూజించడం ఈ పండుగ ప్రత్యేకత అని వివరించారు.విద్యార్థులు మన సంస్కృతి,సంప్రదాయాలను గౌరవిస్తూ,భావితరాలకు వాటి విశిష్టతను తెలియజేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారులు రామాంజనేయులు గౌడ్,నరసింహులు,అధ్యాపకులు గోవర్ధన్ శెట్టి, భాగ్యలక్ష్మి ,మాధురి,రాఘవేంద్ర,శ్రీకాంత్,సుధాకర్,కమలహాసన్,ఇఫ్తికర్,రంగస్వామితో పాటు అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

### కేసీఆర్ గద్వాల జిల్లాను ఏర్పాటు చేసి అభివృద్ధికి బాటలు వేశారు

గద్వాల అక్టోబర్ 09 (ప్రజా జ్యోతి ప్రతినిధి): గద్వాల జిల్లాను ఏర్పాటు చేసి పదేళ్లు పూర్తయిన సందర్భంగా బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో దశాబ్ది వేడుకల్లో భాగంగా 5కే రన్ నిర్వహించారు.బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు మేరకు గద్వాల జిల్లా కేంద్రంలో నిర్వహించిన ఈ కార్యక్రమాన్ని పార్టీ జిల్లా ఇన్‌చార్జి బాసు హనుమంతు నాయుడు,మాజీ మున్సిపల్ చైర్మన్ బీఎస్ కేశవ్‌తో కలిసి ప్రారంభించారు.పాత బస్టాండ్



నుంచి ప్రారంభమైన 5కే రన్ కృష్ణవేణి చౌక్,అంబేద్కర్ చౌక్ మీదుగా వైఎస్సార్ చౌక్ వరకు సాగింది.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు,కార్యకర్తలు,యువత ఉత్సాహంగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా బాసు హనుమంతు నాయుడు మాట్లాడుతూ,గద్వాల జిల్లాను ఏర్పాటు చేసి పదేళ్లు పూర్తయిన సందర్భంగా యువతతో కలిసి 5కే రన్ నిర్వహించడం సంతోషంగా ఉందన్నారు.గద్వాల జిల్లాను ఏర్పాటు చేసి అభివృద్ధి పథంలో నడిపించిన మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌కు జిల్లా ప్రజలు రుణపడి ఉంటారని పేర్కొన్నారు.జిల్లా ఏర్పాటు చేయడమే కాకుండా నూతన కలెక్టరేట్ భవనం,మెడికల్ కళాశాల,నర్సింగ్ కళాశాల,ఎస్పీ కార్యాలయం వంటి పలు అభివృద్ధి కార్యక్రమాలను కేసీఆర్ ప్రభుత్వం చేపట్టిందని గుర్తుచేశారు.ఈ కార్యక్రమాలు జిల్లా అభివృద్ధికి దోహదపడ్డాయని అన్నారు. ఆరోగ్యమే మహాభాగ్యమని,ప్రస్తుత జీవనశైలిలో పెరుగుతున్న ఒత్తిడి కారణంగా ఆరోగ్యంపై శ్రద్ధ చూపడం ఎంతో అవసరమని బాసు హనుమంతు నాయుడు అన్నారు. ఉరుకుల పరుగుల జీవితంలో శారీరక దృఢత్వాన్ని కాపాడుకోవడానికి వ్యాయామం, నడక, పరుగు వంటి కార్యక్రమాలు దోహదపడతాయని తెలిపారు.5కే రన్ కేవలం పరుగు మాత్రమే కాదని,ఆరోగ్యంపై అవగాహన పెంపొందించే కార్యక్రమమని పేర్కొన్నారు.ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించిన నిర్వాహకులు,స్వచ్ఛంద సేవకులకు ఆయన అభినందనలు తెలిపారు.ఈ కార్యక్రమంలో నాగర్‌దొడ్డి వెంకట్రాములు,జి.రాఘవేంద్ర రెడ్డి,కౌన్సిలర్లు పులిపాటి వెంకటేష్,సంటెన్న, టీఎన్ఆర్ జగదీష్,దుబన్న, గువ్వల గోపాల్,నరసింహులు,మోహన్ యాదవ్,చిత్తరి కిరణ్,కమ్మరి రాము,రామకృష్ణ,కోటేష్,కురవ పల్లయ్య,బీచుపల్లి,వెంకటేష్ నాయుడు,జాం పల్లి భరత్ సింహారెడ్డి,వినయ్,శేఖర్ నాయుడు, రాముడు,శ్రీరాములు, ముని మౌర్య, మాలిక్,నవీన్, అరవింద్,రాము, తిమ్మప్ప,మహేష్ ,లక్ష్మణ్,రంగస్వామి, రాఘవేంద్ర, ప్రవీణ్,అశోక్‌తో పాటు పలువురు బీఆర్ఎస్ నాయకులు,కార్యకర్తలు, యువత పాల్గొన్నారు.

# రైతులు ఆధునిక సాంకేతికతను అందిపుచ్చుకోవాలి

## ప్రకృతి వ్యవసాయానికి ప్రాధాన్యమివ్వాలి

## జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్,ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి

## గద్వాలలో ఘనంగా కిసాన్ మేళా

గద్వాల అక్టోబర్ 09(ప్రజా జ్యోతి ప్రతినిధి): రైతులు ఆధునిక వ్యవసాయ సాంకేతికతను సద్వినియోగం చేసుకుంటూ,ప్రకృతి



వ్యవసాయంపై దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్,ఆత్మ చైర్మన్ రిజ్వాన్ బాషా షేక్ సూచించారు.వ్యవసాయ సాంకేతిక యాజమాన్య సంస్థ(ఆత్మ)ఆధ్వర్యంలో శుక్రవారం గద్వాలలోని కె.ఎస్.ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన కిసాన్ మేళాలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డితో కలిసి వ్యవసాయ అనుబంధ రంగాల ప్రదర్శనను ప్రారంభించి,రైతులు,శాస్త్రవేత్తల సమావేశంలో పాల్గొన్నారు.ముందుగా వ్యవసాయ, మత్స్య,పశుసంవర్ధక,ఉద్యానవన తదితర శాఖల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్టాళ్లను ముఖ్య అతిథులు రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు.వివిధ వ్యవసాయ యంత్రాలు,ఉత్పత్తులు,సాంకేతిక పరికరాలను పరిశీలించి,వాటి వినియోగంపై వివరాలు తెలుసుకున్నారు.అనంతరం జ్యోతి ప్రజ్వలన చేసి,తెలంగాణ రాష్ట్ర గీతాలాపనతో సమావేశాన్ని ప్రారంభించారు.

**రైతులు సాంకేతికతను అందిపుచ్చుకోవాలి:**

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ మాట్లాడుతూ,జోగులాంబ గద్వాల జిల్లా రైతులు ప్రతిభావంతులని,ఎల్‌నినో ప్రభావంతో వర్షాలు తక్కువగా కురిసినప్పటికీ కష్టపడి వివిధ పంటలు సాగు చేస్తున్నారని అభినందించారు.వ్యవసాయంలో డ్రోన్ల వినియోగాన్ని పెంచుకోవాలని,రసాయన ఎరువుల వాడకాన్ని తగ్గించి ప్రకృతి వ్యవసాయానికి ప్రాధాన్యమివ్వాలని సూచించారు.యూరియా యాప్ ద్వారా రైతులకు ఎరువుల వినియోగంపై అవగాహన కల్పించామని,దీంతో హెక్టారుకు సగటున 500 కిలోల వరకు యూరియా వినియోగాన్ని తగ్గించగలిగామని తెలిపారు.జిల్లా వ్యాప్తంగా సుమారు 2,330 టన్నుల యూరియా వినియోగం తగ్గినట్లు పేర్కొన్నారు. వ్యవసాయంతో పాటు అనుబంధ రంగాల్లోనూ రైతుల సంక్షేమానికి అధికార యంత్రాంగం కృషి చేస్తోందన్నారు.జిల్లాలోని పలు రిజర్వాయర్ల సామర్థ్యాన్ని ప్రభుత్వం పెంచడంతో భవిష్యత్తులో సాగు,తాగునీటి అవసరాలకు ఇబ్బందులు తగ్గుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు.ఆయిల్‌పామ్ సాగుకు మంచి డిమాండ్ ఉన్నందున ఉమ్మడి జిల్లాలోనే జోగులాంబ గద్వాల జిల్లా రైతులు అత్యధిక విస్తీర్ణంలో ఈ పంటను సాగు చేస్తున్నారని ప్రశంసించారు.పాల ఉత్పత్తిని పెంచేందుకు ఆవులు,గేదెల పెంపకంపై దృష్టి సారించాలని,గొర్రెలు,మేకల పెంపకందారులు రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న బీమా సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

**రైతుల సమస్యలను సకాలంలో పరిష్కరించాలి:**

గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి మాట్లాడుతూ,దేశంలో అధిక సంఖ్యలో ప్రజలు వ్యవసాయంపై ఆధారపడి జీవిస్తున్నందున రైతుల సంక్షేమానికి ప్రభుత్వాలు అధిక ప్రాధాన్యం ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు.ఏ పార్టీ అధికారంలో ఉన్నా రైతుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని సంక్షేమ పథకాలను సమర్థవంతంగా అమలు చేయాలని సూచించారు.వ్యవసాయానికి 24 గంటల విద్యుత్ సరఫరా చేయాలని, కనీసం 18 గంటలైనా నిరంతరాయంగా విద్యుత్ అందించాలని కోరారు.రైతుల కష్టానికి తగిన





ఫలితం దక్కాలంటే వారి సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని అన్నారు.ఎల్‌నినో వంటి వాతావరణ పరిస్థితులను ఎదుర్కొనేందుకు ముందస్తు ప్రణాళికలు అవసరమని,అధికారులు సకాలంలో అవగాహన కల్పిస్తే రైతులు ప్రత్యామ్నాయంగా ఆరుతడి పంటలను సాగు చేసి నష్టాలను తగ్గించుకోవచ్చని పేర్కొన్నారు.రైతులకు మేలు జరిగేలా శాస్త్రవేత్తలు పరిశోధనలు చేపట్టాలని,రైతులు బాగుంటేనే దేశం సుభిక్షంగా ఉంటుందని అన్నారు.

**పాడి పరిశ్రమపైనా దృష్టి సారించాలి:**

రాష్ట్ర గొర్రెలు,మేకల అభివృద్ధి కార్పొరేషన్ చైర్‌పర్సన్ సరిత మాట్లాడుతూ,సమస్త మానవాళి జీవనాధారానికి రైతులే మూలమని కొనియాడారు. గతంలో పంటల సాగుతో పాటు పాడి పరిశ్రమకు కూడా రైతులు ప్రాధాన్యమిచ్చేవారని గుర్తుచేశారు. రైతులు పాడి పరిశ్రమపై దృష్టి సారించేలా పశుసంవర్ధక శాఖ అధికారులు ప్రోత్సహించాలని సూచించారు.

మానవ తప్పిదాల వల్ల పర్యావరణ కాలుష్యం పెరిగి అతివృష్టి,అనావృష్టి వంటి పరిస్థితులు ఏర్పడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.ప్లాస్టిక్ వినియోగాన్ని నియంత్రించడంతో పాటు పర్యావరణానికి హాని కలిగించే అంశాలపై చర్యలు తీసుకోవాలని,భవిష్యత్తు తరాల మనుగడకు ప్రకృతిని పరిరక్షించడం అవసరమని పేర్కొన్నారు.సకాలంలో వర్షాలు కురిసి రైతులు సుభిక్షంగా ఉంటే అన్ని రంగాల అభివృద్ధికి దోహదపడుతుందని అన్నారు.

**ఆరుతడి పంటల సాగుకు ప్రాధాన్యమివ్వాలి:**

రాష్ట్ర వాల్మీకి బోయ కార్పొరేషన్ చైర్మన్ గట్టు తిమ్మప్ప మాట్లాడుతూ,వర్షాలు తక్కువగా కురుస్తున్న నేపథ్యంలో రైతులు ఆరుతడి పంటల సాగుపై దృష్టి సారించాలని సూచించారు.జిల్లా రైతుల ప్రయోజనాల కోసం పలువురు ప్రజాప్రతినిధులు ఇటీవల కర్ణాటక ముఖ్యమంత్రిని కలిసి ఆల్మట్టి డ్యాం నుంచి జూరాల ప్రాజెక్టుకు మూడు టీఎంసీల నీటిని విడుదల చేయాలని కోరిన విషయాన్ని గుర్తుచేశారు.నడిగడ్డ ప్రాంతాన్ని కరువు జిల్లాగా ప్రకటించాలని,రైతులను ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు.రైతులు దళారుల చేతిలో మోసపోకుండా సంబంధిత శాఖల అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు.

**ఆదర్శ రైతుల అనుభవాల పంచిక:**

కార్యక్రమంలో పలువురు ఆదర్శ రైతులు ప్రకృతి వ్యవసాయం,వినూత్న సాగు పద్ధతులు,పంటల నిర్వహణలో అనుసరిస్తున్న విధానాలపై తమ అనుభవాలను వివరించారు.రైతులు ఆధునిక సాంకేతికతను అందిపుచ్చుకోవడంతో పాటు వాతావరణ మార్పులకు అనుగుణంగా పంటల ఎంపిక,సాగు పద్ధతుల్లో మార్పులు చేసుకోవాల్సిన అవసరాన్ని ఈ సమావేశం చర్చించింది.ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ నీలి శ్రీనివాసులు,గద్వాల వ్యవసాయ మార్కెట్ యార్డు చైర్మన్ హనుమంతు,జిల్లా వ్యవసాయ అధికారి వీరప్ప,ఆత్మ డిప్యూటీ ప్రాజెక్ట్ డైరెక్టర్ జగ్గు నాయక్,గద్వాల పీఏసీఎస్ చైర్మన్ సుభాన్‌తో పాటు పలువురు ప్రజాప్రతినిధులు, శాస్త్రవేత్త లు, అ ధికారులు, నాయ కులు, రైతులు పాల్గొన్నారు.

## ఆర్టీఐ దరఖాస్తులకు నిర్ణీత గడువులోగా సమాచారం అందించాలి:కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్

### సమాచార హక్కు చట్టం అమలులో పారదర్శకత,జవాబుదారీతనం పాటించాలి

గద్వాల అక్టోబర్ 09 (ప్రజా జ్యోతి ప్రతినిధి): సమాచార హక్కు చట్టం–2005 ప్రకారం ప్రజలు కోరిన





సమాచారాన్ని చట్ట నిబంధనలకు అనుగుణంగా నిర్ణీత గడువులోగా అందించాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అధికారులను ఆదేశించారు.శుక్రవారం ఆర్టీఐ వారోత్సవాలు–2026 సందర్భంగా హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా చేసిన ప్రసంగాన్ని గద్వాల ఐడీఓసీ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్,ఇతర అధికారులు వీడియో ప్రసారం ద్వారా వీక్షించారు.అనంతరం సమాచార హక్కు చట్టం అమలుపై జిల్లా అధికారులకు కలెక్టర్ పలు సూచనలు చేశారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ,సమాచార హక్కు అనేది కేవలం చట్టపరమైన విధానం మాత్రమే కాకుండా,ప్రభుత్వ కార్యకలాపాలకు సంబంధించిన సమాచారాన్ని ప్రజలకు అందించే కీలక సాధనమని పేర్కొన్నారు.ఈ చట్టం పారదర్శక పాలనను బలోపేతం చేయడంతో పాటు ప్రభుత్వ వ్యవహారాల్లో ప్రజల భాగస్వామ్యాన్ని పెంపొందించేందుకు దోహదపడుతుందని తెలిపారు.సమాచార హక్కు చట్టం కింద అందిన దరఖాస్తులను సక్రమంగా పరిశీలించి,దరఖాస్తుదారులకు ఖచ్చితమైన సమాచారాన్ని నిర్దేశిత గడువులోగా అందించాలని అధికారులకు సూచించారు.చట్టం అమలులో పారదర్శకత,జవాబుదారీతనాన్ని పాటించాలని స్పష్టం చేశారు.ఆర్టీఐ వారోత్సవాల సందర్భంగా గ్రామ,మండల,డివిజన్,జిల్లా స్థాయిల్లో విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని కలెక్టర్ ఆదేశించారు.సమాచార హక్కు చట్టం కింద దరఖాస్తులు ఎలా సమర్పించాలి,ఏయే అంశాలపై సమాచారం కోరవచ్చు, దరఖాస్తు ప్రక్రియకు సంబంధించిన నిబంధనలు ఏమిటి అనే విషయాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు.ప్రజలు కోరిన సమాచారాన్ని సంబంధిత శాఖల్లో అందుబాటులో ఉన్న రికార్డుల ఆధారంగా చట్ట నిబంధనలకు అనుగుణంగా అందించడం అధికారుల బాధ్యత అని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ మధు మోహన్,వివిధ శాఖల జిల్లా అధికారులు,తహసీల్దార్లు,ప్రజా సమాచార అధికారులు (పీఐఓలు),సహాయ ప్రజా సమాచార అధికారులు (ఏపీఐఓలు) తదితరులు పాల్గొన్నారు.

## షోకాజ్ నోటీసు ఇవ్వకుండా తొలగించే అధికారం ఎవరిచ్చారు?

### బీజేపీ మండల అధ్యక్షుడు జయానంద్ రెడ్డిని ప్రశ్నించిన అశోక్ గౌడ్..

మాగనూరు, అక్టోబర్ 09(ప్రజా జ్యోతి ): తనను మండల ప్రధాన కార్యదర్శి బాధ్యతల నుంచి తొలగిస్తున్నట్లు ప్రకటించడంపై బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి అశోక్ గౌడ్ అభ్యంతరం వ్యక్తం



చేశారు. శుక్రవారం మాగనూరులో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, తనకు షోకాజ్ నోటీసు ఇవ్వకుండా, వివరణ కోరకుండా ఏకపక్షంగా నిర్ణయం తీసుకోవడం ఎంతవరకు సమంజసమని మండల అధ్యక్షుడు జయానంద్ రెడ్డిని ప్రశ్నించారు. పార్టీ నిబంధనల ప్రకారం తన వివరణ తీసుకున్న తర్వాతే నిర్ణయం తీసుకోవాలని అశోక్ గౌడ్ పేర్కొన్నారు. పదవులు ముఖ్యం కాదని, పార్టీ సిద్ధాంతాలు, కార్యకర్తల ఆత్మగౌరవమే ముఖ్యమని అన్నారు. తాను బీజేపీ మండల ప్రధాన కార్యదర్శిగా కొనసాగుతానని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో బీజేపీ సీనియర్ నాయకుడు ఈ. ఆంజనేయులు గౌడ్, వార్డు సభ్యులు భరత్ కుమార్, ఆనంద్ గౌడ్, బూత్ కమిటీ అధ్యక్షులు భీమ్రాజ్, సురేష్, పరశురాం, నవీన్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

# పంటల క్షేత్ర సందర్శనలో రైతులకు శాస్త్రీయ సూచనలు

గద్వాల అక్టోబర్ 09(ప్రజా జ్యోతి ప్రతినిధి): జోగులాంబ గద్వాల జిల్లాలోని యెర్రవల్లి, గద్వాల మండలాల పరిధిలో ఉన్న బీచుపల్లి,అనాతపురం,పూడూరు,కొండపల్లి



గ్రామాల్లో శుక్రవారం తెలంగాణ రైతు విజ్ఞాన కేంద్రం,గద్వాల సమన్వయకర్త డాక్టర్ పి. అర్చన,ఆర్ఏఆర్ఎస్ శాస్త్రవేత్తలు ఎ.శ్రీరామ్,డాక్టర్ కె.మమత,డాక్టర్ జి.మాధురితో కలిసి పంటల క్షేత్ర సందర్శన నిర్వహించారు.ఈ సందర్భంగా వరి,మిరప,కంది,బెండ, పత్తి పంటలను పరిశీలించి,పంటల ఎదుగుదల,చీడపీడల ఉధృతి,రైతులు అనుసరిస్తున్న యాజమాన్య పద్ధతులను సమీక్షించారు.పంటల్లో ఎదురవుతున్న సమస్యలను రైతులను అడిగి తెలుసుకున్న డాక్టర్ పి.అర్చన,వాటి నివారణకు శాస్త్రీయ సూచనలు అందించారు.

పత్తి:పత్తి పంట కోత దశలో ఉన్నట్లు గుర్తించారు.కొన్ని పొలాల్లో గులాబీ రంగు కాయతొలుచు పురుగు (పింక్ బోల్‌వార్మ్) ఉనికిని గమనించారు.పంట పరిపక్వత, పొలాల పరిస్థితులను బట్టి నవంబర్ మొదటి పక్షంలోగా మిగిలిన పత్తి కోతలను పూర్తి చేసుకోవాలని రైతులకు సూచించారు.

మిరప: బిందు సేద్యం ద్వారా సాగు చేస్తున్న మిరప పంటలో ఆకులు పైపైకు ముడుచుకునే లక్షణాలను గుర్తించారు.తామర పురుగుల నివారణకు ఇప్పటికే ఏడుసార్లు మందులు పిచికారీ చేశామని,ప్రస్తుతం పురుగుల ఉధృతి గణనీయంగా తగ్గిందని రైతులు తెలిపారు.

బెండ: సుమారు రెండు నెలల వయస్సు కలిగిన బెండ పంటలో 43వ కోత దశను పరిశీలించారు.కాయతొలుచు పురుగు నివారణకు ఎమామెక్టిన్ బెంజోయేట్ మందును పిచికారీ చేసినట్లు రైతు వివరించారు.

వరి:వరి పంట క్రియాశీల పిలకల దశలో ఉన్నట్లు గుర్తించారు.పంటలో వెన్ను మైట్ (పానికిల్ మైట్) సమస్యను గుర్తించిన శాస్త్రవేత్తలు,పురుగు లక్షణాలను నిర్ధారించిన అనంతరం వరి పంటకు



అనుమతించబడిన తగిన పురుగుమందును లేబుల్‌పై పేర్కొన్న సూచనల ప్రకారం మాత్రమే వినియోగించాలని సూచించారు.అలాగే కంది పంటను పరిశీలించి,దాని ఎదుగుదల,ఆరోగ్య పరిస్థితులను అంచనా వేశారు.ఈ క్షేత్ర సందర్శనలో ఐదుగురు రైతులు పాల్గొన్నారు.పంటల్లో చీడపీడలను గుర్తించడం,వాటి నివారణ చర్యలు, శాస్త్రీయ పంట యాజమాన్య పద్ధతులపై శాస్త్రవేత్తలు రైతులకు సాంకేతిక సూచనలు అందించారు.

## గోదావరి జలాలతో ఏనచెరువును నింపాలి

- జనగామ--హుస్నాబాద్ రహదారిపై రైతుల ధర్నా
- ఎండిపోతున్న పంటలను కాపాడాలని డిమాండ్



**జనగామ, అక్టోబర్ 09 (ప్రజాజ్యోతి) :** గోదావరి జలాలతో ఏనచెరువును తక్షణమే నింపి, ఎండిపోతున్న పంటలను కాపాడాలని డిమాండ్ చేస్తూ వడ్లకొండ, పెద్దపాహాడు గ్రామాల రైతులు శుక్రవారం ఆందోళనకు దిగారు. జనగామ హుస్నాబాద్ ప్రధాన రహదారిపై బైఠాయించి ధర్నా నిర్వహించారు. రైతుల నిరసనతో రహదారిపై ఇరువైపులా వాహనాలు నిలిచిపోయి ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. ఈ సందర్భంగా రైతు ఎల్లబోయిన హరీష్ మాట్లాడుతూ ఏనచెరువు కింద వందలాది ఎకరాల్లో సాగు చేసిన పంటలు నీరు లేక ఎండిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. చెరువును గోదావరి జలాలతో నింపాలని గతంలో జిల్లా కలెక్టర్‌తో పాటు నీటిపారుదల శాఖ ఉన్నతాధికారులకు వినతిపత్రాలు సమర్పించినప్పటికీ ఫలితం లేకుండా పోయిందని ఆరోపించారు. అధికారుల నిర్లక్ష్యం కారణంగా పంటలు ఎండిపోయి రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం, నీటిపారుదల శాఖ అధికారులు వెంటనే స్పందించి ఏనచెరువుకు గోదావరి జలాలను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. తమ సమస్యను పరిష్కరించకపోతే ఆందోళనను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ ధర్నాలో వడ్లకొండ, పెద్దపాహాడు గ్రామాలకు చెందిన రైతులు, గ్రామస్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## కామారెడ్డిపల్లిలో భూముల రీ-సర్వే

క్షేత్రస్థాయిలో తనిఖీ చేసిన అదనపు కలెక్టర్, ఆర్డీఓ



**పరకాల, అక్టోబరు 09, (ప్రజా జ్యోతి):** హనుమకొండ జిల్లా అదనపు కలెక్టర్ ఎన్. రవి, పరకాల రెవెన్యూ డివిజనల్ అధికారి డి.ఎస్. వెంకన్న శుక్రవారం కామారెడ్డిపల్లి గ్రామంలో జరుగుతున్న భూముల రీ-సర్వే ప్రక్రియను పరిశీలించారు. గ్రామ సరిహద్దులు, భూములకు సంబంధించిన వివరాలు, ఇప్పటివరకు చేపట్టిన సర్వే పురోగతిపై సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. రీ-సర్వే సమయంలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని అధికారులకు సూచించారు. సర్వే ప్రక్రియపై రైతులకు ముందస్తు సమాచారం అందిస్తూ, పారదర్శకంగా, సమన్వయంతో పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. రీ-సర్వే విజయవంతంగా పూర్తయ్యేందుకు రైతులందరూ అధికారులకు, సర్వే సిబ్బందికి సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

ఈ కార్యక్రమంలో పరకాల మండల తహసీల్దార్ టి. విజయలక్ష్మి, మండల సర్వేయర్ విజయ్ కుమార్, అదనపు గిర్దావర్ ఖయ్యూం, గ్రామ పాలన అధికారి లావణ్య, సర్వే సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

## బాలాజీ మహిళా డిగ్రీ కళాశాలలో బతుకమ్మ ఉత్సవాలు




**నర్సంపేట అక్టోబర్ 9(ప్రజా జ్యోతి) :** నర్సంపేట అమావాస్యకు ఒకరోజు ముందుగానే బాలాజీ మహిళా డిగ్రీ కళాశాలలో బతుకమ్మ ఉత్సవాలు ఆనందోత్సవాల మధ్య ఘనంగా జరిగాయి. కళాశాల విద్యార్థినిలు అందరూ రకరకాల పూలతో బతుకమ్మ పేర్చుకొని సాంప్రదాయ దుస్తులు ధరించి కళాశాలకు వచ్చి బతుకమ్మ పాటలతో ఆడి పాడారు. కోలాటం పాటలతో కళాశాల ప్రాంగణం అంతా మారి మోగిపోయాయి. తెలంగాణ సాంస్కృతి ఈ ఉట్టి పడేటట్లు విద్యార్థులు వివిధ రకాల పాటలకు డ్యాన్సులు వేశారు. ఈ కార్యక్రమా నికి ముఖ్య అతిథిగా హాజరైన బాలాజీ విద్యాసంస్థల కోశాధికారి డాక్టర్ వనజ మాట్లాడుతూ బతుకమ్మ పండుగ తెలంగాణలో అతి ముఖ్యమైన పండుగ అన్నారు ముఖ్యంగా తొమ్మిది రోజులు మహిళా లోకం వివిధ పూల తో బతుకమ్మలను పేర్చి ఆడి పాడే పండుగ ప్రపంచంలో నే ఎక్కడ లేని విధంగా తెలంగాణ సంస్కృతిని సాంప్రదాయాలను గౌరవిస్తూ ఆడుతూ పాడుతూ ప్రపంచానికి చాటి చెప్పారన్నారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ మోర్తాల రామ్ రాజ్ మాట్లాడుతూ తెలంగాణ పండుగలను సాంస్కృతి సంప్రదాయాలను కాపాడడానికి విద్యార్థునిలు ముందు వరుసలో ఉండాలన్నారు. కళాశాలలో తెలంగాణ సంస్కృతి సాంప్రదాయాలను ప్రోత్సహించడానికి కాపాడడానికి కళాశాల ముందు వరుసలో ఉంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులతో పాటు సుమారు 300 మంది విద్యార్థునిలు పాల్గొన్నారు.

## డాక్టర్ పెరుమాండ్ల రామకృష్ణకు గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీ ఇవ్వాలి

- ధర్మ సమాజ్ పార్టీ మండల అధ్యక్షుడు బాగాజీ రజినీ కాంత్ డిమాండ్



**ఆత్మకూరు, అక్టోబర్ 09 (ప్రజాజ్యోతి) :** తెలంగాణ రాష్ట్రంలో వైద్య, సామాజిక రంగంలో విశేష సేవలు అందిస్తున్న ప్రముఖ వైద్యులు, విద్యావేత్త, మాదిగ హక్కుల దండోరా రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు, సీనియర్ కాంగ్రెస్ నాయకుడు డాక్టర్ పెరుమాండ్ల రామకృష్ణకు గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీ గా అవకాశం కల్పించాలని ధర్మ సమాజ్ పార్టీ (డిఎస్పీ)మండల అధ్యక్షుడు బాగాజీ రజినీ కాంత్ డిమాండ్ చేశారు. శుక్రవారం మండల కేంద్రములో ఆయన మాట్లాడుతూ.. డాక్టర్ పెరుమాండ్ల రామకృష్ణ గత రెండు దశాబ్దాలుగా పేద, బడుగు బలహీన వర్గాలకు వైద్య సేవలు అందిస్తూ, విద్యా రంగంలో వెనుకబడిన విద్యార్థులకు అండగా నిలుస్తున్నారని సామాజిక న్యాయం, రాజ్యాంగ పరిరక్షణ కోసం నిర్విరామంగా కృషి చేస్తున్నారని తెలిపారు. గవర్నర్ కోటా ఎమ్మెల్సీలు సాహిత్యం, విద్య, వైద్యం, సామాజిక సేవలో ప్రతిభ కనబరిచిన వారికి ఇవ్వాలని, ఈ అర్హతలన్నీ డాక్టర్ రామకృష్ణకు ఉన్నాయని స్పష్టం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం, సీఎం రేవంత్ రెడ్డి, గవర్నర్ వెంటనే స్పందించి డాక్టర్ పెరుమాండ్ల రామకృష్ణకు గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీగా అవకాశం కల్పించాలని కోరారు.

# అన్నదాతకు అడుగడుగునా కష్టాలే..

- మొదలైన వరి కోతలు!
- కొనుగోలు కేంద్రాలు లేక కల్లాల వద్దే దళారుల కాంటాలు
- సన్నాలకు సర్కారు బోనస్ ఆశతో భారీగా సాగు చేసిన వైనం
- ఫెర్టిలైజర్ షాపుల నిర్వాహకుల దోపిడీ.. నకిలీ మందులతో నిలువునా నష్టం

**దేవరుప్పుల, అక్టోబర్ 09(ప్రజాజ్యోతి) :** ఖరీఫ్ సీజన్ చివరి దశకు చేరుకోవడంతో మండలంలో ముందస్తుగా నాట్లు వేసిన రైతులు వరి కోతలు ప్రారంభించారు. ఎల్ నినో ప్రభావంతో వర్షాలు ఆలస్యం కావడంతో రైతులు దఫదఫాలుగా నాట్లు వేశారు. దీంతో కోతలు కూడా ఒకేసారి కాకుండా క్రమంగా మొదలవుతున్నాయి. ఆలస్యంగా నాట్లు వేసిన వారు ఎండల బారినుంచి పంటను కాపాడుకునేందుకు నానా తంటాలు పడుతుండగా, చిరుపొట్ట దశలో ఉన్న వరి పంట చేతికొస్తుందా లేదా అన్న ఆందోళనలో మరికొందరు రైతులు ఉన్నారు. ఇదే సమయంలో కోతలు పూర్తయిన చోట ప్రభుత్వం ఇంకా కొనుగోలు కేంద్రాలు ప్రారంభించకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇదే అదనుగా భావిస్తున్న వ్యాపారులు, దళారులు నేరుగా కల్లాల వద్దకే చేరుకుని పచ్చి ధాన్యాన్ని సైతం తక్కువ ధరకు కొనుగోలు చేస్తూ రైతుల అమాయకత్వాన్ని, నిరక్షరాస్యతను ఆసరాగా చేసుకుని అందినకాడికి దండుకుంటున్నారు. మండల వ్యవసాయ శాఖ అధికారుల అంచనా ప్రకారం.. మొత్తం సాగులో ప్రభుత్వం ఇచ్చే బోనస్ కలిసి వస్తుందనే ఆశతో మెజార్టీ రైతులు సన్న రకాలనే సాగు చేశారు. అయితే, పంట చేతికొచ్చే సమయానికి వాతావరణంలో వచ్చిన ఆకస్మిక మార్పులతో వరి పొలాలను దోమపోటు, నల్లి పురుగు తీవ్రంగా ఆశ్రయించాయి. వీటిని నివారించే క్రమంలో రైతులు వ్యవసాయ అధికారుల సలహాలు తీసుకోకుండా నేరుగా ఫెర్టిలైజర్ షాపులకు పరుగులు తీస్తున్నారు. లాభాపేక్షతో ఫెర్టిలైజర్ షాపుల యజమానులే వ్యవసాయ అధికారులుగా మారిపోయి, రైతులకు నాసిరకం పురుగు మందులను అంటగడుతున్నారు. దీనికితోడు ఏ ఒక్క రైతుకు రసీదు ఇవ్వకుండా ఇష్టానుసారంగా అధిక ధరలకు విక్రయిస్తూ దోపిడీకి పాల్పడుతున్నారు. నాసిరకం మందుల వల్ల తెగుళ్ళు తగ్గక, అటు పెట్టుబడి పెరిగి, ఇటు దళారుల చేతిలో మద్దతు ధర రాక రైతులు ఆర్థికంగా కుంగిపోతున్నారు. కష్టపడి పండించిన పంటకు సరైన సమయంలో మార్కెటింగ్ సదుపాయం లేకపోవడమే ఈ దుస్థితికి కారణమని అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి నకిలీ మందుల విక్రయాలను అరికట్టాలని, వెంటనే వరి కొనుగోలు కేంద్రాలను అందుబాటులోకి తీసుకురావాలని రైతులు వేడుకుంటున్నారు.

## మిషన్ శక్తి కింద మహిళా సాధికారత జిల్లా కేంద్రంలో 6 పోస్టుల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం



**జనగామ జిల్లా ప్రతినిధి అక్టోబర్ 09 (ప్రజా జ్యోతి) :** మిషన్ శక్తి పథకం కింద జనగామ జిల్లాలోని మహిళా సాధికారత జిల్లా కేంద్రం (డిస్ట్రిక్ట్ హబ్ ఫర్ ఎంపవర్‌మెంట్ ఆఫ్ విమెన్) లో కాంట్రాక్ట్ ప్రాతిపదికన ఆరు పోస్టుల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా మిషన్ కో-ఆర్డినేటర్ -- 01, జెండర్ స్పెషలిస్ట్ -- 2, ఫైనాన్షియల్ లిటరసీలో స్పెషలిస్ట్ -- 1, అకౌంట్స్ అసిస్టెంట్ -- 1, మల్టీ టాస్కింగ్ స్టాఫ్ -- 1 పోస్టు ఉన్నాయన్నారు. 01 అక్టోబర్ 2026 నాటికి అభ్యర్థుల వయసు 21 నుంచి 44 సంవత్సరాల మధ్య ఉండాలన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ అభ్యర్థులకు ఐదేళ్లు, దివ్యాంగులకు పదేళ్ల వయోపరిమితి సడలింపు ఉంటుందన్నారు. అభ్యర్థులకు అక్టోబర్ 15, గురువారం ఉదయం 10 గంటలకు నెగెటివ్ మార్కింగ్‌తో కూడిన రాత పరీక్ష నిర్వహిస్తారన్నారు. అదే రోజు మౌఖిక పరీక్ష నిర్వహించి, ఫలితాలను ప్రకటిస్తారన్నారు. మరుసటి రోజు నియామక ఉత్తర్వులు జారీ చేస్తారన్నారు. పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులు తమ ఒరిజినల్ సర్టిఫికెట్లను తప్పనిసరిగా తీసుకురావాలన్నారు. నిర్ణీత నమూనాలో పూర్తి చేసిన దరఖాస్తులను అక్టోబర్ 9 నుంచి 14వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు జనగామ కలెక్టరేట్ కార్యాలయం ఐడిఓసి లోని ఇన్‌వార్డ్ సెక్షన్‌లో సమర్పించాలన్నారు. దరఖాస్తు సమర్పించిన అభ్యర్థులకు హాల్ టికెట్లు అక్కడికక్కడే జారీ చేస్తారన్నారు. ప్రస్తుతం మహిళా సాధికారత జిల్లా కేంద్రంలో పనిచేస్తున్న వారు కూడా ఈ పోస్టులకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. పోస్టులకు సంబంధించిన విద్యార్హతలు, అనుభవం, పరీక్ష సిలబస్, దరఖాస్తు నమూనా, ఇతర నిబంధనల వివరాలను జనగామ జిల్లా అధికారిక వెబ్‌సైట్ https://jangaon.telangana.gov.inలో లేదా కలెక్టరేట్ కార్యాలయ నోటీసు బోర్డులో పరిశీలించాలని వెల్లడించారు.

## పాఠశాల ఆరోగ్య, శ్రేయస్సు కార్యక్రమాన్ని

# సమర్థవంతంగా అమలు చేయాలి

- విద్యార్థులకు ఆరోగ్యం, పోషకాహారం, మానసిక ఆరోగ్యంపై అవగాహన కల్పించాలి
- జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా



**జనగామ జిల్లా ప్రతినిధి, అక్టోబర్ 09 (ప్రజాజ్యోతి) :** జిల్లాలోని ప్రభుత్వ, ప్రభుత్వ ఎయిడెడ్ పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో 6వ తరగతి నుంచి 12వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులకు ఆరోగ్యం, పోషకాహారం, మానసిక శ్రేయస్సుపై అవగాహన కల్పించేందుకు పాఠశాల ఆరోగ్య, శ్రేయస్సు కార్యక్రమాన్ని ( ఎస్ హెచ్ డబ్ల్యు పి) సమర్థవంతంగా అమలు చేయాలని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా అధికారులకు సూచించారు. శుక్రవారం, జిల్లా సమీకృత కలెక్టర్ కార్యాలయంలోని మినీ కాన్ఫరెన్స్ హాల్లో జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా కార్యక్రమ అమలు తీరుపై సమావేశం నిర్వహించి, సమీక్షించారు. ఆయుష్మాన్ భారత్‌లో భాగంగా కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ, విద్యా మంత్రిత్వ శాఖల సంయుక్త ఆధ్వర్యంలో అమలవుతున్న ఈ కార్యక్రమాన్ని రాష్ట్రంలోని మరో 21 జిల్లాలకు విస్తరించగా, అందులో జనగామ జిల్లా కూడా ఉందన్నారు. ప్రతి పాఠశాల నుంచి ఇద్దరు ఉపాధ్యాయులను ఎంపిక చేసి, శిక్షణ అనంతరం హెల్త్ అండ్ వెల్నెస్ అంబాసిడర్లుగా కార్యక్రమంలో భాగస్వాములను చేయాలన్నారు. ప్రతి వారం ఒక గంట పాటు విద్యార్థులకు ఆరోగ్యం, పోషకాహారం, పరిశుభ్రత, మానసిక ఆరోగ్యం, వ్యాధుల నివారణపై అవగాహన కల్పించాలన్నారు. ప్రతి మంగళవారాన్ని ఆరోగ్యం, శ్రేయస్సు డేగా నిర్వహించి, నిర్దేశించిన 11 అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించాలన్నారు. విద్యార్థుల్లో రక్తహీనత, పోషకాహార లోపం, ఇతర ఆరోగ్య సమస్యలను ముందుగానే గుర్తించి, అవసరమైన వారికి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ఆసుపత్రులు, కౌమార ఆరోగ్య క్లినిక్‌ల ద్వారా వైద్య సేవలు అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. యోగా, ధ్యానం, సురక్షిత తాగునీరు, రుతుక్రమ పరిశుభ్రత, ఆరోగ్యకరమైన జీవనశైలిపై అవగాహన పెంపొందించాలన్నారు. ఈ మేరకు నిర్వహించిన కార్యక్రమ వివరాలను ఎస్ హెచ్ డబ్ల్యు పి ఎంఐఎస్ మొబైల్ యాప్ లో నమోదు చేసి, నివేదికలను సమర్పించాలన్నారు. జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రభుత్వ ఎయిడెడ్ పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో ఈ కార్యక్రమాన్ని సమర్థవంతంగా అమలు చేసేలా సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో చర్యలు తీసుకోవాలన్నారు. ఉపాధ్యాయులకు అవసరమైన శిక్షణ, విద్యార్థులకు క్రమం తప్పకుండా అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం, ఆరోగ్య సమస్యలున్న విద్యార్థులకు సకాలంలో వైద్య సేవలు అందేలా చూడటం, కార్యక్రమ అమలును పర్యవేక్షించడం ద్వారా పాఠశాలల్లో ఆరోగ్యకరమైన వాతావరణాన్ని పెంపొందించాలని స్పష్టం చేశారు. ఈ సమీక్ష సమావేశంలో డీఎంహెచ్ఓ వాణిశ్రీ, జీసీడీఓ గౌసియా బేగం, అన్ని మండలాల ఎంఈఓలు, ప్రభుత్వ, ప్రభుత్వ ఎయిడెడ్ పాఠశాలలు, జూనియర్ కళాశాలల ప్రధానోపాధ్యాయులు, ఇతర సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు నమోదు చేసుకోవాలి



**పరకాల, అక్టోబర్ 09, (ప్రజాజ్యోతి) :** పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో అర్హులైన పట్టభద్రులంతా ఓటరుగా నమోదు చేసుకోవాలని బీఆర్ఎస్ నాయకులు విజ్ఞప్తి చేశారు. పరకాల పట్టణంలోని 6వ వార్డులో శుక్రవారం ఓటరు నమోదు కార్యక్రమంపై ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టభద్రులు ఓటరుగా నమోదు చేసుకోవడంతోపాటు, ఎన్నికల్లో మొదటి ప్రాధాన్యత ఓటును బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థికి వేయాలని ఓటర్లను కోరారు. ఈ కార్యక్రమంలో 6, 7, 8వ వార్డుల ఎమ్మెల్సీ ఇన్‌ఛార్జి, బీఆర్ఎస్ పట్టణ ఉపాధ్యక్షుడు దుంపేటి నాగరాజు, 6వ వార్డు అధ్యక్షుడు తుమ్మల రాణి-రవి, అల్లె చిరంజీవి, వార్డు ఎమ్మెల్సీ ఇన్‌ఛార్జి శివ తదితరులు పాల్గొన్నారు.

## నర్సంపేట ఆర్టీసీ యూనియన్ ఎన్నికలు ప్రశాంతం



**నర్సంపేట అక్టోబర్ 9 (ప్రజా జ్యోతి) :** నర్సంపేట శాసనసభ్యులు దొంతి మాధవరెడ్డి ఆదేశాల మేరకు నర్సంపేట డిపో ఎన్ ఏం యు గౌరవ అధ్యక్షులు వేముల సాంబయ్య గౌడ్ ఎన్ ఏం యు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎండీ మౌలాన ఎన్నికలవేళ వరంగల్ రీజియన్ నర్సంపేట డిపోను సందర్శించినారు ఈ కార్యక్రమంలో నర్సంపేట డిపో ఎన్ ఏం యు, ఈ యు,టీ ఏం యు, టీ జె ఏం యు కార్మికులు ఓటు హక్కు ను వినియోగించుకొని పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు పి.ఎన్.రావు బండి బాబు గోలకొండ వేణు రాంబాబు కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు దండెం రతన్ కుమార్,పట్టణ కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు వేముల సారంగం గౌడ్,ఎన్ ఎస్ యు ఐ ప్రెసిడెంట్ కటారి ఉత్తమ్ కుమార్, 29వ డివిజన్ కార్యదర్శి దొమ్మటి కుమారస్వామి ఉమ్మడి జేఏసీ ఉద్యోగులు కార్మికులు పాల్గొన్నారు.

## టపాసుల కొనుగోళ్లలో వినియోగదారులు అప్రమత్తంగా ఉండాలి

- నిబంధనలకు విరుద్ధంగా అమ్మకాలు
- త్వరలో అధికారులకు ఫిర్యాదు చేస్తాం
- సీసీసీ చైర్మన్ మొగిలిచర్ల సుదర్శన్




**వరంగల్ సిటీ, అక్టోబరు 09(ప్రజాజ్యోతి) :** దసరా, దీపావళి పండుగల సందర్భంగా బాణసంచా కొనుగోళ్లలో వినియోగదారులు అప్రమత్తంగా ఉండాలని సీసీసీ చైర్మన్ మొగిలిచర్ల సుదర్శన్ సూచించారు. నాణ్యత లేని, ప్రమాదకరమైన టపాసుల విక్రయాలతో వినియోగదారులు ఆర్థికంగా, ఆరోగ్యపరంగా, పర్యావరణపరంగా నష్టపోయే ప్రమాదం ఉందన్నారు. శుక్రవారం నగరంలోని శివనగర్‌లో గల సమాఖ్య కార్యాలయంలో మురారిశెట్టి యశ్వంత్ కుమార్ అధ్యక్షతన జరిగిన వరంగల్ ఉమ్మడి జిల్లా సమాఖ్య ప్రతినిధుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బాణసంచా విక్రయాల్లో నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని, సంబంధిత ధ్రువపత్రాలు కలిగిన గ్రీన్ క్రాకర్స్‌నే విక్రయించాలని సూచించారు. టపాసుల ప్యాకెట్లపై క్యూఆర్ కోడ్ ఉండాలని తెలిపారు. సమాఖ్య ఇటీవల నిర్వహించిన టెస్ట్ పర్చేజ్‌లో వరంగల్ చిన్న బ్రిడ్జి, హంటర్ రోడ్, పాత బీటుబజార్, హనుమకొండ, కాజీపేట ప్రాంతాల్లోని దుకాణాల్లో కొనుగోలు చేసినప్పుడు ఒరిజినల్ బిల్లులు ఇవ్వలేదని, ఒకే రకమైన వస్తువులకు దుకాణాల మధ్య ధరల్లో వ్యత్యాసాలు ఉన్నాయని సుదర్శన్ వెల్లడించారు. ప్యాకెట్లపై క్యూఆర్ కోడ్లు లేకపోవడంతో పాటు గ్రీన్ క్రాకర్స్ అందుబాటులో కనిపించలేదని పేర్కొన్నారు. ఈ అంశాలపై ఆధారాలతో సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు. ముఖ్యంగా బాణసంచాను కిలోల లెక్కన విక్రయించే విధానానికి దూరంగా ఉండాలని వినియోగదారులకు సూచించారు. ఈ విధానంలో ధర, నాణ్యత విషయంలో మోసపోయే అవకాశం ఉందన్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా సమాఖ్య ప్రతినిధులు వివిధ మాధ్యమాల ద్వారా వినియోగదారులకు అవగాహన కల్పించాలని కోరారు. ఈ సమావేశంలో సమాఖ్య జిల్లా ప్రతినిధులతో పాటు టెక్నికల్, లీగల్ అడ్వైజర్లు దిద్ది లక్ష్మీనారాయణ, బండి అనిల్ కుమార్, రాయబారపు భిక్షపతి, శ్రీనివాస్, కిషన్ రావు తదితరులు పాల్గొన్నారు

## అంగన్వాడీ కేంద్రంలో పోషణ మాసం కార్యక్రమం



**కొడకండ్ల అక్టోబర్ 09 (ప్రజాజ్యోతి) :** ఐసిడిఎస్ ఆధ్వర్యంలో నిర్వహించే పోషణ మాసం కార్యక్రమంలో భాగంగా గురువారం మండలంలోని మొండ్రాయి 01 వ అంగన్వాడి కేంద్రంలో పోషణ మాస కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ గునిగంటి వెంకన్న, ఉప సర్పంచ్ మచ్చ శోభ, కార్యదర్శి పల్లె పూజిత, ఐసిడిఎస్ సూపర్వైజర్ సారిక పాల్గొని పోషక ఆహార ప్రాముఖ్యతను గర్భిణీలు, బాలింతలకు వివరించారు. తక్కువ ఖర్చుతో ఎక్కువ పోషకాలు గల ఆహారాన్ని తయారు చేసుకునే విధానాన్ని తెలియజేశారు. అనంతరం విద్యార్థులకు అక్షరాభ్యాస కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏడబ్ల్యూటీ ఎండి తహారభి, ఏఎన్ఎం చైతన్య, ఆశాలు బయమ్మ, ప్రమీల, ఆయా కొండమ్మ, తల్లులు గర్భిణీలు బాలింతలు పాల్గొన్నారు.

## పట్టభద్రులంతా ఓటు నమోదు చేసుకోవాలి

చందుపట్ల సాయి తిరుపతిరెడ్డి పిలుపు



**పరకాల, అక్టోబర్ 09, (ప్రజాజ్యోతి):** పట్టభద్రులంతా ఓటరుగా తమ పేర్లను నమోదు చేసుకోవాలని 9, 10, 11వ వార్డుల ఇన్‌చార్జి చందుపట్ల సాయి తిరుపతిరెడ్డి కోరారు. పరకాల మున్సిపాలిటీ పరిధిలోని 10వ వార్డులో శుక్రవారం పట్టభద్రుల ఓటు నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి ఆదేశాల మేరకు ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమంలో 10వ వార్డు కాంటెస్టెడ్ అభ్యర్థి పిట్ట స్వప్న దేవేందర్, 9, 10, 11వ వార్డుల ఇన్‌చార్జి చందుపట్ల సాయి తిరుపతిరెడ్డి, క్లస్టర్ ఇన్‌చార్జి బండి రమేష్ గౌడ్ పాల్గొన్నారు. వార్డు ఇన్‌చార్జిలు రాసమళ్ల సతీష్, చెరుకు సుధాకర్, చెరుకు నాగరాజు, బుస్స భద్రయ్య, గూడెల్లి రజిత తదితరులు పాల్గొన్నారు. అర్హులైన పట్టభద్రులు ఓటు నమోదు ప్రక్రియను సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు.

## 18వ డివిజన్‌లో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ



**పరకాల, అక్టోబర్ 09, (ప్రజాజ్యోతి) :** పరకాల మున్సిపాలిటీ పరిధిలోని 18వ డివిజన్‌లో లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి స్థానిక కౌన్సిలర్ రేగూరి కరుణ విజయపాల్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై, స్థానిక రేషన్ డీలర్ ఏకు భవానీ, నాయకులు ఏకు రఘుపతి, శనిగరం శ్రీనివాస్‌లతో కలిసి లబ్ధిదారులకు కార్డులను అందజేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

## నర్సంపేటలో ఎఫ్ఎంజిఈ వైద్యుల నిరసన

సమాన స్టైఫండ్ ఇవ్వాలని డిమాండ్



**నర్సంపేట అక్టోబర్ 9 (ప్రజా జ్యోతి) :** నర్సంపేట మెడికల్ కాలేజ్ హాస్పిటల్‌లో ఇంటర్న్‌షిప్ చేస్తున్న ఎఫ్ఎంజిఈ వైద్యులు శుక్రవారం రోజున ఆసుపత్రి ఆవరణలో నిరసన చేపట్టారు. సమాన పనికి సమాన స్టైఫండ్ ఇవ్వాలని డిమాండ్ చేస్తూ ప్లకార్డులు చేతబట్టి ఆందోళన వ్యక్తం చేశారు. ఆంగ్లంలో, స్టైపెండ్ కోసం కాదు సమానత్వం కోసం పోరాటం, మా శ్రమకు స్టైపెండ్ మా హక్కుఅంటూ తెలుగులో నినాదాలు చేశారు. ఈ సందర్భంగా వైద్యులు మాట్లాడుతూ విదేశాల్లో ఎంబీబీఎస్ పూర్తి చేసి, కేంద్ర ప్రభుత్వం నిర్వహించే ఎఫ్ఎం జి ఈ పరీక్షలో ఉత్తీర్ణులై, తెలంగాణ మెడికల్ కౌన్సిల్ ద్వారా మెరిట్ ప్రకారం నర్సంపేట మెడికల్ కాలేజీకి కేటాయించబడ్డామని తెలిపారు. ఇక్కడ భారతీయ వైద్య విద్యార్థులతో సమానంగా 12 గంటల డ్యూటీలు, ఎమర్జెన్సీ, రాత్రి డ్యూటీలు చేస్తున్నప్పటికీ తమకు స్టైఫండ్ విషయంలో వివక్ష చూపుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణ ప్రభుత్వం 2025 జూన్ 28న జారీ చేసిన జీవో ప్రకారం ఎంబీబీఎస్ ఇంటర్న్‌లకు రూ.29,792 స్టైఫండ్ ఇస్తుండగా, ఎఫ్ ఏం జి ఈ వైద్యులకు ఆ మొత్తం ఇవ్వడం లేదని, కొన్ని చోట్ల అసలు ఇవ్వట్లేదని వారు పేర్కొన్నారు. ఎన్ఎంసీ 2022 మార్గదర్శకాలు సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం తమకు కూడా సమాన స్టైఫండ్ ఇవ్వడం తమ హక్కు అని స్పష్టం చేశారు. వెంటనే తెలంగాణ ప్రభుత్వం, వైద్య విద్య శాఖ స్పందించి నర్సంపేట మెడికల్ కాలేజ్ లోని ఎఫ్ ఏం జి ఈ ఇంటర్న్‌లకు సమాన స్టైఫండ్ అమలు చేసి, పెండింగ్ బకాయిలు విడుదల చేయాలని వారు డిమాండ్ చేశారు.

## ఆక్స్‌ఫర్డ్ స్కూల్‌లో ఘనంగా ముందస్తు బతుకమ్మ సంబురాలు

చిట్యాల అక్టోబర్ 10 ( ప్రజాజ్యోతి):
చిట్యాల పట్టణంలోని ఆక్స్‌ఫర్డ్ స్కూల్‌లో బతుకమ్మ సంబురాలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో విద్యార్థినులు, ఉపాధ్యాయినులు ఉత్సాహంగా పాల్గొని సంప్రదాయబద్ధంగా బతుకమ్మను పేర్చి పండుగ సంబరాలను



జరుపుకున్నారు. రంగురంగుల పూలతో అందంగా అలంకరించిన బతుకమ్మ చుట్టూ చేరిన విద్యార్థినులు, ఉపాధ్యాయినులు బతుకమ్మ పాటలు పాడుతూ లయబద్ధంగా నృత్యాలు చేశారు. పాఠశాల ప్రాంగణం బతుకమ్మ పాటలు, ఆటపాటలతో సందడిగా మారింది. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగ విశిష్టతను ఈ సందర్భంగా విద్యార్థినులు చాటిచెప్పారు. విద్యార్థుల్లో తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాల పట్ల అవగాహన పెంపొందించడంతో పాటు ఐకమత్యం, సాంస్కృతిక విలువలను ప్రోత్సహించే లక్ష్యంతో పాఠశాలలో ఈ వేడుకలను నిర్వహించారు. విద్యార్థినులు,ఉపాధ్యాయినులు సంప్రదాయ దుస్తుల్లో పాల్గొని వేడుకలకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు.

## దేదీప్య హైస్కూల్‌లో ఘనంగా బతుకమ్మ సంబరాలు

భువనగిరి, అక్టోబర్ 9(ప్రజాజ్యోతి)
ఆర్.బి. నగర్‌లోని దేదీప్య హైస్కూల్‌లో బతుకమ్మ సంబరాలను ఘనంగా నిర్వహించారు.తెలంగాణ సంస్కృతి,సంప్రదా యాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను పురస్కరిం చుకొని పాఠశాల ఆవరణలో పండుగ వాతావరణం నెలకొంది. విద్యార్థులు, ఉపాధ్యా యులు ఉత్సాహంగా పాల్గొని బతుకమ్మ వేడుకలను వైభవంగా జరుపుకున్నారు.ఈ సందర్భంగా విద్యార్థులు రంగురంగుల పూలతో బతుకమ్మలను అందంగా అలంకరించి,సంప్రదా యబద్ధంగా బతుకమ్మ పాటలు పాడుతూ వేడుకల్లో పాల్గొన్నారు. తెలంగాణ మహిళల ఆత్మీయతకు ప్రకృతి





ఆరాధనకు,పూల ప్రాధాన్యతకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగ విశిష్టతను విద్యార్థులకు వివరించారు.ఇటువంటి సాంస్కృతిక కార్యక్రమాల ద్వారా విద్యార్థుల్లో మన సంప్రదాయాల పట్ల గౌరవం, ఐక్యతాభావం, సామాజిక స్పృహ పెంపొందుతాయని నిర్వాహకులు తెలిపారు.ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ మరియు ప్రిన్సిపాల్ టి.శేషగిరి రావు వైస్ ప్రిన్సిపాల్ రూప డైరెక్టర్లు రంగా రావు, రమ్య పాల్గొన్నారు.అలాగే ఉపాధ్యాయులు జ్యోతి బబిత,సరిత,రిజ్వానా హేమలత,సంగీత,భవాని రేఖ,నందిక తదితరులు పాల్గొని వేడుకలను విజయవంతం చేశారు. విద్యార్థుల ఉత్సాహ భరితమైన పాల్గొనడంతో పాఠశాలలో బతుకమ్మ సంబరాలు కన్నుల పండువగా సాగాయి. తెలంగాణ సంస్కృతి సంప్రదా యాలను భావి తరాలకు పరిచయం చేస్తూ విద్యతో పాటు సాంస్కృతిక విలువలకు ప్రాధాన్యతనివ్వడంలో దేదీప్య హైస్కూల్ ఎల్లప్పుడూ ముందుంటుందని పాఠశాల యాజమాన్యం పేర్కొంది.

## జీనియస్ పాఠశాల లోఘనంగా బతుకమ్మ సంబరాలు

### ముఖ్య అతిధిగా పాల్గొన్న జాగృతి విద్య సంస్థ ల చైర్మన్

భువనగిరి,అక్టోబర్ 9(ప్రజాజ్యోతి):
తెలంగాణ సాంస్కృతి సంప్రదా యాలకు ప్రతీకైనా బ్రతుకమ్మ పండుగ సంబరాలు






శనివారం స్థానిక జీనియస్ పాఠశాలలో ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా విద్యార్థులు రంగురంగుల పూలతో బతుకమ్మను పేర్చి ఒకచోట పెట్టి విద్యార్థులు ఉత్సాహంతో అధిక సంఖ్యలో పాల్గొని బతుకమ్మ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఇట్టి వేడుకలు చిన్నారులు ధరించిన వేషాదరణలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి కార్యక్రమం అనంతరం పాఠశాల కరస్పాండెంట్ డాక్టర్ బి,సూర్యనారాయణ రెడ్డి రావణాసుర వద కార్య క్రమాలు నిర్వహించి అనంతరం,తల్లిదండ్రులకు విద్యార్థులకు పాఠశాల అధ్యాపక బృందానికి ముందస్తు బతుకమ్మ దసరా శుభాకాంక్షలు తెలియజేశారు ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ వి,సుచరిత ఏవో జి రవి ఉపాధ్యాయ బృందం తదితరులు పాల్గొన్నారు.

## శాసన మండలి చైర్మన్‌తో డీసీసీ అధ్యక్షుడి భేటీ..

నల్గొండ అక్టోబర్ 9,(ప్రజా జ్యోతి ): తెలంగాణ శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డిని నల్గొండ జిల్లా కాంగ్రెస్ కమిటీ (డీసీసీ) అధ్యక్షుడు పున్న కైలాష్ నేత శుక్రవారం హైదరాబాద్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన శాసన మండలి చైర్మన్‌తో సమావేశమయ్యారు.నల్గొండ జిల్లా రాజకీయాల్లో కీలక బాధ్యతలు నిర్వహిస్తున్న డీసీసీ అధ్యక్షుడు పున్న కైలాష్ నేత, శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డిని కలవడం ప్రాధాన్యత సంతరించుకుంది. అయితే, ఈ భేటీ మర్యాదపూర్వకంగా జరిగినట్లు అందిన సమాచారం వెల్లడిస్తోంది.



## శివ రైస్ మిల్లు యజమానులు గంప నాగేందర్ మంచాల రవీందర్ ల పై క్రిమినల్ కేసులు నమోదు

### 6,302 మెట్రిక్ టన్నులకుపైగా ధాన్యం కొరతగా గుర్తింపు..

### 23కోట్ల 3లక్షల ధాన్యం పక్క దారి మళ్ళింపు

### అధికారుల ఫిర్యాదుతో రంగంలోకి దిగిన పోలీసులు

భువనగిరి,అక్టోబర్ 9(ప్రజాజ్యోతి):
భువనగిరిప్రభుత్వ ధాన్యం నిల్వల్లో భారీ కొరత.విలువ జరిమానాతో కలిపి ఏకంగా రూ.23 కోట్లు దాటింది! ప్రభుత్వానికి బియ్యం అప్పగించాల్సిన కస్టమ్ మిల్లింగ్ ప్రక్రియలో అక్రమాలు జరిగినట్లు వచ్చిన ఫిర్యాదుతో భువనగిరి రూరల్ పోలీసులు కేసు నమోదు చేశారు. రాయిగిరి గ్రామంలోని శివ పారా బాయిల్డ్ ఇండస్ట్రీస్‌లో 6,302.80 మెట్రిక్ టన్నుల ప్రభుత్వ ధాన్యం కొరత ఉన్నట్లు పౌరసరఫరాల శాఖ అధికారులు గుర్తించినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు.ఖరీఫ్



2025–26 సీజన్‌కు సంబంధించి ఈ నెల 7న అధికారులు,సాంకేతిక సిబ్బందితో కలిసి మిల్లులో భౌతిక తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో ప్రభుత్వ ధాన్యం నిల్వల్లో భారీ కొరత ఉన్నట్లు గుర్తించినట్లు తెలంగాణ రాష్ట్ర పౌరసరఫరాల సంస్థ యాదాద్రి జిల్లా మేనేజర్ దాచేపల్లి హరికృష్ణ పోలీసులకు ఫిర్యాదు చేశారు.కొరతగా ఉన్న ధాన్యం విలువ, జరిమానాతో కలిపి రూ.23,03,67,347గా అంచనా వేసినట్లు ఫిర్యాదులో వెల్లడించారు. ప్రభుత్వ ధాన్యాన్ని కస్టమ్ మిల్లింగ్ చేసి, నిబంధనల ప్రకారం బియ్యాన్ని



ప్రభుత్వానికి అప్పగించాల్సి ఉండగా, నిల్వల్లో ఇంత భారీ కొరత ఏర్పడటంపై అధికారులు ఫిర్యాదు చేశారు.ఈ వ్యవహారంలో మిల్లు భాగస్వాములైన గంప నాగేందర్,మంచాల రవీందర్‌లపై చర్యలు తీసుకోవాలని కోరడంతో భువనగిరి రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## బి ఎన్ తిమ్మాపూర్ పునరావస కాలనీలో నీటి వసతి కల్పించాలని ఆర్డీవో ని కోరిన సర్పంచ్ ఎడ్ల వెంకట్ రెడ్డి

భువనగిరి,అక్టోబర్ 9(ప్రజాజ్యోతి):
బస్వపూర్ రిజర్వాయర్ లో ముంపునకు,గురవుతున్న బి ఎన్ తిమ్మాపురం నిర్వాసితులకు కేటాయిం చిన పునరావాసఆర్



అండ్ ఆర్ కాలనీలో నీటి వసతి కల్పించాలని కొద్దిరోజుల క్రితం ఆర్డిఓ ని కలిసి సర్పంచ్,ఎడ్ల వెంకట్ రెడ్డి కోరడంతో,స్పందించిన ఆర్డీవో పంచాయతీరాజ్ ఆర్డబ్ల్యూఎస్ అధికారు లు మరియు స్థానిక సర్పంచ్ తో కలిసి పునరావాస కాలనీని పరిశీలించారు.సర్పంచ్ ఆర్డీఓ తో మాట్లాడుతూ మా పునరావాస గ్రామంలో నిర్వాసితులు అందరు ఇండ్ల నిర్మాణం చేస్తు న్నారని ఇక్కడ తీవ్ర నీటి సమస్య ఉండడంతో నీటి ట్యాంకర్ల ద్వారా నీరును కొనుగోలు చేసి నిర్మాణాలు చేపడుతున్నారని ఇక్కడ నివసిస్తున్న వారికి కూడా నీళ్లు లేక చాలా ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. తక్షణమే నీటి సమస్యను పరిష్క రించాలని కోరారు. వెంటనే స్పందించిన ఆర్డీవో మంచినీటి సమస్య పరిష్కారం కోసం ఎక్కడైతే నీటి లభ్యత ఉంటుందో అక్కడ బోర్లు వేసి నిర్వాసి తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా తొందరగా నీటి వసతిని కల్పించాలని అధికారులను ఆదేశించారు.ఈ సందర్భంగా ఆర్ డబ్ల్యూ ఎస్ పంచాయతీ రాజ్ అధికారులు ఆర్డీఓ కి విన్నవిస్తూ రెండు బోర్ పాయింట్లు చూడడం జరిగిందని,త్వరలో బోర్లు వేసి నిర్వాసితుల కాలనీకి నీటిని అందిస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో పంచాయతీ రాజ్, ఆర్డబ్ల్యూఎస్ అధికారులలు సర్పంచ్ ఎడ్ల వెంకట్ రెడ్డి ఉప సర్పంచ్ గ్రామస్థుల పాల్గొన్నారు.

## చేగువేరా ఆశయాల సాధనకు విద్యార్థి, యువత ఉద్యమాలు ముందుకు సాగాలి

### డి వై ఎఫ్ వై పట్టణ కార్యదర్శి మొరిగాడి పృథ్వీ, ఎస్.ఎఫ్. ఐ మండల కార్యదర్శి కాసుల నరేష్

ఆలేరు అక్టోబర్ 9 (ప్రజాజ్యోతి):
యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు పట్టణ కేంద్రంలో డివైఎఫ్ఐ ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ప్రజా సంఘాల కార్యాలయం లో చేగువేరా వర్ధంతి నిర్వహించారు. చే గువేరా చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా డివైఎఫ్ఐ పట్టణ కార్యదర్శి మోరీగాడి పృథ్వీ , ఎస్ఎఫ్ఐ కార్యదర్శి కాసుల నరేష్ లు మాట్లాడుతూ.. చే గువేరా ప్రపంచవ్యాప్తంగా పీడిత ప్రజల విముక్తి కోసం, సామాజిక అసమానతలకు వ్యతిరేకంగా పోరాడిన గొప్ప విప్లవకారుడని అన్నారు. ఆయన జీవితం, పోరాట స్ఫూర్తి నేటి విద్యార్థులకు, యువతకు ఆదర్శమని పేర్కొన్నారు. సమాజంలో నెలకొన్న అన్యాయాలు, వివక్ష, అసమానతలకు వ్యతిరేకంగా విద్యార్థులు, యువత ఐక్యంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు.చేగువేరా ఆశయాలను కొనసాగిస్తూ సమానత్వం, సామాజిక న్యాయం కోసం నిరంతరం పోరాడాలని వారు యువతకు పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో డివైఎఫ్ఐ మాజీ జిల్లా నాయకులు వడ్డెమాను విప్లవ్, పట్టణ నాయకులు ఎక్కల్ దేవి భాస్కర్




,మొరిగాడి మహావీర్ ఎస్ఎఫ్ఐ నాయకులు మామిడాల సంపత్, కర్రె విజయ్,అందే సురేష్, రాహుల్ తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ నవభారత్ డిగ్రీ,పీజీ కళాశాలలో ఘనంగా బతుకమ్మ ఉత్సవాలు

భువనగిరి,అక్టోబర్ 9(ప్రజాజ్యోతి):
శ్రీ నవభారత్ డిగ్రీ కళాశాల, భువనగిరిలో బతుకమ్మ





ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థినులు వివిధ రకాల పూలతో బతుకమ్మలను అందంగా అలంకరించి,సంప్రదాయ దుస్తులు ధరించి ఉత్సవాల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు.తెలంగాణ సంస్కృతి,సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగ విశిష్టతను ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ చిక్క ప్రభాకర్ గౌడ్ మాట్లాడుతూ బతుకమ్మ పాటలు ఆటలతో కళాశాల ప్రాంగణం సందడిగా మారింది.ఇలాంటి కార్యక్రమాలు విద్యార్థుల్లో సాంస్కృతిక విలువలను, ఐక్యతాభావాన్ని పెంపొంది స్తాయని అధ్యాపకులు అన్నారు.ఈ కార్య క్రమంలో అధ్యాప కులు,అధ్యాప కేతర సిబ్బంది,విద్యార్థులు పాల్గొన్నారు.

## శాస్త్రీయ సాగుతో రైతులకు అధిక లాభాలు

### జిల్లా వ్యవసాయ శాఖ అధికారి జి.శ్రీధర్‌రెడ్డి

గడ్డిపల్లి,అక్టోబర్ 9 (ప్రజా జ్యోతి):
శాస్త్రీయ వ్యవసాయ పద్ధతులను పాటిస్తూ సాగు ఖర్చులు తగ్గించుకొని,అధిక దిగుబడులతో రైతులు మెరుగైన ఆదాయం పొందాలని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి జి.శ్రీధర్‌రెడ్డి సూచించారు.సూర్యాపేట జిల్లా గరిడే పల్లి మండలం గడ్డిపల్లి కృషి విజ్ఞాన కేంద్రం (కెవికె)లో ఆత్మ,వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన కిసాన్ మేళా నిర్వహించారు.వ్యవసా య ప్రదర్శన స్టాళ్లను గడ్డిపల్లి సర్పంచ్ నాగలక్ష్మి ప్రారంభించారు.ఈ సందర్భం గా జిల్లా వ్యవసాయ శాఖ అధికారి మాట్లాడుతూ ఆధునిక వ్యవసాయ సాంకేతికతలు,నూతన సాగు పద్ధతు లపై రైతులు అవగాహన పెంచుకోవాల ని పేర్కొన్నారు.ప్రకృతి వ్యవసాయం, చిరుధాన్యాల సాగు,ఉద్యాన పంటలు, పంటల యాజమాన్య పద్ధతులపై శాస్త్రవేత్తలు అందించే సూచనలు పాటిం చాలని తెలిపారు.వ్యవసాయంలో యాంత్రీకరణను వినియోగించుకోవడం ద్వారా సమయం,పెట్టుబడి ఆదా చేసుకోవచ్చన్నారు.వివిధ శాఖల అధికారులు తమ పథకాలు, రైతులకు అందిస్తున్న సేవలను వివరించారు.రైతు లు ఎదుర్కొంటున్న సాగు సమస్యలకు శాస్త్రవేత్తలు పరిష్కారాలు సూచించారు. ఈ కార్యక్రమంలో కేవీకే గడ్డిపల్లి సీనియర్ శాస్త్రవేత్త & హెడ్ డి.నరేష్, ఆత్మ డీడీపీ జి.నివేదిత,ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మిల్లెట్ రీసెర్చ్ స్టేషన్ సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ సేవా నాయక్, టీఆర్‌వీకే శాస్త్రవేత్త డాక్టర్ కె.చంద్రశేఖర్, ఏఆర్ఎస్ కంపసాగర్ శాస్త్రవేత్త డాక్టర్ వి.శ్రీధర్,కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు సి.హెచ్.నరేష్,ఎ.కిరణ్,డి.ఆదర్శ్,ఎం.ఎన్.సుగంధి,డాక్టర్ పి.అక్షిత్ సాయి, ఎ.నరేష్,కవిత సిఆర్పి కేవీకే సిబ్బంది, బి.నాగేశ్వరరావు,బి.లింగయ్య,మండల వ్యవసాయ అధికారి ప్రీతమ్ కుమార్, ఆత్మ ప్రతినిధులు,కోదాడ,హుజూర్‌నగర్ తుంగతుర్తి,సూర్యాపేట వ్యవసాయ అధికారులు,సహాయ వ్యవసాయ సంచాలకులు (ఎడిఎస్) వివిధ పరిశోధ నా సంస్థల శాస్త్రవేత్తలు,రైతు ప్రతినిధులు,రైతులు పాల్గొన్నారు.




## నాగార్జున లో ఘనంగా ముందస్తు బతుకమ్మ సంబరాలు..

నూతనకల్, అక్టోబర్ 09 (ప్రజా జ్యోతి):
మండల కేంద్రంలోని నాగార్జున ఉన్నత పాఠశాలలో ముందస్తు బతుకమ్మ వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా విద్యార్థిని





విద్యార్థులు రంగురంగుల పువ్వులతో బతుకమ్మను పేర్చి గౌరీ మాతను నెలకొల్పి పాఠశాల ప్రాంగణంలో కొలువు తీర్చి బతుకమ్మ పాటలు పాడుతూ, ఉయ్యాలలు ఊగుతూ, నృత్యాలు చేస్తూ చేసిన ప్రదర్శనలు చూపరులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. అనంతరం పాఠశాల కరస్పాండెంట్ మారగాని వెంకట్ గౌడ్ మాట్లాడుతూ తెలంగాణ సంస్కృతి సాంప్రదాయాలకు ప్రతీక బతుకమ్మ పండుగ అని, విద్యార్థులకు మన సంస్కృతి సాంప్రదాయాలను తెలియజేయడంతో పాటు గౌరవభావాలు పెంపొందించే దిశగా ఇలాంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు మారగాని విజయలక్ష్మి, ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు గుర్రం యాదగిరి గౌడ్,మొగుళ్ల వెంకటనారాయణ,బిక్కి రామన్న,మహమ్మద్ మతిన్, నల్లగొండ వెంకట్,సౌమ్య, ప్రియాంక,రాజేశ్వరి,హేమలత, సునీత,యాస్మిన్,శ్వేత, ప్రియాంక,పావని,స్వప్న, సంధ్య,విద్యార్థిని విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## బతుకమ్మ సంబరాలకు ఏర్పాట్లు

### ఆలేరు మున్సిపల్ చైర్పర్సన్ బాలమణి భాస్కర్

ఆలేరు అక్టోబర్ 9 (ప్రజా జ్యోతి)
యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు పట్టణంలో ఈ నెలలో జరగబోయే బతుకమ్మ దసరా పండుగ లను దృష్టిలో ఉంచుకొని పెద్దవాగులో ఆలేరు మున్సిపల్ చైర్ పర్సన్ బాలమణి భాస్కర్ ఏర్పాట్లు పరిశీలించారు. ఈ సందర్భంగా పెద్దవాగులో ఉన్న కంపె చెట్లను తొలగించే ఆలేరు ప్రజలకు భక్తులకు అసౌకర్యం లేకుండా



బతుకమ్మ ఆడుకోవడానికి దసరా పండుగ జరుపుకోవడానికి వీలుగా జెసిబి తో స్వచ్ఛవాగు కార్యక్రమాన్ని ప్రారంభించరూ. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ అంగడి ఆంజనేయులు, కౌన్సిలర్ జూకంటి సంపత్, మల్లెల సరిత శ్రీకాంత్, వానరాశి మరియమ్మ మార్క్, నాయకులు తాళ్లపల్లి మహేష్, రాములు కనకదుర్గ ఆలయ కమిటీ అధ్యక్షుడు హరినాథ్ తదితరులు పాల్గొన్నారు.

## సత్యనారాయణ కుటుంబానికి పరామర్శ

ఆలేరు అక్టోబర్ 9 (ప్రజాజ్యోతి):
యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు మండలం గుండ్లగూడెం గ్రామ బిఆర్ఎస్ వార్డ్ మెంబర్ ఆలేటి నాగార్జున తండ్రి ఆలేటి సత్యనారాయణ ఇటీవల మరణించగా శుక్రవారం ఆలేరు మాజీ ప్రభుత్వ విప్ గొంగిడి సునీత మహేందర్ రెడ్డి వారి కుటుంబ సభ్యులను పరివర్శించారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు గంగుల శ్రీనివాస్, పట్టణ అధ్యక్షులు పుట్ట మల్లేష్, గ్రామ సర్పంచ్ మంజుల మహేందర్ రెడ్డి, మహిళలు తదితరులు ఉన్నారు



## తెలంగాణ ఉద్యమకారుడు పాశం కుమార్‌కు సన్మానం



ఇందల్వాయి ( ప్రజా జ్యోతి ) అక్టోబర్. 9 ఇందల్వాయి: మండల కేంద్రంలోని ఇందల్వాయి గ్రామానికి చెందిన పాశం కుమార్ తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో ముందుండి పోరాడిన ఇందల్వాయి గ్రామానికి చెందిన పాశం కుమార్‌ను మాజీ రూరల్ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ సన్మానించారు. తెలంగాణ ఉద్యమ సమయంలో ఎన్నో ఇబ్బందులు, ఆటంకాలు ఎదుర్కొంటూ, కేసులకు భయపడకుండా పోరాటం కొనసాగించిన ఉద్యమకారులను పార్టీ ఎప్పటికీ గుర్తించి గౌరవిస్తుందని ఆయన అన్నారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం పాశం కుమార్‌తో పాటు డిచ్‌పల్లి మండలానికి చెందిన శేఖర్, కొండ కృష్ణ, సిరికొండ తోట రాజన్న తదితరులు ఉద్యమంలో చురుకుగా పాల్గొన్నారని గుర్తుచేశారు. అలాగే



ఆర్మూర్ మాజీ ఎమ్మెల్యే జీవన్ రెడ్డి, వేముల ప్రశాంత్ రెడ్డి వంటి నాయకులు సైతం తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర పోషించారని పేర్కొన్నారు.తెలంగాణ కోసం ఎన్నో త్యాగాలు చేసిన ఉద్యమకారులను పక్కనపెట్టి, ప్రస్తుతం కొందరు తామే ఉద్యమం చేశామంటూ ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని కాంగ్రెస్ ప్రభుత్వంపై బాజిరెడ్డి గోవర్ధన్ విమర్శలు చేశారు. ప్రజా సమస్యలపై పోరాటం కొనసాగిస్తూ, కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్తామని తెలిపారు. భవిష్యత్తులో జరిగే పోరాటాల్లోనూ ఉద్యమకారులకు పార్టీ అండగా ఉంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

### బాల్కొండ ప్రభుత్వ డిగ్రీ
## కళాశాలలో ఘనంగా బతుకమ్మ సంబరాలు

● తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకోవాలి: ప్రిన్సిపాల్ డాక్టర్ వేణుగోపాల స్వామి



ప్రజాజ్యోతి, బాల్కొండ, అక్టోబర్ 9: తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ వేడుకలను బాల్కొండ మండల కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రాంగణంలో విద్యార్థినులు, మహిళా అధ్యాపకులు సంప్రదాయ వస్త్రధారణలో పాల్గొని, వివిధ రకాల రంగురంగుల పూలతో బతుకమ్మలను అందంగా అలంకరించారు. ఈ వేడుకలకు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ టి. వేణుగోపాల స్వామి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బతుకమ్మ పండుగ తెలంగాణ అస్తిత్వానికి, ప్రకృతి ఆరాధనకు ప్రతీకగా నిలుస్తుందని పేర్కొన్నారు. విద్యార్థులు విద్యాభ్యాసంతో పాటు మన సంస్కృతి, సంప్రదాయాలను గౌరవించాలని, వాటి పరిరక్షణకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం కళాశాల ప్రాంగణంలో పూలతో అలంకరించిన బతుకమ్మల చుట్టూ విద్యార్థినులు, మహిళా అధ్యాపకులు సంప్రదాయ బతుకమ్మ పాటలు పాడుతూ, చప్పట్లు కొడుతూ ఉత్సాహంగా నృత్యాలు చేశారు. బతుకమ్మ ఆటపాటలతో కళాశాల ప్రాంగణమంతా పండుగ శోభను సంతరించుకుంది. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థినులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని బతుకమ్మ సంబరాలను ఉత్సాహంగా నిర్వహించారు.

## ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బతుకమ్మ సంబరాలు



ప్రజా జ్యోతి, లింగంపేట్ అక్టోబర్ 9 లింగంపేట మండలంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బతుకమ్మ సంబరాలు ఘనంగా నిర్వహించారు, విద్యార్థినిలు ఉత్సాహంగా పాల్గొని తెలంగాణ సంస్కృతి సాంప్రదాయాలను చాటిచెప్పారు విద్యార్థులతో అధ్యాపకులు మరియు అధ్యాపకురాలు శ్రీలత, అంజమ్మ, సంధ్యారాణి, బతుకమ్మను పేర్చారు, బతుకమ్మ పండుగ ప్రాముఖ్యతను కళాశాల ప్రిన్సిపల్ నరేందర్ విద్యార్థిని విద్యార్థులకు,అధ్యాపకులకు వివరించారు.

## దివ్యాంగుడికి బ్యాటరీ వాహనం అందజేత



కామారెడ్డి జిల్లా ప్రతినిధి అక్టోబర్ 09(ప్రజా జ్యోతి) కామారెడ్డి జిల్లా ప్రజావాణిలో దివ్యాంగుడి విజ్ఞప్తికి స్పందించి బ్యాటరీ వాహనం అందజేత ప్రజావాణి కార్యక్రమంలో బిచ్కుంద మండలానికి చెందిన దివ్యాంగుడు గండ మల్లా గంగాధర్, చేసిన విజ్ఞప్తికి స్పందించిన జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్, శుక్రవారం కలెక్టరేట్‌లోని తన ఛాంబర్ సమీపంలో ఆయనకు బ్యాటరీ విల్ చైర్ అందజేశారు.ప్రజావాణికి వచ్చిన దివ్యాంగుడు తన ఇబ్బందులను జిల్లా కలెక్టర్‌కు వివరించి, తన రోజువారీ అవసరాలకు, జీవనోపాధికి ఉపయోగపడేలా బ్యాటరీ వాహనం అందించాలని



కోరారు. ఆయన పరిస్థితిని సానుకూలంగా పరిశీలించిన జిల్లా కలెక్టర్, మరుసటి రోజు కలెక్టరేట్‌కు పిలిపించి బ్యాటరీ వాహనాన్ని అందజేశారు. ప్రజల సమస్యలను సానుభూతితో అర్థం చేసుకుని, అర్హులైన వారికి అవసరమైన సహాయం అందించేందుకు జిల్లా యంత్రాంగం కృషి చేస్తోందని ఈ సందర్భంగా తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) విక్టర్, అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) ఎన్.వై. గిరి డి డబ్ల్యుఓ వెంకటేష్, పాల్గొన్నారు.

## శ్రీ సరస్వతీ విద్యామందిర్‌లో బతుకమ్మ సంబరాలు



కామారెడ్డి టౌన్ అక్టోబర్ 09 (ప్రజా జ్యోతి) శ్రీ సరస్వతీ విద్యామందిర్ హైస్కూల్‌లో బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించారు. విద్యార్థినులు, మాతాజీలు రంగురంగుల పూలతో బతుకమ్మలను పేర్చి, సంప్రదాయ దుస్తుల్లో బతుకమ్మ పాటలు పాడుతూ సందడి చేశారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానాచార్యులు నల్ల నాగభూషణం మాట్లాడుతూ..! బతుకమ్మ పండుగ



తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక అని, ప్రకృతిని పూజించే ఈ పండుగ విశిష్టతను ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలని అన్నారు. సంస్కృతి, సంప్రదాయాలను భావితరాలకు అందించాలని సూచించారు. కార్యక్రమంలో అకాడమిక్ ప్రిన్సిపల్ నాగేష్,ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు రవీనా ఎంపిక

● అద్భుత ప్రతిభతో అండర్–20 బాలికల విభాగంలో సత్తా చాటిన బాలిక



ప్రజాజ్యోతి,ఏర్గట్ల: అండర్–20 బాలికల కబడ్డీ విభాగంలో రేండ్ల రవీనా అద్భుత ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైంది. మూడు రోజులుగా ముప్కల్ అకాడమీలో నిర్వహించిన శిక్షణ శిబిరంలో తన క్రీడా నైపుణ్యాన్ని ప్రదర్శించి రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొనేందుకు అర్హత సాధించింది. ఈ నెల 10వ తేదీ నుంచి 13వ తేదీ వరకు ఖమ్మం జిల్లా అశ్వారావుపేటలో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి అండర్–20 బాలికల కబడ్డీ పోటీల్లో రవీనా పాల్గొననుంది. ఇప్పటికే పాఠశాల స్థాయిలో రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీల్లో పాల్గొన్న ఆమె, మరోసారి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక కావడం విశేషం. రవీనా సాధించిన ఈ విజయంపై ఆమె తల్లిదండ్రులతో పాటు గ్రామ సర్పంచ్ , ఉపసర్పంచ్ , గ్రామ ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. రవీనాను అభినందిస్తూ రాష్ట్రస్థాయి పోటీల్లోనూ ప్రతిభ కనబరిచి గ్రామానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.

## చిరుత దాడిలో లేక దూడ మృతి



ప్రజాజ్యోతి లింగంపేట్ అక్టోబర్ 9 లింగంపేట మండలంలోని మోతే గ్రామము శివారులో నీ వ్యవసాయ పంట చేను వద్ద కట్టేసి ఉంచిన లేగ దూడను శుక్రవారం తెల్లవారుజామున చిరుత దాడిలో లేగ దూడ మృతి చెందింది అని గొల్ల ప్రభాకర్ అనే రైతు అటవీ శాఖ అధికారులకు తెలియజేశాడు, బాధిత రైతు నష్టపరిహారం కోరగా అధికారులు ఈ అంశంపై పైన అధికారులకు నివేదిక పంపుతామని ఫారెస్ట్ అధికారులు తెలిపారు.



### వట్‌పల్లి మండలంలో
## విద్యుత్ కోతలపై రైతులకు మద్దతుగా ధర్నా





వట్టిపల్లి అక్టోబర్ 9 ప్రజా జ్యోతి సంగారెడ్డి జిల్లా వట్‌పల్లి మండలం పాల్వట్ల గ్రామంలో విద్యుత్ కోతలను నిరసిస్తూ రైతులకు మద్దతుగా అందోల్ మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతి కిరణ్ గారు రోడ్డుపై నిర్వహించిన ధర్నాలో పాల్గొన్నారు. రైతులకు ఎదురవుతున్న విద్యుత్ సమస్యలను పరిష్కరించాలని ఈ సందర్భంగా నిరసన చేపట్టారు. ఏ ఈ వినతి పత్రం ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో రైతులతో పాటు మండల బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు వీరారెడ్డి సొసైటీ చైర్మన్ వినోద్ గౌడ్ బసవరాజు మధు అశోక్, సదానందం ప్రభాకర్ సుభాష్ కార్యకర్తలు రైతులు పాల్గొన్నారు.

## జహీరాబాద్‌లో నూతన జివి షాపింగ్ మాల్‌ను ప్రారంభించిన శాసనసభ్యులు కొనింటి మాణిక్ రావు



జహీరాబాద్, అక్టోబర్ 09 ( ప్రజా జ్యోతి న్యూస్ ) నియోజకవర్గ జహీరాబాద్ పట్టణంలో నూతనంగా ఏర్పాటు చేసిన జి వి షాపింగ్ మాల్‌ను ప్రారంభించిన శాసన సభ్యులు కొనింటి మాణిక్ రావు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాణిక్ రావు మాట్లాడుతూ.. వ్యాపార రంగంలో నూతనంగా అడుగు పెడుతున్న వ్యాపారవేత్తలకు శుభాకాంక్షలు తెలియజేస్తూ, వ్యాపార సంస్థల అభివృద్ధితో స్థానికంగా ఉపాధి అవకాశాలు పెరగడంతో పాటు పట్టణ ఆర్థికాభివృద్ధికి దోహదపడుతుందని అన్నారు. ప్రజలకు నాణ్యమైన వస్తువులను అందిస్తూ, వినియోగదారుల నమ్మకాన్ని పొందుతూ జి వి షాపింగ్ మాల్ మరింత అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మాజి మార్కెట్ చైర్మన్ గుండప్ప, మొగుడం పల్లి మండల పార్టీ అధ్యక్షులు సంజీవ్ రెడ్డి, కోహీర్ మండల పార్టీ అధ్యక్షులు నర్సింలు, ఝరసంఘం మండల పార్టీ అధ్యక్షులు వెంకటేశం, కౌన్సిలర్ లు యాకూబ్, అబ్దుల్లా, జాకీర్, గౌస్ గోరి, మహిపాల్ యాదవ్, విశ్వేశ్వర్, ప్రవీణ్, శంకర్ రెడ్డి, పాండు, జాహెద్, రాజు, గ్రామాల సర్పంచ్ లు ముఖ్య నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.






## ప్రజావాణి ఫిర్యాదులపై అధికారుల నిర్లక్ష్యం ఎందుకు?

● బెల్టు షాపులపై ఫిర్యాదు చేసినా చర్యలు శూన్యం.. ఉదయమే గ్రామాలకు మద్యం సరఫరా
● ప్రజల సమస్యలను పట్టించుకోరా? బీఎస్పీ నేత పీపాడ్‌పల్లి మోహన్ ఆగ్రహం



రాయికోడ్ అక్టోబర్ 09 (ప్రజాజ్యోతి): ప్రజల సమస్యల పరిష్కారం కోసం నిర్వహిస్తున్న ప్రజావాణిలో ఫిర్యాదు చేసినప్పటికీ అధికారులు పట్టించుకోవడం లేదని బీఎస్పీ నేత పీపాడ్‌పల్లి మోహన్ ఆగ్రహం వ్యక్తం చేశారు. రాయికోడ్ మండల పరిధిలో బెల్టు షాపుల ద్వారా అక్రమంగా మద్యం విక్రయాలు జరుగుతున్నాయంటూ ఫిర్యాదు చేసినా సంబంధిత అధికారులు స్పందించకపోవడం ఏమిటని ఆయన ప్రశ్నించారు. ప్రజావాణిలో మండల ప్రజలు తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్తున్నప్పటికీ వాటిని పరిష్కరించడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారని విమర్శించారు.

**ఫిర్యాదు ఎక్సైజ్ శాఖకు పంపినా స్పందనేదీ?**

రాయికోడ్ మండలంలోని పలు గ్రామాల్లో బెల్టు షాపుల ద్వారా అనధికారికంగా మద్యం విక్రయాలు జరుగుతున్నాయనే ఆరోపణల నేపథ్యంలో ఫిర్యాదుదారుడు ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదుకు గ్రీవెన్స్ ఐడీ కేటాయించడంతోపాటు, విచారణ, పరిష్కారం కోసం ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ కార్యాలయానికి పంపినట్లు ప్రజావాణి రశీదులో పేర్కొన్నారు. అయితే ఫిర్యాదు చేసి రోజులు గడుస్తున్నా అధికారులు ఎలాంటి చర్యలు తీసుకున్నారనే దానిపై స్పష్టత లేదని ఫిర్యాదుదారుడు ఆరోపిస్తున్నారు. ఈ అంశంపై స్పందించిన బీఎస్పీ నేత పీపాడ్‌పల్లి మోహన్ మాట్లాడుతూ.. ప్రజలు తమ సమస్యలను పరిష్కరించుకోవాలనే ఉద్దేశంతో ప్రజావాణిని ఆశ్రయిస్తారని,అలాంటి ఫిర్యాదులనే అధికారులు పట్టించుకోకపోతే ప్రజలు తమ సమస్యలను ఎవరికి చెప్పుకోవాలని ప్రశ్నించారు. ఫిర్యాదులను సంబంధిత శాఖలకు బదిలీ చేయడంతోనే బాధ్యత పూర్తయినట్లు భావించకూడదని,వాటిపై విచారణ జరిపి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

**ఉదయమే గ్రామాలకు మద్యం సరఫరా చేస్తున్నారనే ఆరోపణలు**

రాయికోడ్ మండల పరిధిలోని కొన్ని వైన్స్ షాపుల నుంచి ఉదయమే మద్యం సీసాలను వాహనాల్లో వివిధ గ్రామాలకు తరలించి సరఫరా చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయని మోహన్ తెలిపారు. వైన్స్ షాపుల నిర్వాహకులు నిబంధనలకు విరుద్ధంగా మద్యం తరలిస్తున్నారో లేదో ఎక్సైజ్ అధికారులు సమగ్రంగా విచారణ చేపట్టాలని కోరారు. ఆరోపణలు నిజమని తేలితే సంబంధిత వైన్స్ నిర్వాహకులపై నిబంధనల ప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

**మండల ప్రజల సమస్యలపై నిర్లక్ష్యమెందుకు?**

ప్రజావాణిలో మండల ప్రజలు సమర్పిస్తున్న ఫిర్యాదులను అధికారులు సీరియస్‌గా తీసుకోవడం లేదని మోహన్ విమర్శించారు. ప్రజలు కార్యాలయాల చుట్టూ తిరిగి తమ సమస్యలను విన్నవించినప్పటికీ పరిష్కారం లభించకపోతే ప్రభుత్వ యంత్రాంగంపై నమ్మకం ఎలా ఏర్పడుతుందని ప్రశ్నించారు. ప్రజావాణి కార్యక్రమం కేవలం ఫిర్యాదులు స్వీకరించడానికి, వాటిని ఇతర శాఖలకు పంపడానికి మాత్రమే పరిమితం కాకూడదని, ప్రతి ఫిర్యాదుపై బాధ్యతాయుతంగా స్పందించి పరిష్కారానికి కృషి చేయాలని అన్నారు.

**బెల్టు షాపులపై క్షేత్రస్థాయిలో తనిఖీలు చేపట్టాలి**

రాయికోడ్ మండల పరిధిలో బెల్టు షాపులు ఉన్నాయనే ఆరోపణలపై ఎక్సైజ్ అధికారులు క్షేత్రస్థాయిలో తనిఖీలు నిర్వహించి వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాలని మోహన్ కోరారు. అనధికారికంగా మద్యం విక్రయాలు జరుగుతున్నట్లు విచారణలో తేలితే నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఉదయమే వైన్స్ షాపుల నుంచి గ్రామాలకు మద్యం సీసాలను వాహనాల్లో తరలిస్తున్నారనే ఆరోపణలపైనా ప్రత్యేకంగా దర్యాప్తు చేయాలని కోరారు.

**ఉన్నతాధికారులు స్పందించాలి**

ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదుల పరిష్కారంపై జిల్లా స్థాయి ఉన్నతాధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని మోహన్ విజ్ఞప్తి చేశారు.రాయికోడ్ మండల ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి,వాటి పరిష్కారానికి సంబంధిత శాఖల అధికారులు చొరవ చూపాలని అన్నారు.ప్రజల ఫిర్యాదులను నిర్లక్ష్యం చేయకుండా సకాలంలో విచారణ జరిపి,తీసుకున్న చర్యలను ఫిర్యాదుదారులకు తెలియజేయాలని ఆయన డిమాండ్ చేశారు.

## భీమ్! జై తెలంగాణ! జై బహుజన !జై భారత రాజ్యాంగం జై భీమ్ ఆర్మీ!



జహీరాబాద్, అక్టోబర్ 09 ( ప్రజా జ్యోతి న్యూస్ ) సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ నియోజకవర్గంలో మహనీయులు మాన్యవర్ కాన్షీరామ్ గారి 20వ వర్ధంతి సందర్భంగా భీమ్ ఆర్మీ జహీరాబాద్ పట్టణ అధ్యక్షులు మహమ్మద్ అలీమ్ ఆధ్వర్యంలో కాన్షీరామ్ గారికి ఘన నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా తెలంగాణ రాష్ట్ర భీమ్ ఆర్మీ (భారత్ ఏక్తా మిషన్) అధ్యక్షులు సిద్దు రావణ్ మాట్లాడుతూ... బహుజనుల చైతన్యానికి బాటలు వేసిన మహనీయు డని, సామాజిక మార్పుకు స్ఫూర్తి ప్రదాత అని అధికారం లేని సమాజానికి ఆత్మగౌరవం, సమానత్వం సాధించడం కష్టసాధ్యమని రాజకీయ చైతన్య సందేశాన్ని బహుజనులలో విస్తరించిన దర్శనీకుడు. అంబేద్కర్ గారి ఆశయాలను ప్రజల్లోకి తీసుకెళ్లి బహుజన సమాజంలో హక్కుల పట్ల అవగాహన పెంపొందించి కుల వివక్షతకు వ్యతిరేకంగా అణగారిన వర్గాల హక్కుల కోసం సమాన అవకాశాల సాధన కోసం నిరంతరం కృషి చేసిన పోరాట యోధుడని తెలియజేశారు. కాన్షి రామ్ గారు మన మధ్య భౌతికంగా లేకపోయినా ఆయన నాటిన బహుజన చైతన్య బీజాలు తరతరా లకు స్ఫూర్తినిస్తూనే ఉంటాయన్నారు. కాన్షీరామ్ గారి ఆశయాల సాధనే మన నిజమైన నివాళి .బహుజన ఐక్యత, సామాజిక న్యాయం, రాజ్యాంగ విలువల పరిరక్షణే భీమ్ ఆర్మీ ముందున్న కర్తవ్యం అని అన్నారు. ఈ కార్యక్రమంలో సుభాష్ బుద్దిస్ట్ సొసైటీ ఆఫ్ ఇండియా ధనరాజ్ బాల్రాజ్ విజయ్ కుమార్, అనంతరం ,రాకేష్ మామయ్య, నరసింహులు ముదిరాజ్ ,ప్రేమ్ కుమార్, పండరి, రాచన్న చంద్రయ్య, బలరాం, గోపాల్, గౌతమ్ కృష్ణ, జైపాల్, రామ్ చందర్, తదితరులు పాల్గొన్నారు.



# ప్రగతి పరుగుకు పదేళ్లు

● సిద్దిపేటకు యూనివర్సిటీ తీసుకొస్తాం

● జిల్లా కలను నిజం చేసిన కేసీఆర్ – మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీష్ రావు




సిద్ధిపేట,అక్టోబర్ 09 ,(ప్రజాజ్యోతి): సిద్దిపేట జిల్లా ఆవిర్భావంతో అభివృద్ధి కొత్త పుంతలు తొక్కిందని, విద్య, వైద్యం, క్రీడలు, మౌలిక వసతుల రంగాల్లో గణనీయమైన పురోగతి సాధించిందని మాజీ మంత్రి, బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్ రావు అన్నారు. సిద్దిపేట జిల్లా ఏర్పడి పదేళ్లు పూర్తవుతున్న సందర్భంగా నిర్వహిస్తున్న దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా గురువారం ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో నిర్వహించిన 10కే రన్‌ను హరీశ్ రావు



ప్రారంభించారు. ఈ పరుగులో వేలాది మంది యువత, విద్యార్థులు, క్రీడాకారులు, వివిధ వర్గాల ప్రజలు పాల్గొని ఉత్సాహాన్ని చాటారు. హరీశ్ రావు కూడా వారితో కలిసి పరుగెత్తారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సిద్దిపేటను ప్రత్యేక జిల్లాగా ఏర్పాటు చేయాలన్నది దశాబ్దాలుగా ప్రజల మనసుల్లో నాటుకుపోయిన ఆకాంక్ష అని గుర్తుచేశారు. ఎన్నికల సమయంలో జిల్లా ఏర్పాటు హామీలు, గోడలపై నినాదాలు ఎన్నో సంవత్సరాల పాటు కనిపించేవని, 2016 అక్టోబర్ 11న ఆ కల సాకారమైందని తెలిపారు. జిల్లా ఆవిర్భావానికి పదేళ్లు పూర్తవుతున్న వేళ ప్రజల భాగస్వామ్యంతో దశాబ్ది ఉత్సవాలు నిర్వహించడం సంతోషకరమన్నారు. 1983లో అప్పటి ముఖ్యమంత్రి ఎన్టీ రామారావు సిద్దిపేట పర్యటనకు వచ్చిన సమయంలో కేసీఆర్ అంబేద్కర్ విగ్రహం వద్ద జిల్లా ఏర్పాటు కోరుతూ వినతిపత్రం సమర్పించారని తెలిపారు. అనంతరం తెలంగాణ తొలి ముఖ్యమంత్రిగా కేసీఆర్ బాధ్యతలు చేపట్టినప్పుడు సిద్దిపేట జిల్లాను ఏర్పాటు చేసి దశాబ్దాల ప్రజల ఆకాంక్షను నెరవేర్చారన్నారు. జిల్లా ఏర్పాటుకు ముందు అనేక ప్రభుత్వ అవసరాల కోసం ప్రజలు ఇతర ప్రాంతాలకు వెళ్లాల్సి వచ్చేదని, ఉద్యోగ నియామక పరీక్షలు, క్రీడా పరీక్షల్లో పాల్గొనడానికి కూడా దూర ప్రాంతాలకు ప్రయాణించాల్సి వచ్చేదని తెలిపారు. ప్రస్తుతం జిల్లా కేంద్రంలోనే అనేక ప్రభుత్వ సేవలు, పరీక్షల నిర్వహణకు అవకాశాలు ఏర్పడ్డాయని వివరించారు. కలెక్టరేట్, పోలీస్ కమిషనరేట్, వివిధ ప్రభుత్వ కార్యాలయాలు, క్రీడా మైదానాల ఏర్పాటుతో సిద్దిపేట ప్రాధాన్యత మరింత పెరిగిందన్నారు. సిద్దిపేట జిల్లా ఏర్పాటు, రైలు మార్గం, గోదావరి జలాల సాధన ప్రజల చిరకాల స్వప్నాలని, ఈ మూడు ఆకాంక్షలు నెరవేరడం ప్రాంత అభివృద్ధిలో కీలక మలుపుగా నిలిచిందన్నారు. రంగనాయకసాగర్‌లో గోదావరి జలాలు, సిద్దిపేటకు రైలు రాక, జిల్లా కేంద్రంగా పరిపాలనా వ్యవస్థ ఏర్పాటు ఈ మార్పులకు నిదర్శనమన్నారు. విద్యారంగంలో సిద్దిపేట ఇప్పటికే ప్రత్యేక గుర్తింపు సాధించిందన్నారు. మెడికల్, నర్సింగ్, ఫార్మసీ, పాలిటెక్నిక్, పీజీ, మహిళా డిగ్రీ, మేనేజ్‌మెంట్ తదితర విద్యాసంస్థలతో విద్యా కేంద్రంగా ఎదిగిందని తెలిపారు. ఈ ప్రగతిని మరింత ముందుకు తీసుకెళ్లేందుకు సిద్దిపేటలో విశ్వవిద్యాలయం ఏర్పాటు చేయాలనే లక్ష్యంతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. పదేళ్ల అభివృద్ధిని సమీక్షించుకోవడంతో పాటు రాబోయే పదేళ్లలో సిద్దిపేటను ఏ స్థాయికి తీసుకెళ్లాలనే దానిపై స్పష్టమైన లక్ష్యాలను నిర్దేశించుకోవాలని సూచించారు. నేటి 10కే రన్ కేవలం క్రీడా కార్యక్రమం మాత్రమే కాకుండా, ఆరోగ్యకరమైన జీవనశైలి, యువతలో పట్టుదల, జిల్లా అభివృద్ధిపై సమష్టి సంకల్పానికి ప్రతీకగా నిలవాలని ఆకాంక్షించారు. సిద్దిపేటను మరింత అభివృద్ధి చెందిన ప్రాంతంగా తీర్చిదిద్దేందుకు ప్రజలు, యువత కలిసి పనిచేయాలని, భవిష్యత్ తరాలకు మెరుగైన విద్యా అవకాశాలు, సదుపాయాలు అందించే దిశగా అడుగులు వేయాలని పిలుపునిచ్చారు.

## రైతుల పొలాలకు

# 24 గంటల ఉచిత విద్యుత్ అందించాలి

● రైతు సమస్యలను పరిష్కరించాలి ● బీఆర్ఎస్ ఆధ్వర్యంలో భారీ రైతు ధర్నా

● రోడ్డుపైన భారీగా నిలిచిపోయిన వాహనాలు ● ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి

దుబ్బాక ప్రతినిధి అక్టోబర్ 09 (ప్రజా జ్యోతి) రైతులకు విద్యుత్ కోతల నుంచి తక్షణమే ఉపశమనం కల్పించి సాగునీరు,ఉచిత విద్యుత్ అందించడంలో ప్రభుత్వ నిర్లక్ష్యం విడనాడాలని దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి అన్నారు. దుబ్బాక నియోజకవర్గ వ్యాప్తంగా రైతులు ఎదుర్కొంటున్న తీవ్ర విద్యుత్ కోతలను నిరసిస్తూ, వ్యవసాయానికి నిరంతరాయంగా 24 గంటల నాణ్యమైన ఉచిత విద్యుత్ అందించాలని డిమాండ్







చేస్తూ దుబ్బాక ఎమ్మెల్యే శ్రీ కొత్త ప్రభాకర్ రెడ్డి ఎస్సీ ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య ఆధ్వర్యంలో అక్బర్‌పేట--భూంపల్లి చౌరస్తాలో బీఆర్ఎస్ పార్టీ భారీ రైతు ధర్నా నిర్వహించారు. రైతుల పంటలను కాపాడాలని, వ్యవసాయానికి అవసరమైన విద్యుత్ సరఫరాను తక్షణమే పునరుద్ధరించాలని ఈ సందర్భంగా నాయకులు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ..నియోజకవర్గంలో విద్యుత్ కోతల కారణంగా రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. పంటలకు కీలకమైన సమయంలో విద్యుత్ సరఫరా సక్రమంగా లేకపోవడంతో సాగునీరు అందక పంటలు దెబ్బతినే పరిస్థితి నెలకొందని, రాత్రివేళల్లో కూడా విద్యుత్ కోసం రైతులు పొలాల వద్ద పడిగాపులు కాయాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కేసీఆర్ గారి నాయకత్వంలో వ్యవసాయానికి 24 గంటల ఉచిత విద్యుత్ అందించామని, ప్రస్తుతం రైతులు ఎదుర్కొంటున్న విద్యుత్ సమస్యలు ప్రభుత్వ పనితీరుపై ప్రశ్నలు లేవనెత్తుతున్నాయని అన్నారు. వ్యవసాయానికి నిరంతర విద్యుత్ అందిస్తామని హామీ ఇచ్చిన ప్రభుత్వం, క్షేత్రస్థాయిలో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై తక్షణమే దృష్టి సారించాలని డిమాండ్ చేశారు. విద్యుత్ సరఫరాలో అంతరాయాల వల్ల వ్యవసాయ మోటార్లు, విద్యుత్ పరికరాలు దెబ్బతింటున్నాయని, రైతులకు అదనపు ఆర్థిక భారం పడుతోందని పేర్కొన్నారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి వ్యవసాయానికి నిరంతరాయంగా నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయడంతో పాటు సాగునీటి సమస్యలను పరిష్కరించి రైతుల పంటలను కాపాడాలని డిమాండ్ చేశారు. రైతుల సమస్యలను పరిష్కరించే వరకు బీఆర్ఎస్ పార్టీ రైతాంగానికి అండగా నిలుస్తుందని, అవసరమైతే రైతుల హక్కుల పరిరక్షణ కోసం పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి స్పష్టం చేశారు. ఈ ధర్నా కార్యక్రమంలో బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు, మండల నాయకులు, సర్పంచులు, పార్టీ శ్రేణులు, రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొని వ్యవసాయానికి 24 గంటల ఉచిత విద్యుత్ అందించాలని నినాదాలు చేశారు

# అంగన్వాడి కేంద్రంలో బతుకమ్మ సంబరాలు

● 20 వ వార్డు కౌన్సిలర్ ఐరన్ అఖిల సాయి తేజ గౌడ్

దుబ్బాక అక్టోబర్ 09 (ప్రజా జ్యోతి) బతుకమ్మ పండుగ తెలంగాణ సంస్కృతి సాంప్రదాయాలకు



ప్రత్యేక కానీ మహిళల ఆజ్ఞతకు ప్రకృతి పట్ల ప్రేమకు నిదర్శన మని 20వ వార్డు కౌన్సిలర్ ఐరేని అఖిల – సాయి తేజ గౌడ్ అన్నారు. శుక్రవారం రోజున 20వ వార్డులోని అంగన్వాడి సెంటర్ లో బతుకమ్మ సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... మా ఇల్లు చిన్నారులు సంతోషంగా పండగ జరుపుకోవడంతోపాటు బాల పరిరక్షణ కూడా అవగాహన కలిగి ఉండాలని సూచించారు.



తెలంగాణలో ఆడపడుచులకు ప్రత్యేక పండుగ బతకమ్మ పండుగ అని వారన్నారు. ఇలాంటి కార్యక్రమాలతో వల్ల రానున్న కాలంలో పిల్లలకు మరింత అవగాహన పెరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడి టీచర్ సుమతి, విద్యార్థి, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# వరిగుంతం గ్రామసభలో పంచాయతీ కార్యదర్శి బూతు పురాణం

● నన్ను అడగడానికి నీవు ఎవడివి ● ప్రశ్నించిన దండు ప్రశాంత్ తేజ పై బూతులతో దూషణ

కొల్చారం,అక్టోబర్ 09( ప్రజాజ్యోతి) కొల్చారం మండలంలోని వరిగుంతం గ్రామంలో గ్రామసభలో పంచాయతీ నిధుల దుర్వినియోగం అవినీతి అక్రమాలపై ప్రశ్నించిన దండు ప్రశాంత్ తేజ యువకుడి పై పంచాయతీ కార్యదర్శి బూతులు తిడుతూ.. ఎదురుదాడికి దిగిన సంఘటన శుక్రవారం వరిగుంతం గ్రామ పంచాయతీ ఆవరణలో జరిగిన గ్రామసభలో జరిగింది. శుక్రవారం సర్పంచ్ మోహన్ అధ్యక్షతన వరిగుంతం గ్రామపంచాయతీ గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్యదర్శి శ్రీదేవి నూతన పంచాయతీ పాలకవర్గం బాధ్యతలు చేపట్టిన నుండి ఇప్పటివరకు గ్రామపంచాయతీకి వచ్చిన నిధులు, ఖర్చుల వివరాలను చదివి వినిపించారు. ఈ సందర్భంగా గ్రామపంచాయతీ రక్షిత మంచినీటి మీ సరఫరా చేసే మూడు మోటార్ల స్టార్టర్ల మరమ్మతులకురూ.36 వేల రూపాయలు ఖర్చు చేయడం, పైప్లైన్ లీకేజీలకు రూ.40,000 ఖర్చు చేయడం పది త్రిప్పుల మట్టి రోడ్డుపై రెండు స్థలాలను వేసి రూ.1,33,000 రూపాయలు ఎంబి రికార్డు చేయడం ద్వారా డ్రా చేయడం పై గ్రామానికి చెందిన యువకులు పంచాయతీ కార్యదర్శి సర్పంచులను



నిలదీశారు. గ్రామపంచాయతీ కార్యదర్శి రూ. రెండు లక్షల ఇరవై వేలు తాను ఖర్చు చేసినట్లు ఎంబిలో రికార్డు చేయగా రూ.మూడు లక్షల అరవై వేల రూపాయలు తన తల్లి సరస్వతి అకౌంట్లోకి ఎలా మళ్ళించారని యువకులు పంచాయతీ కార్యదర్శి పై ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో పంచాయతీ కార్యదర్శి శ్రీదేవి తన అవినీతి అక్రమాలప్రశ్నించినదండు ప్రశాంత్ తేజ యువకుడిని బూతులు తిడుతూ నీవు ఎవ్వడిని నన్ను అడగడానికి అంటూ ఎదురు దాడికి దిగారు. దీంతో గ్రామసభ రచ్చ రచ్చగా మారింది. పంచాయతీ పాలకవర్గం 9 నెలల కాలం లో సుమారు రూ.13 లక్షల నిధుల వినియోగంలో అవకతవకలు జరిగాయంటూ గ్రామస్తులు ప్రశ్నించడంతో సర్పంచ్ మోహన్, పంచాయతీ కార్యదర్శి శ్రీదేవితో వాగ్వాదం జరిగింది. గ్రామాభివృద్ధి కోసం ఖర్చు చేసిన నిధులకు సంబంధించిన బిల్లులపై అనుమానాలు వ్యక్తం చేస్తూ గ్రామస్తులు నిలదీయడం చర్చనీయాంశంగా మారింది.

**- విచారణతోనే నిజా నిజాలు వెలుగులోకి..**

గ్రామపంచాయతీ నిధుల ఖర్చులపై వస్తున్న ఆరోపణలు స్థానికంగా చర్చకు దారితీశాయి. అయితే ఈ ఆరోపణలపై సంబంధిత అధికారులు అధికారికంగా స్పందించాల్సి ఉంది. ఆరోపణల్లో వాస్తవమెంత, నిధుల వినియోగంలో నిబంధనలు పాటించారా లేదా అన్నది సమగ్ర విచారణలో తేలాల్సి ఉంది. ప్రజాధనం దుర్వినియోగం కాకుండా చూడటంతో పాటు, ప్రతి రూపాయికి లెక్క చెప్పేలా సంబంధిత యంత్రాంగం చర్యలు చేపట్టాలని వరిగుంతం గ్రామస్తులు కోరుతున్నారు.

# గ్రామసభలో పంచాయతీ కార్యదర్శి బూతు పురాణం..

● నన్ను అడగడానికి నీవు ఎవడివి. ప్రశ్నించిన యువకునిపై బూతులతో దూషణ.

● వరిగుంతం గ్రామపంచాయతీలో రూ.13 లక్షల నిధులపై దుమారం!

● బిల్లులపై అనుమానాలు.. ఉన్నతస్థాయి విచారణతో నిజాలు నిగ్గు తేల్చాలని డిమాండ్

కొల్చారం, అక్టోబర్ 09 (ప్రజా జ్యోతి) గ్రామసభలో పంచాయతీ నిధుల దుర్వినియోగం అవినీతి అక్రమాలపై ప్రశ్నించిన యువకుడి పై పంచాయతీ కార్యదర్శి బూతులు తిడుతూ ఎదురుదాడికి దిగిన సంఘటన శుక్రవారం వరిగుంతం గ్రామ పంచాయతీ ఆవరణలో జరిగిన గ్రామసభలో జరిగింది. శుక్రవారం సర్పంచ్ మోహన్ అధ్యక్షతన వరిగుంతం గ్రామపంచాయతీ గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్యదర్శి శ్రీదేవి నూతన పంచాయతీ పాలకవర్గం బాధ్యతలు చేపట్టిన నుండి ఇప్పటివరకు గ్రామపంచాయతీకి వచ్చిన నిధులు, ఖర్చుల వివరాలను చదివి వినిపించారు. ఈ సందర్భంగా గ్రామపంచాయతీ రక్షిత మంచినీటి మీ సరఫరా చేసే మూడు మోటార్ల స్టార్టర్ల మరమ్మతులకురూ.36 వేల రూపాయలు ఖర్చు చేయడం, పైప్లైన్ లీకేజీలకు రూ.40,000 ఖర్చు చేయడం పది త్రిప్పుల మట్టి రోడ్డుపై రెండు స్థలాలను వేసి రూ.1,33,000 రూపాయలు ఎంబి రికార్డు చేయడం ద్వారా డ్రా చేయడం పై గ్రామానికి చెందిన యువకులు పంచాయతీ కార్యదర్శి సర్పంచులను నిలదీశారు. గ్రామపంచాయతీ కార్యదర్శి రూ. రెండు లక్షల ఇరవై వేలు తాను ఖర్చు చేసినట్లు ఎంబిలో రికార్డు చేయగా రూ.మూడు లక్షల అరవై వేల రూపాయలు తన తల్లి సరస్వతి అకౌంట్లోకి ఎలా మళ్ళించారని యువకులు పంచాయతీ కార్యదర్శి పై ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో పంచాయతీ కార్యదర్శి శ్రీదేవి తన అవినీతి అక్రమాలపై ప్రశ్నించిన యువకులను బూతులు తిడుతూ నీవు ఎవ్వడిని నన్ను అడగడానికి అంటూ ఎదురు దాడికి దిగారు. దీంతో గ్రామసభ రచ్చ రచ్చగా మారింది. పంచాయతీ పాలకవర్గం 9 నెలల కాలం లో సుమారు రూ.13 లక్షల నిధుల వినియోగంలో అవకతవకలు జరిగాయంటూ గ్రామస్తులు ప్రశ్నించడంతో సర్పంచ్ మోహన్, పంచాయతీ కార్యదర్శి శ్రీదేవితో వాగ్వాదం జరిగింది. గ్రామాభివృద్ధి కోసం ఖర్చు చేసిన నిధులకు





సంబంధించిన బిల్లులపై అనుమానాలు వ్యక్తం చేస్తూ గ్రామస్తులు నిలదీయడం చర్చనీయాంశంగా మారింది.

**ఒకే పనికి పలుమార్లు బిల్లులు ?**

గ్రామంలో పైప్‌లైన్ లీకేజీల మరమ్మతుల పేరుతో ఒక్కోచోట పలుమార్లు పనులు చేసినట్లు చూపిస్తూ లక్ష రూపాయలకు పైగా బిల్లులు రాసినట్లు గ్రామస్తులు ఆరోపించారు. దోమల నివారణ మందు పిచికారీకి రూ.1.35 లక్షలు, అలాగే నాలుగు స్టార్టర్ డబ్బాల కొనుగోలుకు రూ.36 వేలకుపైగా బిల్లులు నమోదు చేయడంపైనా గ్రామస్తులు ప్రశ్నలు లేవనెత్తారు. చేసిన పనులు, కొనుగోలు చేసిన సామగ్రి, వాటి వాస్తవ ధరలు, చెల్లించిన బిల్లుల మధ్య వ్యత్యాసాలు ఉన్నాయి అని గ్రామానికి చెందిన యువకులు పంచాయతీ కార్యదర్శి సర్పంచ్ల పై ఆగ్రహం వ్యక్తం చేశారు. తక్కువ ధరకు విద్యుత్తు దీపాలు తీసుకువచ్చి ఎంబి రికార్డు ఎక్కువ ధరకు ఎలా చేస్తారంటూ నిలదీశారు. వాస్తవ బిల్లుల ఆధారంగానే ఎంబి రికార్డు చేయాల్సి ఉండగా ఎక్కువ ధరకు ఎలా చేశారని ప్రశ్నించారు.

**ప్రజాధనానికి లెక్క చెప్పాల్సిందే!**

గ్రామపంచాయతీ నిధులు ప్రజల సొమ్మని, వాటి ఖర్చుల విషయంలో పారదర్శకత తప్పనిసరని గ్రామస్తులు స్పష్టం చేశారు. కాగితాలపై పనులు చూపించి బిల్లులు పొందారా? ఒకే పనికి పలుమార్లు నిధులు ఖర్చు చేసినట్లు నమోదు చేశారా? కొనుగోళ్లకు సంబంధించిన వాస్తవ బిల్లులు వాస్తవ పరిస్థితులకు అనుగుణంగా ఉన్నాయా? అనే ప్రశ్నలకు అధికారులు సమాధానం చెప్పాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. ఈ వ్యవహారంపై ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి, పంచాయతీ ఖర్చుల రికార్డులు, వర్క్ బిల్లులు, వోచర్లు, కొనుగోలు వివరాలను క్షుణ్ణంగా పరిశీలించాలని గ్రామస్తులు కోరుతున్నారు. అవసరమైతే ప్రత్యేక విచారణ చేపట్టి, నిధుల వినియోగంలో అక్రమాలు జరిగినట్లు తేలితే బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

**విచారణతోనే నిజానిజాలు వెలుగులోకి!**

గ్రామపంచాయతీ నిధుల ఖర్చులపై వస్తున్న ఆరోపణలు స్థానికంగా చర్చకు దారితీశాయి. అయితే ఈ ఆరోపణలపై సంబంధిత అధికారులు అధికారికంగా స్పందించాల్సి ఉంది. ఆరోపణల్లో వాస్తవమెంత, నిధుల వినియోగంలో నిబంధనలు పాటించారా లేదా అన్నది సమగ్ర విచారణలో తేలాల్సి ఉంది. ప్రజాధనం దుర్వినియోగం కాకుండా చూడటంతో పాటు, ప్రతి రూపాయికి లెక్క చెప్పేలా సంబంధిత యంత్రాంగం చర్యలు చేపట్టాలని వరిగుంతం గ్రామస్తులు కోరుతున్నారు.

# గ్రామసభలో సర్పంచ్ మౌనం.. పెత్తనం చలాయిస్తున్నది ఆ నాయకుడేనా?

● సర్పంచ్ కేవలం బొమ్మేనా? ● గ్రామసభలో మరో నాయకుడి జోక్యంపై గ్రామస్తుల ఆగ్రహం

కొల్చారం, అక్టోబర్ 09( ప్రజా జ్యోతి):- మెదక్ జిల్లా కొల్చారం మండలంలోని వరిగుంతం గ్రామసభలో సర్పంచ్ పుట్లగళ్ల మోహన్ వ్యవహారశైలిపై గ్రామస్తులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. గ్రామ సమస్యలపై సర్పంచ్ స్పందించాల్సిన సమయంలో మరో నాయకుడు జోక్యం చేసుకుంటూ మాట్లాడటంపై పలువురు గ్రామస్తులు అభ్యంతరం వ్యక్తం చేశారు. గ్రామంలో సర్పంచ్ ఉన్నప్పటికీ, ఆయన వెనుక ఉండి మరో నాయకుడు పెత్తనం చలాయిస్తున్నారనే ఆరోపణలు గ్రామసభలో చర్చనీయాంశంగా మారాయి. గ్రామంలో ఏ పని చేయాలన్నా సదరు నాయకుడి సలహాలు తీసుకోవాల్సిన పరిస్థితి ఎందుకు ఏర్పడిందని గ్రామస్తులు ప్రశ్నిస్తున్నారు. గ్రామసభలో సర్పంచ్ మాట్లాడుతున్న సమయంలో సదరు నాయకుడు జోక్యం చేసుకుంటూ మాట్లాడటం, ఇతరులు మాట్లాడేందుకు అవకాశం ఇవ్వకపోవడం ఎంతవరకు సమంజసమని నిలదీశారు.

**సర్పంచ్ ఉండగా.. మరో నాయకుడి పెత్తనం ఎందుకు?**

గ్రామానికి సంబంధించిన సమస్యలు, అభివృద్ధి పనులపై నిర్ణయాలు తీసుకోవాల్సిన గ్రామసభలో ప్రజాప్రతినిధులు ప్రజలకు సమాధానం చెప్పాల్సి ఉంటుందని గ్రామస్తులు పేర్కొన్నారు. అయితే, సర్పంచ్ మాట్లాడుతున్న సమయంలో



సదరు నాయకుడు జోక్యం చేసుకుంటూ మాట్లాడటం, గ్రామసభలో తానే చెప్పిందే వినాలన్నట్లుగా వ్యవహరించడం సరైన పద్ధతి కాదని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రామసభలో ప్రజలు తమ సమస్యలను చెప్పుకునే స్వేచ్ఛ ఉండాలని, మధ్యలో అడ్డుకోవడం తగదని అన్నారు. సర్పంచ్ స్వతంత్రంగా వ్యవహరిస్తున్నారా? లేక మరో నాయకుడి సూచనల మేరకు పనిచేస్తున్నారా? అన్న అనుమానాలు గ్రామస్తుల్లో వ్యక్తమవుతున్నాయని తెలిపారు.

**ప్రజల సమస్యలకు సమాధానం చెప్పాల్సిన బాధ్యత ఎవరిది?**

గ్రామంలో ప్రజలకు సంబంధించిన పనులు, సమస్యల పరిష్కారంలో సర్పంచ్ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని గ్రామస్తులు డిమాండ్ చేశారు. గ్రామసభ అనేది ప్రజల అభిప్రాయాలు తెలుసుకోవడానికి, సమస్యలపై చర్చించడానికి ఏర్పాటు చేసిన వేదిక అని, అక్కడ ప్రజల గొంతును అణచివేసే ప్రయత్నం చేయకూడదని పేర్కొన్నారు. ఈ వ్యవహారంపై దండు ప్రశాంత్ తేజ, ఆకుల రాజు, మాజీ ఎంపీటీసీ తుడుము రామకృష్ణ, దండు రాజు తదితరులు అభ్యంతరం వ్యక్తం చేశారు. గ్రామసభలో ప్రజలకు మాట్లాడే అవకాశం కల్పించాలని, ప్రజా సమస్యలపై సర్పంచ్ స్పష్టమైన సమాధానాలు ఇవ్వాలని వారు కోరారు

# నిర్లక్ష్యం పునరావృతమైతే చర్యలు తప్పవు

● మున్సిపల్ కమిషనర్ మల్లిఖార్జున్

సిద్ధిపేట,అక్టోబర్ 09 ,(ప్రజాజ్యోతి):ప్రభుత్వ ఆసుపత్రిలో చెత్త నిర్వహణ సక్రమంగా లేకపోవడంపై సిద్దిపేట మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున ఆగ్రహం వ్యక్తం చేశారు. రోగులు, వారి సహాయకులు, ప్రజలు నిత్యం సందర్శించే ఆసుపత్రి ప్రాంగణంలో చెత్త పేరుకుపోవడం వల్ల అపరిశుభ్రత ఏర్పడటంతో పాటు ప్రజారోగ్యానికి ముప్పు వాటిల్లే అవకాశం ఉందన్నారు. ఆసుపత్రి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడంలో బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఆసుపత్రిలో ఉత్పత్తయ్యే చెత్తను తడి, పొడి, హానికర వ్యర్థాలుగా మూడు విభాగాలుగా వేరు చేయాలని కమిషనర్ స్పష్టం చేశారు. వేరు చేసిన చెత్తను సంబంధిత మున్సిపల్ వాహనాలకు అందించి, ప్రాంగణంలో ఎక్కడా వ్యర్థాలు పేరుకుపోకుండా ఎప్పటికప్పుడు తొలగించాలని ఆదేశించారు. పారిశుధ్య నిర్వహణలో అలసత్వం ప్రదర్శిస్తే ఉపేక్షించేది లేదని, ఇదే పరిస్థితి పునరావృతమైతే చర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం ఆసుపత్రిలో పారిశుధ్య సమస్యపై మెడికల్ కాలేజ్ సూపరింటెండెంట్ డాక్టర్ సంగీత, జిల్లా వైద్యాధికారి డాక్టర్ ధనరాజు, ఆర్ఎంవో డాక్టర్ శ్రావణి తదితర అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఆసుపత్రిలో చెత్త సేకరణ, వర్గీకరణ, తరలింపు ప్రక్రియలను పర్యవేక్షించాలని, సంబంధిత విభాగాల అధికారులు సమన్వయంతో పనిచేస్తూ పరిశుభ్రతను నిరంతరం కొనసాగించాలని సూచించారు. రోగులకు, ఆసుపత్రికి వచ్చే ప్రజలకు పరిశుభ్రమైన వాతావరణం కల్పించడమే లక్ష్యంగా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని కమిషనర్ ఆదేశించారు. పారిశుధ్య నిర్వహణలో ఎలాంటి లోపాలు తలెత్తకుండా అధికారులు నిరంతరం పర్యవేక్షణ చేపట్టాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్లు మహేష్, శివకుమార్, సంబంధిత అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



# ఈవీఎం గోడౌన్‌ను తనిఖీ చేసిన కలెక్టర్ దీపక్ తివారి

భద్రత విషయంలో అప్రమత్తంగా ఉండాలని అధికారులకు సూచన





**వికారాబాద్ ప్రతినిధి, అక్టోబర్ 9 (ప్రజా జ్యోతి) :** వికారాబాద్ జిల్లా కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో ఉన్న ఈవీఎం గోడౌన్‌ను జిల్లా కలెక్టర్ దీపక్ తివారి శుక్రవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఈవీఎంలు, బ్యాలెట్ యూనిట్లు, కంట్రోల్ యూనిట్లు, ఇతర ఎన్నికల సామాగ్రిని భద్రపరిచిన గదులను క్షుణ్ణంగా పరిశీలించారు. గోడౌన్‌లో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల పనితీరును తనిఖీ చేసి, ఈవీఎంల భద్రత విషయంలో ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు సూచించారు. భద్రతా ఏర్పాట్లతో పాటు నిర్వహణ రిజిస్టర్లను పరిశీలించి, సంబంధిత రికార్డులపై సంతకాలు చేశారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ వెంకటాచారి, ఎన్నికల విభాగం పర్యవేక్షకుడు నెమత్ హాలీ, తహసీల్దార్ లక్ష్మీనారాయణ, సంబంధిత సిబ్బంది పాల్గొన్నారు.

# దంతాల సున్నితత్వంపై అవగాహన అవసరం

పబ్లిక్ హెల్త్ డెంటిస్ట్రీ ప్రొఫెసర్ డాక్టర్ సోనియా దత్తా



**హైదరాబాద్, అక్టోబర్ 09 (ప్రజా జ్యోతి) :** ఋతు మార్పుల సమయంలో వేడి, చల్లని పానీయాల వల్ల దంతాల సున్నితత్వం పెరిగే అవకాశం ఉందని పబ్లిక్ హెల్త్ డెంటిస్ట్రీ ప్రొఫెసర్ డాక్టర్ సోనియా దత్తా(ఎండిఎస్, పిహెచ్డి) శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. దంతాల సున్నితత్వంపై డాబర్ రెడ్ టూత్‌పేస్ట్ అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయం అన్నారు. దంతాలు, చిగుళ్ల ఆరోగ్యానికి రోజువారీ నోటి సంరక్షణకు లవంగం, అల్లం వంటి ఆయుర్వేద పదార్థాలుగల ఇండియన్ డెంటల్ అసోసియేషన్(ఐడిఎ) ఆమోదం పొందిన డాబర్ రెడ్ టూత్‌పేస్ట్ ఉపయోగ పడుతుందని తెలిపారు.

# ప్రకృతిని ఆరాధించే పండుగ బతుకమ్మ

- బతుకమ్మ బతుకమ్మ ఉయ్యాలో..
- బంగారు బతకమ్మ ఉయ్యాలో..
- మహిళల ఆత్మగౌరవానికి ప్రతీక బతుకమ్మ
- షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, కేశంపేట మాజీ జడ్పిటిసి తాంద్ర విశాల శ్రవణ్ రెడ్డి లు స్పష్టం
- ఉల్లాసంగా ఉత్సాహంగా..ఆట పాటలతో స్టెప్పులేసిన కాంగ్రెస్ నాయకులు





**కొత్తూరు అక్టోబర్ 09 (ప్రజా జ్యోతి) :** దసరా పర్వదినాన్ని పురస్కరించుకొని షాద్నగర్ బుగ్గారెడ్డి గార్డెన్ లో శుక్రవారం ఎన్ ఎస్ యు ఐ, యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో జరిగిన బతుకమ్మ ఆటపాట దుమ్ము రేపింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, కేశంపేట మాజీ జెడ్పిటిసి సభ్యురాలు తాంద్ర విశాల శ్రవణ్ రెడ్డి,మున్సిపల్ చైర్మన్ అగ్గనూర్ బసవేశ్వర్, వైస్ చైర్మన్ అందె మోహన్ తదితరులు హాజరయ్యారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తెలంగాణ ఆడపడుచుల ఆత్మగౌరవానికి, ప్రకృతిని ఆరాధించే సంప్రదాయానికి బతుకమ్మ పండుగ ప్రతీకగా నిలుస్తుందని పేర్కొన్నారు. కేశంపేట మాజీ జెడ్పిటిసి సభ్యురాలు తాంద్ర విశాల శ్రవణ్ రెడ్డి మాట్లాడుతూ మన సంస్కృతి, సంప్రదాయాలను భావితరాలకు అందించడంలో బతుకమ్మ వేడుకలు కీలక పాత్ర పోషిస్తాయని తెలిపారు.

ఈ కార్యక్రమంలో పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు నల్లమోని శ్రీధర్ ముదిరాజ్, గిరిజన ఆదివాసీ రాష్ట్ర సమన్వయకర్త రఘు నాయక్, కౌన్సిలర్ సి. పెంటయ్య, మురళీమోహన్, కొప్పునూరి ప్రవీణ్, దిలీప్, రాజు నాయక్, ముబారక్ అలీ ఖాన్, చందులాల్, బాలరాజు గౌడ్, కేకే కృష్ణ, కత్తి చంద్రశేఖరప్ప, గుట్ట రాజు, మధువులు యాదవ్, కరుణాకర్, మంగ మధు, యూత్ కాంగ్రెస్ జిల్లా కార్యదర్శి నరేందర్, కళాశాల విద్యార్థులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

# నేరస్తులపై ఉక్కుపాదం.. శాంతిభద్రతల పరిరక్షణే లక్ష్యం!

అబ్దుల్లాపూర్‌మెట్ నూతన ఇన్‌స్పెక్టర్‌గా రాజు బాధ్యతల స్వీకరణ




**అబ్దుల్లాపూర్‌మెట్, అక్టోబర్ 9 (ప్రజాజ్యోతి):** పోలీస్‌స్టేషన్ పరిధిలో నేరాల నియంత్రణకు కఠిన చర్యలు తీసుకుంటూ, శాంతిభద్రతల పరిరక్షణకు నిరంతరం కృషి చేస్తానని అబ్దుల్లాపూర్‌మెట్ నూతన ఇన్‌స్పెక్టర్ రాజు తెలిపారు. నేరాలకు పాల్పడే వారిపై ఉక్కుపాదం మోపుతామని, ప్రజలకు భద్రత కల్పించడమే ప్రాధాన్యమని పేర్కొన్నారు. ఫ్యూచర్ సిటీ కమిషనరేట్ పరిధిలోని అబ్దుల్లాపూర్‌మెట్ పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్‌గా రాజు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఫ్యూచర్ సిటీలోని సీసీఆర్‌బీ నుంచి బదిలీపై ఆయన ఇక్కడికి వచ్చారు. ఇక్కడ ఇన్‌స్పెక్టర్‌గా విధులు నిర్వహించిన వై.అశోక్‌రెడ్డి హైదరాబాద్ మల్టీజోన్-2కు బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా నూతన ఇన్‌స్పెక్టర్ మాట్లాడుతూ.. పోలీస్‌స్టేషన్ పరిధిలో నేరాల కట్టడికి ప్రత్యేక దృష్టి సారిస్తానని తెలిపారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారిపై కఠినంగా వ్యవహరిస్తామని, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా శాంతిభద్రతలను కాపాడేందుకు చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. నూతనంగా బాధ్యతలు స్వీకరించిన ఇన్‌స్పెక్టర్ సీహెచ్.రాజుకు పోలీస్‌స్టేషన్‌లోని ఎస్ఐలు, సిబ్బంది స్వాగతం పలికారు.

# పరిగిలో వీధి కుక్కల స్వైరవిహారం.. ఏడేళ్ల చిన్నారిపై దాడి!







## కుక్కల దాడులతో ప్రజల్లో భయాందోళన..

**పరిగి, అక్టోబర్ 09 (ప్రజాజ్యోతి):** వికారాబాద్ జిల్లా పరిగి పట్టణంలోని తిరుమల కాలనీలో వీధి కుక్క దాడిలో ఏడేళ్ల చిన్నారి తీవ్రంగా గాయపడింది. పాఠశాల బస్సు కోసం వేచి ఉన్న ముగ్గురు చిన్నారులపై కుక్క దాడికి యత్నించగా, ఇద్దరు తప్పించుకున్నారు. మరో చిన్నారి నైనికపై దాడి చేయడంతో తీవ్ర గాయాలయ్యాయి. మొదట పరిగిలో ప్రథమ చికిత్స అందించిన అనంతరం మెరుగైన వైద్యం కోసం తల్లిదండ్రులు హైదరాబాద్‌కు తరలించారు. పట్టణంలో వీధి కుక్కల బెడద రోజురోజుకూ పెరుగుతోందని, గతంలోనూ చిన్నారులు, యువకులు, వృద్ధులు కుక్కల దాడులకు గురయ్యారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత ఏడాది ఆగస్టు 17న ఒక్కరోజే 23 మందిని కుక్కలు కరిచిన ఘటనను గుర్తుచేస్తున్నారు. అప్పట్లో కుక్కలను పట్టుకుని వ్యాక్సినేషన్, స్టెరిలైజేషన్ చేస్తామని అధికారులు ప్రకటించినప్పటికీ సమస్య పూర్తిగా పరిష్కారం కాలేదని ఆరోపిస్తున్నారు.

**డాగ్స్ క్యాచింగ్ ప్రారంభించాం: మున్సిపల్ కమిషనర్ మల్లేష్.... :** వీధి కుక్కల నియంత్రణకు చర్యలు ప్రారంభించినట్లు పరిగి మున్సిపల్ కమిషనర్ కే. మల్లేష్ తెలిపారు. వారం రోజుల క్రితం బ్లూ క్రాస్ సంస్థతో ఒప్పందం చేసుకున్నామని, దాదాపు 300 కుక్కలకు స్టెరిలైజేషన్, వ్యాక్సినేషన్ చేయించనున్నట్లు వెల్లడించారు. ఇందులో భాగంగా శుక్రవారం నుంచి కుక్కలను పట్టుకునే కార్యక్రమం ప్రారంభించామని, ఈ విషయంలో పట్టణ ప్రజలు సహకరించాలని కోరారు. అయితే, కుక్కల దాడులతో ప్రజలు తీవ్ర భయాందోళనలకు గురవుతున్న నేపథ్యంలో అధికారులు తక్షణమే స్పందించి, చిన్నారులు సహా పట్టణ ప్రజలకు రక్షణ కల్పించేలా చర్యలు తీసుకోవాలని పట్టణ వాసులు కోరుతున్నారు.

# అంధకారంలో బోయిన్‌పల్లి చెరువు కట్ట.. విద్యుత్ లైట్లు ఏవీ?







- ◆ బతుకమ్మ ఆడేందుకు వచ్చే మహిళలకు తప్పని ఇబ్బందులు
- ◆ వెంటనే లైట్లు ఏర్పాటు చేయాలని స్థానికుల డిమాండ్

**బోయిన్‌పల్లి, అక్టోబర్ 9 (ప్రజాజ్యోతి) :** బోయిన్‌పల్లి చెరువు కట్ట అంధకారంలో మగ్గుతోంది. బతుకమ్మ, దసరా నవరాత్రుల పండుగలు ప్రారంభం కానున్న నేపథ్యంలో చెరువు కట్టపై విద్యుత్ దీపాలు లేకపోవడంతో మహిళలు, స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇటీవల గణేష్ నిమజ్జన వేడుకలతో సందడిగా కనిపించిన చెరువు కట్ట, ప్రస్తుతం చీకటిమయంగా మారడంతో స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బతుకమ్మ పండుగ సందర్భంగా మహిళలు తొమ్మిది రోజులపాటు చెరువు కట్టపై బతుకమ్మ ఆడేందుకు వస్తుంటారు. అయితే అక్కడ సరైన విద్యుత్ లైట్లు లేకపోవడంతో రాత్రి వేళల్లో ఇబ్బందులు ఎదురయ్యే పరిస్థితి నెలకొంది. పండుగ వేళ మహిళలు, చిన్నారులు, వృద్ధులు సురక్షితంగా ఉండాలంటే చెరువు కట్టపై తగిన వెలుతురు ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందని స్థానికులు అభిప్రాయ పడుతున్నారు. చెరువు కట్ట అభివృద్ధి చేస్తున్నామని చెప్పడమే కాకుండా, ప్రజలకు అవసరమైన కనీస సౌకర్యాలు కల్పించాలని బస్తీవాసులు కోరుతున్నారు. పండుగల సమయంలో మహిళలు ఆహ్లాదకరమైన వాతావరణంలో బతుకమ్మ ఆడుకునేలా చెరువు కట్టను తీర్చిదిద్దాలని విజ్ఞప్తి చేస్తున్నారు. సంబంధిత అధికారులు వెంటనే స్పందించి చెరువు కట్టపై విద్యుత్ దీపాలను ఏర్పాటు చేయాలని మహిళలు, స్థానిక ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

-- రిపోర్టర్: రమేష్ యాదవ్

# పర్యావరణ పరిరక్షణే లక్ష్యంగా మొక్కల పంపిణీ





- మొక్కలు నాటి పచ్చదనాన్ని పెంపొందించాలి
మాజీ కార్పొరేటర్ ముద్దం నర్సింహా యాదవ్

**బోయిన్‌పల్లి, అక్టోబర్ 9 (ప్రజా జ్యోతి):** పర్యావరణ పరిరక్షణతో పాటు పచ్చదనాన్ని పెంపొందించడమే లక్ష్యంగా ఓల్డ్ బోయిన్‌పల్లి మాజీ కార్పొరేటర్ ముద్దం నర్సింహా యాదవ్ ఆధ్వర్యంలో మొక్కల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానికులకు మొక్కలను పంపిణీ చేసి, పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ముద్దం నర్సింహా యాదవ్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ మొక్కలు నాటడంతో పాటు వాటిని సంరక్షించే బాధ్యతను తీసుకోవాలని పిలుపునిచ్చారు. భావితరాలకు స్వచ్ఛమైన గాలి, ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందించాలంటే పచ్చదనాన్ని పెంపొందించడం ఎంతో అవసరమని పేర్కొన్నారు. పర్యావరణ పరిరక్షణను ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతగా భావించి మొక్కల పెంపకంలో భాగస్వాములు కావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో యూబీడీ సూపర్వైజర్ గణేష్, స్వామి, డివిజన్ అధ్యక్షుడు ఇర్ఫాన్, డివిజన్ కార్యదర్శి హరినాథ్, మహిళా అధ్యక్షురాలు లలిత గౌడ్, మహిళా నాయకురాళ్లు, ఇతర నాయకులు, స్థానికులు పాల్గొన్నారు.

# విద్యార్థులకు స్పోర్ట్స్ డ్రెస్‌ల వితరణ

మల్లాపూర్ సర్పంచ్ చిట్టెడి నరసింహారెడ్డి







**కొత్తూరు అక్టోబర్ 09 (ప్రజా జ్యోతి) :** కొత్తూరు మండలంలోని మల్లాపూర్ గ్రామంలో ప్రాథమిక ఉన్నత పాఠశాలలో సర్పంచ్ చిట్టెడి నరసింహారెడ్డి ఆధ్వర్యంలో సొంత నిధులతో విద్యార్థులకు స్పోర్ట్స్ డ్రెస్‌ల వితరణ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ప్రభుత్వ పాఠశాలలో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తానని ఆయన అన్నారు. విద్యార్థులు క్రమశిక్షణతో చదివి ఉన్నత శిఖరాలకు చేరాలని ఆయన కోరారు. అనంతరం పాఠశాలలో నిర్వహించిన బతుకమ్మ వేడుకల్లో చిన్నారులు పాల్గొని బతుకమ్మ ఆటలు ఆడారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు ఉషారాణి, ఉపాధ్యాయులు శ్రీనివాస్, సెక్రటరీ విక్రమ్ రెడ్డి, వార్డు సభ్యులు పవిత్ర జయేందర్ రెడ్డి, రాజేష్, నాయకులు రవీందర్ రెడ్డి, దామోదర్ రెడ్డి, దయానంద రెడ్డి, చిత్ర రాజు, నరేందర్ రెడ్డి, భరత్ రెడ్డి, అరుణ్ రెడ్డి, పెంటారెడ్డి, దర్శన్, చంద్రశేఖర్ రెడ్డి, చిత్ర యాదయ్య, తదితరులు పాల్గొన్నారు.

# పల్లవి కిడ్జ్‌లో బతుకమ్మ సందడి!

- రంగురంగుల బతుకమ్మలతో చిన్నారుల కోలాహలం..
- తెలంగాణ సంస్కృతికి అద్దం పట్టిన వేడుకలు





**చేవెళ్ల, అక్టోబరు 9 (ప్రజాజ్యోతి):** పూల పండుగ బతుకమ్మ వేడుకలు చేవెళ్లలోని పల్లవి కిడ్జ్ స్కూల్‌లో అంబరాన్నంటాయి. ముందస్తు బతుకమ్మ సంబరాల్లో భాగంగా సంప్రదాయ దుస్తుల్లో ముస్తాబైన చిన్నారులు రంగురంగుల బతుకమ్మలతో సందడి చేశారు. బతుకమ్మ పాటలు, ఆటపాటలతో పాఠశాల ప్రాంగణం పండుగ శోభను సంతరించుకుంది. చిన్నారుల కేరింతలు, ఉత్సాహంతో వేడుకలు కన్నుల పండువగా సాగాయి. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయా లకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగ విశిష్టతను చిన్నతనం నుంచే విద్యార్థులకు తెలియజేయాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు పాఠశాల నిర్వాహకులు తెలిపారు. ఇలాంటి సాంస్కృతిక కార్యక్రమాలతో పిల్లల్లో సంప్రదాయాల పట్ల గౌరవం, ఐకమత్య భావన, సృజనాత్మకత పెంపొందుతాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ శ్రీకాంత్, డైరెక్టర్లు క్రాంతి, అంజి, ప్రిన్సిపాల్ భారీరా ఖాతూన్ పాల్గొని చిన్నారులను అభినందించారు.

విద్యతోపాటు సాంస్కృతిక కార్యక్రమాలకు ప్రాధాన్యం ఇవ్వడం ద్వారా విద్యార్థుల సమగ్ర వికాసానికి దోహదపడుతుందని వారు తెలిపారు. చిన్నారుల చిరునవ్వులు, బతుకమ్మ పాటలు, పూల సోయగాల నడుమ పల్లవి కిడ్జ్ స్కూల్‌లో ముందస్తు బతుకమ్మ సంబరాలు ఘనంగా జరిగాయి.

# బతుకమ్మ వేడుకల్లో బిఆర్ఎస్ సీనియర్ నాయకులు చంద్రశేఖర్‌రెడ్డి



**ఎల్బీనగర్ అక్టోబర్ 9 (ప్రజా జ్యోతి) :** బతుకమ్మ వేడుకల్లో పాల్గొన్న బీఆర్ఎస్ నాయకుడు చంద్రశేఖర్‌రెడ్డి

చైతన్యపురి డివిజన్‌లోని న్యూ దిల్‌సుఖ్‌నగర్ కమ్యూనిటీ హాల్‌లో శుక్రవారం నిర్వహించిన బతుకమ్మ వేడుకల్లో బీఆర్ఎస్ నాయకుడు చంద్రశేఖర్‌రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. టైలరింగ్, బ్యూటీషియన్, మెహందీ కోర్సులను విజయవంతంగా పూర్తి చేసుకున్న మహిళలతో కలిసి కేక్ కట్ చేసి వేడుకలు జరుపుకున్నారు. ఎమ్మెల్యే కార్యక్రమం విజయవంతం కావడంతోనూ కేక్ కటింగ్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకురాలు శోభారాణి, సీనియర్ నాయకుడు సంతోష్ యాదవ్, అర్చన, శివబిందు తదితరులు, డివిజన్ మహిళలు పాల్గొన్నారు.

# మిట్ట కోడూరు ప్రాథమిక పాఠశాలలో బతుకమ్మ పండుగ సంబరాలు





**పరిగి, అక్టోబర్ 09 (ప్రజాజ్యోతి) :** పరిగి మండలంలోని ప్రాథమిక పాఠశాల మిట్ట కోడూరులో ప్రధానోపాధ్యాయులు ఎండి ఉస్మాన్ అలీ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు విద్యార్థిని విద్యార్థులు పాఠశాలలో బతుకమ్మ పండుగ సంబరాలను ఘనంగా నిర్వహించారు. విద్యార్థిని విద్యార్థులు మొదట గున్నుపువ్వు, బంతి పువ్వులు, చామంతి, మందారం తంగేడు, మొదలగు రంగురంగుల పూలచే చక్కగా బతుకమ్మలను పేర్చి, బతుకమ్మ పాటలచే ఆటలచే పాఠశాల ఆవరణలో చక్కగా పండుగ వాతావరణం లో బతుకమ్మ పండుగ సంబరాలు నిర్వహించారు ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు ఎండి ఉస్మాన్ అలీ విద్యార్థినీ విద్యార్థులకు తెలంగాణ సంస్కృతి సాంప్రదాయాలు పూల పండగ అనగా బతుకమ్మ పండుగ యొక్క ప్రాధాన్యతను వివరించారు. కార్యక్రమంలో అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ అనిత రాణి, ఉపాధ్యాయులు ఏ కృష్ణయ్య, ఎం నర్సింలు, రాజు, కవిత విద్యార్థిని విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# సేవా సంకల్ప్ అభియాన్‌లో విద్యార్థుల ప్రతిభకు ప్రోత్సాహం






**పరిగి, అక్టోబర్ 09 (ప్రజాజ్యోతి) :** సేవా సంకల్ప్ అభియాన్‌లో భాగంగా వికారాబాద్ జిల్లా పరిగి పట్టణంలోని శ్రీ సరస్వతీ శిశు మందిర్ హైస్కూల్‌లో విద్యార్థులకు వ్యాసరచన, చిత్రలేఖన పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో విద్యార్థులు పెద్ద సంఖ్యలో ఉత్సాహంగా పాల్గొని తమ సృజనాత్మక ప్రతిభను చాటుకున్నారు. విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీయడంతో పాటు దేశభక్తి, సామాజిక బాధ్యత, సేవాభావం వంటి అంశాలపై అవగాహన పెంపొందించేందుకు ఇలాంటి కార్యక్రమాలు దోహదపడతాయని జిల్లా సేవా సంకల్ప్ అభియాన్ కో-కన్వీనర్ జి. అనూష తెలిపారు. వ్యాసరచన, చిత్రలేఖన పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు జిల్లా స్థాయిలో బహుమతులు అందజేయనున్నట్లు ఆమె వెల్లడించారు.

ఈ కార్యక్రమంలో పాఠశాల అధ్యక్షులు రాచూరి శ్రీనివాస్ రెడ్డి, బీజేపీ పట్టణ అధ్యక్షులు బాలకృష్ణారెడ్డి, పాఠశాల ప్రధానాచార్యులు కె.మల్లేష్, ఆచార్యులు, మాతాజీలు, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

# అంగన్వాడి కేంద్రాలలో ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్ జారీ

- అర్హులైన స్థానిక మహిళాలకు అవకాశం
- ఈనెల 10 నుండి దరఖాస్తులకు ఆహ్వానం
- వివరాలు వెల్లడించిన తాండూర్ ఎసిడిపిఓ శ్రీలక్ష్మి



**తాండూరు అక్టోబర్ 9 ప్రజా జ్యోతి :** వికారాబాద్ జిల్లాలోని పలు అంగన్‌వాడీ కేంద్రాలలో ఖాళీగా ఉన్న ఉద్యోగాల భర్తీకి మహిళా శిశు సంక్షేమ శాఖ ద్వారా నోటిఫికేషన్ జారీ చేసినట్లు తాండూర్ ఎసిడిపిఓ శ్రీలక్ష్మి ఒక ప్రకటనలో వెల్లడించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వికారాబాద్ జిల్లా తాండూరు ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో ఖాళీగా ఉన్న 23 అంగన్‌వాడీ టీచర్లు, మరో 28 అంగన్‌వాడీ ఆయా (ఏడబ్లుహెచ్) పోస్టులు భర్తీ చేయడానికి అర్హులైన మహిళా అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు చెప్పారు. మొత్తం అంగన్వాడి కేంద్రాలలో 51 ఉద్యోగుల భర్తీకి దరఖాస్తులు సమర్పించేందుకు అవకాశం ఉందని చెప్పారు. ఇట్టి దరఖాస్తులు 10అక్టోబర్ 2026 నుంచి ఆన్‌లైన్ లో నమోదు చేసుకోవాలని సూచించారు. ఇట్టి దరఖాస్తులను సమర్పించడం కోసం అక్టోబర్ 24 సాయంత్రం 5 గంటల వరకు మాత్రమే అవకాశం ఉందన్నారు. అదేవిధంగా ఆన్లైన్ ద్వారా పూర్తి చేసుకున్న దరఖాస్తులను నేరుగా శ్రీ సమర్పించడం కోసం అక్టోబర్ 26 నుంచి నవంబర్ 1 వరకు గడువు ఉందన్నారు. అర్హత కలిగిన మహిళా అభ్యర్థులు నిర్ణీత గడువులోగా ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అలాగే మరిన్ని వివరాల కోసం అధికారిక వెబ్‌సైట్ https://wdcw.tg.nic.inను సంప్రదించాలని సూచించారు.

## వివేకానంద విద్యానికేతన్ లో వైభవంగా బతుకమ్మ సంబరాలు:-

కరీంనగర్ టౌన్ అక్టోబర్ 9( ప్రజా జ్యోతి )
స్థానిక భగత్ నగర్ వివేకానంద విద్యానికేతన్ లో ముందస్తు బతుకమ్మ సంబరాలు ఘనంగా జరిగాయి. చిన్నారులు,తల్లిదండ్రులు పూలనే దైవంగా భావించే బతుకమ్మలను



పేర్చి,ఆటపాటలతో విద్యానికేతన్ ప్రాంగణాన్ని సందడిగా మార్చారు. బతుకమ్మ సంబరాలను ఉద్దేశించి విద్యాసంస్థల చైర్మన్ కొమురయ్య సౌగాని మాట్లాడుతూ విద్యానికేతన్ చిన్నారులకు బాల్యం నుంచే మన ఆచారాలు, సంప్రదాయాలను ప్రతిబింబించేలా తెలంగాణ రాష్ట్ర పండుగ బతుకమ్మ సంబరాలను పాఠశాలలో ఘనంగా నిర్వహించుకోవడం జరిగిందని.మనమందరం ఆ తల్లి ఆశీర్వాదాలతో సుఖ సంతోషాలతో, పాడిపంటలతో ఆనందంగా ఉండాలని,చిన్నారులకు ఉత్తమ విద్య ప్రసాదించాలని ఆకాంక్షించారు.కార్యక్రమంలో విద్యాసంస్థల డైరెక్టర్ సౌగాని రాజేశ్వరి,ప్రిన్సిపాల్, వైస్ ప్రిన్సిపాల్,తల్లిదండ్రులు మరియు విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

## మేధో వైకల్య విద్యార్థుల హక్కులకు భరోసా

### సీనియర్ సివిల్ న్యాయమూర్తి యశ్వంత్ సింగ్

కరీంనగర్, అక్టోబర్ 9 (ప్రజాజ్యోతి )
ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవం సందర్భంగా కరీంనగర్‌లోని మనోవికాస్ కేంద్రంలో జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ ఆధ్వర్యంలో ప్రత్యేక వైద్య శిబిరం, న్యాయ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సంస్థ కార్యదర్శి, సీనియర్




సివిల్ న్యాయమూర్తి యశ్వంత్ సింగ్ హాజరై విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించడంతో పాటు తల్లిదండ్రులకు న్యాయపరమైన అవగాహన కల్పించారు.
ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మేధో వైకల్యం ఉన్న విద్యార్థులకు విద్య, శిక్షణ, కుటుంబ ప్రోత్సాహం, సమాజ సహకారం అందిస్తే అన్ని రంగాల్లో రాణించగలరన్నారు. పిల్లల పట్ల జాలి కంటే గౌరవం, సమానత్వం, ప్రోత్సాహం అవసరమని పేర్కొన్నారు. దివ్యాంగుల హక్కుల చట్టం–2016, విద్యా హక్కులు, ప్రభుత్వ సంక్షేమ పథకాలు, ఉచిత న్యాయ సహాయంపై అవగాహన కల్పించారు. అవసరమైన వారు న్యాయ సేవా సదన్‌ను సంప్రదించి సహాయం పొందవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు, వైద్యులు, మనోవికాస్ సిబ్బంది, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## బండి సంజయ్ భవానీ దీక్ష ప్రారంభం

### 11 రోజులపాటు మహాశక్తి అమ్మవారి ఆలయంలోనే దీక్ష

కరీంనగర్ బ్యూరో, అక్టోబర్ 9( ప్రజాజ్యోతి )
కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ శుక్రవారం కరీంనగర్‌లోని



శ్రీ మహాశక్తి అమ్మవారి ఆలయంలో భవానీ దీక్ష చేపట్టారు. ఉదయం 10 గంటలకు వేద పండితుల ఆశీర్వచనాల మధ్య మాలాధారణ చేసి, అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. 11 రోజులపాటు ఆలయంలోనే ఉంటూ అమ్మవారి సేవలో పాల్గొననున్నారు.దసరా నవరాత్రి ఉత్సవాల నేపథ్యంలో మహాశక్తి ఆలయాన్ని విద్యుద్దీపాలతో అలంకరించి, భక్తుల కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఈ నెల 11 నుంచి నవరాత్రి ఉత్సవాలు ప్రారంభం కానున్నాయి. భక్తులకు ఉచిత ప్రసాదం, అల్పాహారం, మధ్యాహ్న భోజన సదుపాయాలు కల్పించనున్నారు. రోజుకు 5 వేల నుంచి 10 వేల మంది భక్తులకు భోజన సౌకర్యాలు అందించేలా ఏర్పాట్లు చేశారు. నవరాత్రి ఉత్సవాల నిర్వహణను బండి సంజయ్ స్వయంగా పర్యవేక్షిస్తున్నారు.

## ప్రాథమిక పాఠశాలలో ముందస్తు బతుకమ్మ వేడుకలు

ఎండపల్లి, అక్టోబరు 9, ప్రజాజ్యోతి:
జగిత్యాల జిల్లా ఎండపల్లి మండలం గుల్లకోట ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం ముందస్తు బతుకమ్మ సంబరాలను ఘనంగా నిర్వహించారు. ప్రధానోపాధ్యాయుడు చందూరి రాజిరెడ్డి నేతృత్వంలో జరిగిన ఈ కార్యక్రమంలో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు.
తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగ విశిష్టతను





విద్యార్థులకు వివరించారు. పూలతో బతుకమ్మలను పేర్చి గౌరీదేవిని పూజించే ఈ పండుగ మహిళల ఐక్యతకు, తెలంగాణ సాంస్కృతిక వైభవానికి ప్రతీకగా నిలుస్తుందని తెలిపారు. ఈ సందర్భంగా సుప్రసిద్ధ జానపద కళాకారిణి చుంచు నాగవ్వ ముఖ్య అతిథిగా హాజరై బతుకమ్మ పాటలు పాడి అలరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఎస్. రమాదేవి, ఆర్. మాలతి, వి. ప్రశాంత్, ఎన్. నరేష్ కుమార్, కె. కృష్ణారెడ్డి, పూర్వ ప్రాథమిక విద్యా శిక్షకురాలు శ్రీలత, ఎ. శిరీషతోపాటు విద్యార్థుల తల్లిదండ్రులు, తదితరులు పాల్గొన్నారు.

## సంక్లిష్టమైన వాయిస్, శ్వాసనాళ సమస్యలకు అధునాతన చికిత్సలు

- యశోద హాస్పిటల్‌లో ప్రత్యేక ఈఎన్‌టీ వైద్య సేవలు
- డాక్టర్ అశీష్ దోరా ఘన్నూర్

కరీంనగర్ టౌన్ అక్టోబర్ 9 (ప్రజా జ్యోతి ) స్వరపేటిక, గొంతు, వాయిస్, శ్వాసనాళ సమస్యలతో బాధపడుతున్న వారికి అధునాతన వైద్య పరీక్షలు, నాణ్యమైన చికిత్సలు అందుబాటులోకి తీసుకొచ్చినట్లు యశోద హాస్పిటల్స్ సోమాజిగూడలో లారింజాలజీ, పీడియాట్రిక్ ఈఎన్‌టీ, ఎయిర్‌వే సర్జరీ నిపుణులు డాక్టర్ అశీష్ దోరా ఘన్నూర్ తెలిపారు. సాధారణ ఈఎన్‌టీ సమస్యల నుంచి అత్యంత సంక్లిష్టమైన వాయిస్, శ్వాసనాళ సమస్యల వరకు సమగ్ర వైద్య సేవలు అందించడమే తమ లక్ష్యమని పేర్కొన్నారు. శుక్రవారం నగరంలోని యశోద హాస్పిటల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.
వాయిస్‌లో మార్పులు, మింగడంలో ఇబ్బందులు, పిల్లల్లో శ్వాసనాళ సమస్యలు, స్వరపేటిక సంబంధిత వ్యాధులు, లారింగో ట్రాకియల్ స్టెనోసిస్, గురక, నిద్రలో శ్వాసకు ఆటంకాలు వంటి సమస్యలకు ప్రత్యేక వైద్య సేవలు అందిస్తున్నట్లు వివరించారు. రోగి సమస్యను కచ్చితంగా గుర్తించి, అవసరాన్ని బట్టి వైద్య చికిత్సలు లేదా శస్త్రచికిత్సలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.
ఆధునిక వైద్య సాంకేతికతతో మెరుగైన




నిర్ధారణ చేపట్టేందుకు హైడెఫినిషన్ ఎండోస్కోపీ (హెచ్‌డీ), న్యారో బ్యాండ్ ఇమేజింగ్ (ఎన్‌బీఐ), స్ట్రోబోస్కోపీ వంటి సదుపాయాలు అందుబాటులో ఉన్నాయని చెప్పారు. వీటి ద్వారా స్వరపేటిక, వాయిస్ సంబంధిత సమస్యలను మరింత స్పష్టంగా పరిశీలించి, తగిన చికిత్సా విధానాన్ని నిర్ణయించేందుకు వీలుంటుందన్నారు.
ఈఎన్‌టీ వైద్యంలో వివిధ ఉపవిభాగాల నిపుణుల సమన్వయం కీలకమని డాక్టర్ అశీష్ పేర్కొన్నారు. లారింజాలజీ, పీడియాట్రిక్ ఈఎన్‌టీ, ఎయిర్‌వే సర్జరీ, అలర్జీ, ఓటాలజీ విభాగాల్లో తనతోపాటు నిపుణుల బృందం సేవలందిస్తోందని తెలిపారు. హెడ్ అండ్ నెక్ ఆంకో సర్జరీ, రైనాలజీ, స్కల్ బేస్ సర్జరీ విభాగాల్లో డాక్టర్ ఎన్. అపూర్వా రెడ్డి ప్రత్యేక వైద్య సేవలు అందిస్తున్నారని వివరించారు.
రోగులు తమ సమస్యలను నిర్లక్ష్యం చేయకుండా సకాలంలో వైద్యులను సంప్రదించాలని సూచించారు. వివిధ విభాగాల నిపుణులు ఒకే చోట సమన్వయంతో
పనిచేయడం వల్ల రోగులకు సమగ్ర వైద్య సేవలు అందించేందుకు అవకాశం ఉంటుందని తెలిపారు.
ఈ సమావేశంలో యశోద హాస్పిటల్స్ సీనియర్ మేనేజర్లు సుధీర్ రెడ్డి, శ్రవణ్ కుమార్ పాల్గొన్నారు.

## కాకతీయ స్మార్ట్ కిడ్స్ స్కూల్‌లో ఘనంగా దుర్గ మాతనవరాత్రి ఉత్సవాలు

కరీంనగర్ టౌన్ అక్టోబర్ 9 (ప్రజా జ్యోతి ) కట్టరాంపూర్, హనుమాన్ టెంపుల్ సమీపంలో ఉన్న కాకతీయ స్మార్ట్ కిడ్స్ స్కూల్‌లో బతుకమ్మ పండుగ, నవదుర్గ



నవరాత్రి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు.ఈ వేడుకల్లో పాఠశాలలోని ప్రీ–ప్రైమరీ చిన్నారులు తమ అద్భుతమైన ప్రదర్శనలతో అందరినీ ఆకట్టుకున్నారు. చిన్నారులు రామాయణంలోని ముఖ్య ఘట్టాలను వివరిస్తూ రామాయణ నాటకాన్ని ప్రదర్శించారు. అలాగే తొమ్మిది రూపాల్లో అమ్మవారిని ప్రతిబింబించేలా నవదుర్గల వేషధారణలో చిన్నారులు ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. అనంతరం రామలీలా కార్యక్రమాన్ని ప్రదర్శించి, సత్యం, ధర్మం, భక్తి, చెడుపై మంచి సాధించే విజయాన్ని చాటిచెప్పారు.అనంతరం చిన్నారులు, ఉపాధ్యాయులు కలిసి బతుకమ్మ ఆడుతూ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక అయిన బతుకమ్మ పండుగ వైభవాన్ని చాటిచెప్పారు. రంగురంగుల పూలతో బతుకమ్మలను పేర్చి, పాటలు పాడుతూ ఉత్సాహంగా ఆడారు. బతుకమ్మ పండుగ విశిష్టత, ప్రకృతితో మనిషికి ఉన్న అనుబంధం, పూల ప్రాముఖ్యత, మహిళల ఐక్యత, తెలంగాణ ఆడపడుచుల సాంస్కృతిక వారసత్వం గురించి అందరికీ తెలియజేశారు. ఈ కార్యక్రమం ద్వారా చిన్నారులకు తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాల పట్ల గౌరవం, మన పండుగల పట్ల అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ గున్నాల క్రాంతి కుమార్ మాట్లాడుతూ, విద్యార్థులకు చదువుతో పాటు భారతీయ సంస్కృతి, సంప్రదాయాలు, మన పండుగల విశిష్టతను తెలియజేయడం ఎంతో ముఖ్యమని అన్నారు. ఇలాంటి కార్యక్రమాలు చిన్నారుల్లో ఆత్మవిశ్వాసం, సృజనాత్మకత, సామాజిక స్పృహను పెంపొందిస్తాయని తెలిపారు.పాఠశాల ప్రిన్సిపాల్ శ్రీమతి గున్నాల అర్చన మాట్లాడుతూ, బతుకమ్మ వంటి తెలంగాణ సాంస్కృతిక పండుగలను పాఠశాల స్థాయిలో నిర్వహించడం ద్వారా చిన్నారులకు మన సంస్కృతి, సంప్రదాయాలపై అవగాహన పెరుగుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఉత్సాహంగా పాల్గొన్న చిన్నారులను, ఉపాధ్యాయులను అభినందించారు.ఈ వేడుకల్లో పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొని చిన్నారుల ప్రదర్శనలను ఆస్వాదించారు. సంప్రదాయాలు, సంస్కృతి, భక్తి, ఆనందం కలగలిసిన ఈ వేడుకలు అందరినీ అలరించాయి.

## అంగన్‌వాడీ టీచర్లు, ఆయమ్మలకు ఆత్మీయ సన్మానం

### సేవా సంకల్ప్ అభియాన్‌లో భాగంగా బీజేపీ ఆధ్వర్యంలో కార్యక్రమం

ముస్తాబాద్, అక్టోబర్ 9 (ప్రజా జ్యోతి): దేశాభివృద్ధి, ప్రజా సంక్షేమమే లక్ష్యంగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ 25 ఏళ్ల సుదీర్ఘ ప్రజాసేవను పురస్కరించుకుని నిర్వహిస్తున్న సేవా సంకల్ప్ అభియాన్లో భాగంగా ముస్తాబాద్‌లో అంగన్‌వాడీ టీచర్లు, ఆయమ్మలకు ఆత్మీయ సన్మాన కార్యక్రమం నిర్వహించారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా చిన్నారులకు పౌష్టికాహారం అందించడం, వారి ఆరోగ్య సంరక్షణతో పాటు మహిళలు, పిల్లల సంక్షేమం కోసం సేవలందిస్తున్న అంగన్‌వాడీ సిబ్బందిని ఈ సందర్భంగా ఘనంగా సత్కరించారు. సమాజ అభివృద్ధిలో అంగన్‌వాడీ సిబ్బంది పాత్ర ఎంతో కీలకమని, చిన్నారుల ఆరోగ్య పరిరక్షణ, పోషకాహారం, ప్రాథమిక విద్య, మహిళా సంక్షేమం వంటి అంశాల్లో వారు అందిస్తున్న సేవలు అభినందనీయమని నాయకులు పేర్కొన్నారు. ప్రజలకు సేవ చేయాలనే సంకల్పంతో చేపడుతున్న సేవా సంకల్ప్ అభియాన్ ద్వారా వివిధ వర్గాల సేవలను గుర్తించి, వారిని గౌరవించడం జరుగుతుందని తెలిపారు.



ఈ కార్యక్రమంలో ముస్తాబాద్ మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ మట్ట వెంకటేశ్వర్ రెడ్డి, బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు మల్లారపు సంతోష్ రెడ్డి, జిల్లా కార్యదర్శి మీస సంజీవ్, మండల ప్రధాన కార్యదర్శి ఎదునూరి గోపికృష్ణ, శక్తి కేంద్ర ఇన్‌చార్జి దీటి సత్తయ్య, బూత్ అధ్యక్షులు మీస స్వామి, రంజాన్ వెంకటేష్, పున్నం అనిల్, ఒరగంటి సత్యం, రాజేష్, ప్రశాంత్, యాదగిరితో పాటు బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఎల్‌నినో పరిస్థితుల్లో కూరగాయల సాగుతో అధిక ఆదాయం

### రోజుకు రూ.4 వేల నుంచి రూ.5 వేల వరకు ఆర్జిస్తున్న రైతు మహేందర్

పెద్దపల్లి ప్రతినిధి, అక్టోబర్ 9, ప్రజా జ్యోతి: ఎల్‌నినో పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని తక్కువ నీటితో అధిక ఆదాయం అందించే కూరగాయల సాగుపై రైతులు దృష్టి సారించాలని జిల్లా ఉద్యానవన అధికారి గడ్డం శ్యామ్ ప్రసాద్ సూచించారు.
పెద్దకల్వల గ్రామానికి చెందిన ప్రగతిశీల రైతు బుసనవేణ మహేందర్ సుమారు రెండు ఎకరాల్లో బీరకాయ, కాకరకాయ, సొరకాయ, దోసకాయ, టమాటా సాగు చేస్తూ రోజుకు రూ.4 వేల నుంచి రూ.5 వేల వరకు ఆదాయం పొందుతున్నారని తెలిపారు. వరి వంటి పంటలతో పోలిస్తే నీటి లభ్యతకు అనుగుణంగా కూరగాయలు సాగు చేయడం ద్వారా నీటిని పొదుపు చేసుకోవడంతోపాటు తరచుగా ఆదాయం పొందవచ్చని పేర్కొన్నారు. ఉద్యానవన శాఖ ద్వారా తీగజాతి కూరగాయలకు వెదురు కర్రల ఆధారం, శాశ్వత పందిళ్లు, మల్చింగ్ షీట్లు, కూరగాయల నారు, డ్రిప్ పరికరాలపై నిబంధనల మేరకు రాయితీలు అందిస్తున్నట్లు తెలిపారు. రాబోయే రబీ సీజన్‌లో రైతులు తమ భూమి, నీటి లభ్యతకు అనుగుణంగా కూరగాయల సాగును చేపట్టి ప్రభుత్వ ప్రోత్సాహకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.



ఈ పర్యటనలో ఉద్యానవన అధికారి ఎస్. మహేష్, విస్తరణ అధికారులు బి. రాము, బి. మహేష్, సిగ్నెట్ ఇరిగేషన్ కంపెనీ డీసీఓ బి. మనోహర్, స్థానిక రైతులు పాల్గొన్నారు

## వరంగల్ బీఎస్పీ సమరభేరి సభకు తరలివెళ్లిన మంథని బీఎస్పీ శ్రేణులు

రామగిరి, అక్టోబర్ 09 (ప్రజాజ్యోతి) :
బహుజనుల రాజకీయ చైతన్యం, రాజ్యాధికార సాధనే లక్ష్యంగా వరంగల్‌లో నిర్వహించనున్న సమరభేరి సభకు మంథని నియోజకవర్గ బీఎస్పీ నాయకులు తరలివెళ్లారు. బీఎస్పీ వ్యవస్థాపకులు మాన్య కాన్షీరాం 20వ వర్ధంతిని పురస్కరించుకుని నిర్వహిస్తున్న ఈ సభకు హాజరయ్యేందుకు శుక్రవారం రామగిరి మండలం కల్వచర్ల నుంచి నాయకులు బయలుదేరారు. బహుజన ఉద్యమ స్ఫూర్తిని చాటుతూ నిర్వహిస్తున్న ఈ కార్యక్రమంలో పాల్గొనేందుకు జిల్లా కోశాధికారి పులిపాక బొంద్యాలు, నియోజకవర్గ అధ్యక్షుడు జనగామ రవికుమార్, ఉపాధ్యక్షుడు ఏట సంపత్, రామగిరి మండల ఉపాధ్యక్షుడు ఇరుగురాల సదానందం, కమాన్‌పూర్ మండల ఉపాధ్యక్షుడు గజ్జల సురేష్‌తో పాటు నాయకులు చిలుముల రమేష్, అసన్ సతీష్, సీనియర్ నాయకుడు పేగ నరేష్, కాజీపేట స్వామి, మారేపల్లి రవికుమార్, ఉప్పులేటి పర్వతాలు, జనగామ మల్లేష్, సుందిళ్ల సంతోష్, దుబాసి రవి తదితరులు పయనమయ్యారు.



## పాఠశాలల్లో డీఈఓ రాము ఆకస్మిక తనిఖీ

### బతుకమ్మలతో ఘన స్వాగతం పలికిన విద్యార్థినులు.. ఎఫ్ఎల్ఎన్ అమలుపై డీఈఓ సమీక్ష

బీర్ పూర్, అక్టోబర్ 9 (ప్రజా జ్యోతి):
జగిత్యాల జిల్లా విద్యాశాఖాధికారి రాము శుక్రవారం బీర్ పూర్ మండలంలోని పలు ప్రాథమిక, ఉన్నత పాఠశాలలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇందులో భాగంగా మండల కేంద్రంలోని ఎంపీపీఎస్ జీపీ బీర్ పూర్, ఎంపీపీఎస్ ఇంద్రనగర్ కాలనీ, మరియు జెడ్పీహెచ్ఎస్ నరసింహులపల్లి పాఠశాలలను ఆయన సందర్శించారు. పాఠశాలలకు చేరుకున్న జిల్లా విద్యాశాఖాధికారికి





విద్యార్థినులు ముందస్తు బతుకమ్మలు, రంగురంగుల పూల అలంకరణలతో సాంప్రదాయబద్ధంగా ఘన స్వాగతం పలికారు. విద్యార్థుల ఉత్సాహాన్ని, వారిలోని సాంస్కృతిక ప్రతిభను డీఈఓ ఈ సందర్భంగా ప్రత్యేకంగా అభినందించారు. అనంతరం ఆయన పాఠశాలల్లో 'ప్రాథమిక అక్షరాస్యత, సంఖ్యాజ్ఞాన' అమలు తీరును నిశితంగా పరిశీలించారు. నేరుగా తరగతి గదుల్లోకి వెళ్లి విద్యార్థుల చదవడం, రాయడం మరియు ప్రాథమిక గణిత నైపుణ్యాలను స్వయంగా పరీక్షించారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఎఫ్ఎల్ఎన్ లక్ష్యాలను నిర్దేశిత గడువులోగా సాధించాలని, విద్యార్థుల్లో కనీస అభ్యాసన సామర్థ్యాలను పెంపొందించేందుకు ఉపాధ్యాయులు మరింత కృషి చేయాలని డీఈఓ ఆదేశించారు. ఈ తనిఖీ కార్యక్రమంలో మండల విద్యాధికారి నాగభూషణం, ఉపాధ్యాయులు, సీఆర్‌పీలు మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

## గ్రామ పంచాయతీ సిబ్బందికి దుస్తులు పంపిణీ చేసిన సర్పంచ్

ఇల్లంతకుంట అక్టోబర్ 9(ప్రజా జ్యోతి)
రాజన్న సిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట మండలం రహీంఖాన్పేట గ్రామపంచాయతీ కార్యాలయంలో దసరా పండుగ సందర్భంగా



శుక్రవారం రోజు సర్పంచ్ కమటం లావణ్య రాములు.గ్రామపంచాయతీ సిబ్బందికి దుస్తులు పంపిణీ చేశారు ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ గడ్డమీది పద్మ, కార్యదర్శి పులి సంధ్య, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

## వల్లంపట్ల గ్రామంలో అంగన్వాడీ కార్యకర్తలకు బి జే పి పార్టీ ఘన సన్మానం

ఇల్లంతకుంట అక్టోబర్ 9(ప్రజా జ్యోతి)
రాజన్న సిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట మండలం వల్లంపట్ల గ్రామంలో శుక్రవారం రోజు అంగన్వాడీ కార్యకర్తలను భారతీయ జనతా పార్టీ రాజన్న సిరిసిల్ల జిల్లా సీనియర్ నాయకురాలు కొలనూరు ముత్తవ్వ ఘనంగా సన్మానించారు.
ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా బీజేపీ ఇల్లంతకుంట మండల అధ్యక్షుడు భూమాల అనిల్, మహిళా మోర్చా అధ్యక్షురాలు మారవేణి



దివ్య, రాజు శ్రీశైలం, చీమలగొట్టు శ్రీనివాస్ తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా కొలనూరు ముత్తవ్వ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో అంగన్వాడీ కార్యకర్తలు చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు అందిస్తున్న సేవలు ఎంతో విలువైనవని అన్నారు. పిల్లల ఆరోగ్యం, పోషకాహారం, మహిళల సంక్షేమం కోసం అంగన్వాడీ సిబ్బంది చేస్తున్న కృషిని అభినందించారు. వారి సేవలను ప్రతి ఒక్కరూ గుర్తించి గౌరవించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు బోయిన్ రంజిత్, గుంటి వేణు,అజయ్ మహిళా మోర్చా కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

## డిజిటల్ సర్పంచ్ శక్తిగా రమాదేవి.

ఎలిగేడు అక్టోబర్ 09 (ప్రజా జ్యోతి)
కేంద్ర ప్రభుత్వం చేపట్టిన డిజిటల్ సర్పంచ్ శక్తిగా కార్యక్రమానికి ఎలిగేడు మండలంలోని ర్యాకల్ దేవ్ పల్లి గ్రామ సర్పంచ్ మద్దెల రమాదేవి సంపత్




ఎంపికయ్యారు ఈ ఈ సందర్భంగా మద్దెల రమాదేవి సంపత్ మాట్లాడుతూ. డిజిటల్ సర్పంచి శక్తి చాలా విషయాలపై అవగాహన పెంచుకుంటూ ప్రజలకు మరింత అభివృద్ధికి సహకరించి ప్రభుత్వ సూచన మేరకు పనులు చేస్తానని తెలిపారు.కార్యక్రమానికి 200 మంది సర్పంచులు దరఖాస్తు చేసుకోగా, 40 మంది మాత్రమే ఎంపికయ్యారు వీరికి ఈనెల 8 నుంచి పలు అంశాలపై శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తారు. ఈ సందర్భంగా మండల సర్పంచులు ప్రజాప్రతినిధులు గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

## సిద్ధారంలో ప్రభుత్వ భూమిని పరిశీలించిన డాక్టర్ మట్టా



**సత్తుపల్లి అక్టోబర్09 (ప్రజా జ్యోతి)** నిరుపేదలకు ఇళ్ల స్థలాలను ఇచ్చేందుకు, మండల పరిధిలోని సిద్ధారం గ్రామంలో గల ఏనుగుల గుట్టను రాష్ట్ర సీనియర్ కాంగ్రెస్ నాయకులు డాక్టర్ మట్టా దయానంద్ విజయకుమార్ శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిద్ధారం, గౌరీగూడెం గ్రామాల్లో ఇంటి స్థలం లేక ఎంతోమంది ఇరుకు ఇండ్లలో ఉంటున్నారని, కుటుంబాలు పెరిగాయి గాని ఇంటి స్థలాలు లేవని, వారందరికీ ఇళ్ల స్థలాలు ఏర్పాటు చేపించి, ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేసి సొంత ఇంటి కలను నెరవేరుస్తామని, ఇది కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమని స్థలాలను పరిశీలించారు. అర్హులైన ప్రతి ఒక్కరికి ఇంటి స్థలాన్ని ఏర్పాటు చేపిస్తామని అన్నారు. అక్కడ స్థలాన్ని జెసిబి సహాయంతోటే పరిశుభ్రంగా చేపించి,నిరుపేదలకు అందించేందుకు ఏర్పాట్లు చేపిస్తున్నామని అన్నారు. ఆయన వెంట తాసిల్దార్ సత్యనారాయణ,సిబ్బంది పద్మ,మధు, మందపాటి ముత్తారెడ్డి,నందికోల యాకోబు, కాంగ్రెస్ నాయకులు ఉన్నారు.

## శ్రీవారి ఆలయ శంకుస్థాపనకు సర్వం సిద్ధం

పోస్టర్లను ఆవిష్కరించిన కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు తుమ్మల యుగంధర్





**రఘునాథపాలెం ప్రజా జ్యోతి** ఖమ్మం: అల్లిపురం సమీపంలో ఈనెల 12న రూ.90 కోట్లతో నిర్మించనున్న శ్రీ వెంకటేశ్వర స్వామి దివ్య ఆలయ శంకుస్థాపన కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌ను రాష్ట్ర నాయకులు తుమ్మల యుగంధర్, ఆత్మ కమిటీ చైర్మన్ దిరిశాల వెంకటేశ్వర్లు విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో రఘునాథపాలెం మండల కాంగ్రెస్ నాయకులు కొంటెముక్కుల నాగేశ్వరరావు, చిమ్మపూడి గ్రామ కాంగ్రెస్ నాయకులు యర్రా కరుణాకర్ రెడ్డి, దశరథ రవి పాల్గొన్నారు. శంకుస్థాపనకు ఉమ్మడి ఖమ్మం జిల్లా భక్తులు అధిక సంఖ్యలో హాజరుకావాలని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పిలుపునిచ్చారు.

## రైతులకు నాణ్యమైన వ్యవసాయ పరికరాలు హోమ్ డెలివరీ





**రఘునాథపాలెం: ప్రజా జ్యోతి** చిమ్మపూడి: గ్రామంలోని రైతులు, స్వయం సహాయక సంఘాల మహిళలకు హేస్ కంపెనీకి చెందిన సుహాస్ బ్రాండ్ ద్వారా తక్కువ ధరలకే నిత్యావసర సరుకులు, రైతులకు పట్టాలు, డబుల్ మోటార్ బ్యాటరీ పంపులను అందిస్తున్నారు. నాణ్యతతో కూడిన ఉత్పత్తులను అందుబాటు ధరలకు హోమ్ డెలివరీ చేస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో కొత్తగూడెం--పాల్వంచ టీం హెడ్ ఆఫీసర్ కిరణ్, మేనేజర్ శ్యామ్, ఫీల్డ్ ఆఫీసర్లు నరేష్, ఫణికిరణ్, ఎల్లేష్, సైదాబీతో పాటు గ్రామ రైతులు, మహిళలు, స్వయం సహాయక సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

# పువ్వాడ నగర్‌లో త్వరలో ఇళ్ల స్థలాల సర్వేకు సిద్ధం

◇ ప్రజలు ఆందోళన చెందొద్దు.. సహకరించాలి: ఆర్డీవో శ్రీనివాస్

**రఘునాథపాలెం: ప్రజా జ్యోతి** ఖమ్మం జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు పువ్వాడ నగర్‌లో త్వరలో ఇళ్ల స్థలాలపై ప్రాథమిక సర్వే నిర్వహించనున్నట్లు ఖమ్మం ఆర్డీవో శ్రీనివాస్ తెలిపారు. ప్రజలు ఎలాంటి అపోహలు, ఆందోళనలకు గురికాకుండా సర్వే బృందాలకు సహకరించాలని కోరారు. శుక్రవారం రఘునాథపాలెం తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 2009, 2016 సంవత్సరాల్లో కోయచిలక పరిధిలోని సర్వే నంబర్ 192లో 2,000 మందికి పైగా నిరుపేదలకు ప్రభుత్వం 75 గజాల చొప్పున ఇళ్ల పట్టాలు పంపిణీ చేసిందని తెలిపారు. ఆయా స్థలాలకు సంబంధించి తరచూ ఫిర్యాదులు వస్తుండటంతో సర్వే చేపడుతున్నట్లు వివరించారు. సర్వే కోసం జీపీవో, ఇద్దరు



పంచాయతీ కార్యదర్శులతో కూడిన మొత్తం ఏడు బృందాలను ఏర్పాటు చేశామని, వీటిని రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు పర్యవేక్షిస్తారని చెప్పారు. స్థలాల్లో ప్రస్తుతం ఎవరు నివసిస్తున్నారు, వారు అసలు పట్టాదారులా, కొనుగోలు ద్వారా పొందారా, గిఫ్ట్‌గా వచ్చిందా, ఖాళీగా ఉన్నాయా అనే వివరాలను క్షేత్రస్థాయిలో సేకరిస్తామన్నారు. స్థానికులు స్థలాలకు సంబంధించిన పత్రాలతో పాటు ఆధార్, ఓటర్ ఐడీ వంటి గుర్తింపు కార్డులను సిద్ధంగా ఉంచుకోవాలని సూచించారు.

**ఎవరినీ తొలగించం.. భయపడొద్దు**

ఈ సర్వే కారణంగా ఎవరినీ ఇళ్ల స్థలాల నుంచి తొలగించబోమని ఆర్డీవో స్పష్టం చేశారు. కేవలం వాస్తవ పరిస్థితులను తెలుసుకునేందుకే ప్రాథమిక సర్వే నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇప్పటికే రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం నిర్వహించి వివరించామని, సర్వే ప్రారంభానికి ముందు గ్రామసభ నిర్వహించి ప్రజలకు పూర్తి అవగాహన కల్పిస్తామని చెప్పారు. అనంతరం క్షేత్రస్థాయి పరిశీలన ప్రారంభిస్తామని, సర్వే నివేదికను జిల్లా కలెక్టర్‌కు సమర్పిస్తామని వెల్లడించారు. ఇటీవల ఎదులాపురం మున్సిపాలిటీ పరిధిలోని పెద్దతండాలోనూ ఇదే తరహాలో సర్వే నిర్వహించినట్లు తెలిపారు. ఈ సమావేశంలో తహసీల్దార్ శ్వేత, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు ప్రవీణ్, జగదీష్, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రజాజ్యోతి ఎఫెక్ట్.. ఇంకుడు గుంత పూర్తి!

◇ 17 నెలల సమస్యకు పరిష్కారం.. స్పందించిన కాంట్రాక్టర్

◇ అంగన్వాడీ కేంద్రం పరిసరాల సమస్యపై చొరవ చూపిన సర్పంచ్ నరేందర్ రెడ్డి

**తిరుమలాయపాలెం, అక్టోబర్ 9 (ప్రజా జ్యోతి):** ప్రజా సమస్యను వెలుగులోకి తీసుకొచ్చిన ప్రజా జ్యోతి కథనానికి స్పందన లభించింది. ఖమ్మం జిల్లా తిరుమలాయపాలెం మండలం జూపెడ ఎస్సీ కాలనీలోని అంగన్వాడీ కేంద్రం-2 వద్ద సుమారు 17 నెలలుగా అసంపూర్తిగా ఉన్న ఇంకుడు గుంత నిర్మాణ పనులు ఎట్టకేలకు పూర్తయ్యాయి. సమస్యను వార్త రూపంలో వెలుగులోకి తీసుకొచ్చిన అనంతరం కాంట్రాక్టర్ స్పందించి నిర్మాణాన్ని పూర్తి చేయడం పట్ల స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. అంగన్వాడీ కేంద్రం వద్ద ఇంకుడు గుంత నిర్మాణం అసంపూర్తిగా ఉండటం, పరిసరాల్లో నీటి నిల్వలతో దోమల బెడద పెరిగే ప్రమాదం ఉందనే అంశాలను అక్టోబర్ 5న ప్రజా జ్యోతి వెలుగులోకి తీసుకొచ్చింది. చిన్నారుల ఆరోగ్యం, భద్రతను దృష్టిలో ఉంచుకుని సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కథనం ద్వారా సంబంధిత వర్గాల దృష్టికి తీసుకెళ్లింది. ఈ నేపథ్యంలో కాంట్రాక్టర్ స్పందించి పెండింగ్‌లో ఉన్న నిర్మాణ పనులను పూర్తి చేశారు. నెలల తరబడి అసంపూర్తిగా ఉన్న పని పూర్తికావడంతో స్థానికులకు ఊరట లభించింది. గ్రామంలో ప్రజలకు ఇబ్బందులు కలిగించే సమస్యల పరిష్కారానికి





ప్రజాప్రతినిధులు చొరవ చూపడం కీలకమని స్థానికులు పేర్కొంటున్నారు. అంగన్వాడీ కేంద్రం పరిసరాల్లో నెలకొన్న సమస్య పరిష్కారమయ్యే దిశగా సర్పంచ్ పాత్రను వారు ప్రస్తావిస్తున్నారు. చిన్నారులకు ఇబ్బందులు కలగకుండా నిర్మాణ పనులు పూర్తికావడం పట్ల సంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను వెలుగులోకి తీసుకురావడమే కాకుండా, వాటి పరిష్కారానికి దోహదపడటంలో ప్రజా జ్యోతి తన బాధ్యతను కొనసాగిస్తోంది. జూపెడ అంగన్వాడీ కేంద్రం-2 వద్ద అసంపూర్తిగా ఉన్న ఇంకుడు గుంత నిర్మాణం పూర్తికావడం ఇందుకు నిదర్శనంగా నిలిచింది. చిన్నారులకు పరిశుభ్రమైన, సురక్షితమైన వాతావరణం కల్పించే దిశగా


ప్రజాజ్యోతి

17 నెలలుగా పూర్తి కాని ఇంకుడు గుంత!

సంబంధిత వర్గాలు స్పందించడం అభినందనీయమని స్థానికులు అభిప్రాయపడుతున్నారు.

# కార్మికులకు పిఎఫ్, ఈఎస్ఐ చట్టబద్ధ హక్కులు కల్పించాలి

◇ పెండింగ్ వేతనాలు చెల్లించాలి ◇ టియుసీఐ జిల్లా అధ్యక్షులు మధుసూదన్ రెడ్డి

**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా క్రైమ్ ప్రతినిధి / మణుగూరు. అక్టోబర్ 9, ప్రజాజ్యోతి** మణుగూరు మున్సిపాలిటీలో పనిచేస్తున్న వాటర్ సప్లై కార్మికులకు పిఎఫ్, ఈఎస్ఐ తదితర చట్టబద్ధ హక్కులు, సౌకర్యాలు కల్పించాలని, పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలని టియుసిఐ జిల్లా అధ్యక్షులు ఆర్. మధుసూదన్ రెడ్డి డిమాండ్ చేశారు. శుక్రవారం సమస్యలు పరిష్కరించాలని మున్సిపల్ కమిషనర్ కి తెలంగాణ ప్రగతిశీల మున్సిపల్ వర్కర్స్ యూనియన్ మణుగూరు బ్రాంచ్ కమిటీ ఆధ్వర్యంలో వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మణుగూరు మున్సిపాలిటీలో గత ఎనిమిది సంవత్సరాలుగా 14 మంది వాటర్ సప్లై కార్మికులుగా పనిచేస్తున్నారని, వారికి నేటి వరకు పిఎఫ్, ఈఎస్ఐ లాంటి తదితర చట్టబద్ధ హక్కులు, సౌకర్యాలు అమలు కాకపోవడం దారుణమన్నారు. నెలల తరబడి జీతాలు చెల్లించకపోవడం సరైంది కాదన్నారు. నెలల తరబడి జీతాలు చెల్లించకపోతే వారి కుటుంబాలను ఎలా పోషించుకుంటారని ప్రశ్నించారు. దసరా లోపు వారికి జీతాలు చెల్లించే విధంగా తగిన చర్యలు తీసుకోవాలన్నారు. దసరా లోపు జీతాలు చెల్లించకపోతే వారు పండుగ పూట పస్తులు ఉండే పరిస్థితి ఏర్పడుతుందన్నారు. పిఎఫ్, ఈఎస్ఐ తదితర చట్టబద్ధ హక్కులు సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. మున్సిపల్ వాటర్ సప్లై కార్మికుల పట్ల నిర్లక్ష్యం ప్రదర్శిస్తే భవిష్యత్తులో ఆందోళన తప్పదు అన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వర్కర్స్ యూనియన్



రాష్ట్ర నాయకులు బత్తుల. వెంకటేశ్వర్లు, మణుగూరు బ్రాంచ్ అధ్యక్ష కార్యదర్శులు బత్తుల, వెంకటరమణ, మిట్టపల్లి. రాజేందర్, సహాయ కార్యదర్శి షఫీ ఉద్దీన్, నాయకులు కుమార్, వేముల. శ్రీను, రాజు తదితరులు పాల్గొన్నారు.

# ఏజెన్సీ ఇసుకపై దండుపాళ్యం ముఠా

◇ గోదావరిని లూటీ చేస్తున్న ఇసుక మాఫియా

◇ రోడ్లన్నీ హాంఫట్..! ఖజానాకు గండి.!! ఇసుక దోపిడీపై గర్జన..!

◇ ఈనెల 12 నుండి ఇసుక ర్యాంపులపై సమరశంఖం..

◇ సీఎస్ఆర్ నిధులు మెస్సీకా..? మన రోడ్లకా..? మంత్రుల తీరుపై ఫైర్...!

◇ నవంబర్ 5న కలెక్టరేట్ ముట్టడి.

◇ ఇసుక లారీల ఆగడాలపై బీఆర్ఎస్ యుద్ధం..!

◇ పినపాక మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు ఫైర్

**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా క్రైమ్ ప్రతినిధి / మణుగూరు. అక్టోబర్ 9, ప్రజాజ్యోతి..** భద్రాద్రి జిల్లాలో ఇసుక మాఫియా ఆగడాలపై బీఆర్ఎస్ పార్టీ పోరుబాటకు సిద్ధమైందని అడ్డదిడ్డంగా ఓవర్ లోడ్ తో, అతివేగంతో దూసుకెళ్తున్న ఇసుక లారీల వల్ల జిల్లా రహదారులు పూర్తిగా ధ్వంసమయ్యాయని, అనేక ప్రమాదాల్లో



అమాయకులు ప్రాణాలు కోల్పోతున్నా, అంగవైకల్యులవుతున్నా ప్రజాపాలన అని చెప్పుకునే కాంగ్రెస్ ప్రభుత్వం పట్టించుకోవడం లేదని పినపాక మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు ఫైర్ అయ్యారు. శుక్రవారం జిల్లాలో జరుగుతున్న ఇసుక దందా పత్రిక విడుదల చేశారు. సీఎం రేవంత్ రెడ్డి, జిల్లా మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, భట్టి విక్రమార్క, తుమ్మల నాగేశ్వరరావు, సీతక్కలు గోదావరి ఇసుకను దండుపాళ్యం బ్యాచ్ లా లూటీ చేస్తున్నారని, బినామీల పేరుతో కోట్లాది ఖనిజ సంపదను దోచుకుంటున్నారని ఘాటుగా విమర్శించారు.

**డీఎమ్ఎఫ్టీ, సీఎస్ఆర్ నిధులు రేవంత్ రెడ్డి మనవడి కోసం ఖర్చు..**

ఇసుక దోపిడీ ద్వారా రావాల్సిన డీఎమ్ఎఫ్టీ, సీఎస్ఆర్ నిధులు ఏమవుతున్నాయని ప్రశ్నించినా జిల్లా పెద్దలు నోరు మెదపడం లేదని ఆయన మండిపడ్డారు. ఆ నిధులను జిల్లా అభివృద్ధికి ఖర్చు చేయకుండా రేవంత్ రెడ్డి మనవడి సంతోషం కోసం ఫుట్ బాల్ ప్లేయర్ మెస్సీని పిలిపించి 100 కోట్లు ఖర్చు పెట్టారని, యంగ్ ఇండియా స్కూల్స్ పేరుతో ఆ నిధులను వారి నియోజకవర్గాలకు తరలిస్తున్నారని ఆరోపించారు. స్థానిక ఎమ్మెల్యేలు మాత్రం పొంగులేటి లాంటి పెట్టుబడిదారులను ప్రశ్నించలేక దున్నపోతు మీద వర్షం పడ్డట్లుగా దమ్మీలుగా మిగిలారని ఎద్దేవా చేశారు.





**12న ఇసుక క్వారీల వద్ద రాస్తారోకో..**

ఇసుక దోపిడీని అడ్డుకోవడానికి, గోదావరి పరివాహక ప్రజల హక్కుల కోసం, మైనింగ్ నిధులను ఇక్కడికే కేటాయించాలని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్ ఆధ్వర్యంలో దశలవారీ ఆందోళనకు పిలుపునిచ్చానని తెలిపారు. ఈ నెల 12న ఇసుక క్వారీల వద్ద రాస్తారోకో, 17న గ్రామ పంచాయతీల ముందు ధర్నా, 22న మండల కేంద్రాల్లో రాస్తారోకో, 30న నియోజకవర్గ స్థాయిలో (పినపాక నియోజకవర్గ కార్యక్రమం మణుగూరులో, భద్రాచలం నియోజకవర్గం దుమ్ముగూడెం, చర్ల మండలాలకు భద్రాచలంలో, వెంకటాపురం, వాజేడు మండలాలకు వెంకటాపురంలో) ధర్నా, చివరిగా నవంబర్ 5న కలెక్టరేట్ ముట్టడి నిర్వహిస్తామని ప్రకటించారు. జిల్లా వ్యాప్తంగా బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.

## సింగరేణిలో దసరా బోనస్ జాతర

◇ కార్మికుల ఖాతాల్లోకి రూ.25,000..!

◇ దసరా గిఫ్ట్ ప్రకటించిన సింగరేణి.. 15న అడ్వాన్స్ జమ..!

◇ ఫెస్టివల్ అడ్వాన్స్ కు సింగరేణి గ్రీన్ సిగ్నల్..!

◇ రెగ్యులర్లకు 25 వేలు.. టెంపరరీలకు 12,500

◇ కార్మికులకు దసరా ఆఫర్ అదిరింది



**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా క్రైమ్ ప్రతినిధి. అక్టోబర్ 9, ప్రజాజ్యోతి** సింగరేణి కార్మికులకు యాజమాన్యం దసరా పండుగ కానుక ప్రకటించింది. దసరా పండుగ సందర్భంగా అర్హులైన ఉద్యోగులందరికీ ఫెస్టివల్ అడ్వాన్స్ చెల్లించాలని నిర్ణయించింది. ఈ మేరకు సింగరేణి కార్పొరేట్ పర్సనల్ విభాగం ఐఆర్ వింగ్ నుండి అధికారిక సర్క్యులర్ నెం సీఆర్పీ/పీఈఆర్/ఐఆర్/ఎఫ్/201/1103 ను గురువారం విడుదల చేసింది.



ఈ ఏడాది దసరా పండుగ అక్టోబర్ 20న రానున్న నేపథ్యంలో, ఈ అడ్వాన్స్ మొత్తాన్ని అక్టోబర్ 15వ తేదీన కార్మికుల బ్యాంకు ఖాతాల్లో నేరుగా జమ చేయనున్నట్లు సర్క్యులర్ లో పేర్కొంది. మైన్స్ యాక్ట్ ప్రకారం లీవ్ కు అర్హత పొందిన రెగ్యులర్ ఎన్సీడబ్ల్యూఏ స్టాఫ్, బదిలీలు, ట్రైనీలతో సహా అందరికీ రూ.25,000 చొప్పున చెల్లించనున్నారు. అలాగే మైన్స్ యాక్ట్ ప్రకారం లీవ్ కు ఇంకా అర్హత పొందని టెంపరరీ వర్కర్లు, బదిలీలు, ట్రైనీలకు (ఫిక్స్ డ్ స్టైఫండ్ పై ఉన్న అప్రెంటిస్ లు మినహా) రూ.12,500 చొప్పున అడ్వాన్స్ ఇవ్వనున్నారు. ఈ అడ్వాన్స్ మరల తిరిగి వసూలు చేస్తారని యాజమాన్యం స్పష్టం చేసింది. ఈ మొత్తాన్ని 10 సమాన వాయిదాల్లో వసూలు చేయనున్నారు. నవంబర్ 2026 నెల జీతం నుండి (డిసెంబర్ లో చెల్లించే జీతం నుండి) రికవరీ మొదలవుతుంది. అయితే అడ్వాన్స్ చెల్లించే నెలలోనే రిటైర్మెంట్ లేదా మెడికల్ ఇన్ వాలిడేషన్ పై వెళ్లే వారికి ఈ అడ్వాన్స్ ఇవ్వబోమని, అలాగే 10 నెలల కంటే తక్కువ సర్వీసు ఉన్నవారి నుండి రిటైర్మెంట్ లోపే మొత్తం వసూలు అయ్యేలా చర్యలు తీసుకుంటామని సర్క్యులర్ లో తెలిపింది. దీంతో సింగరేణి ఏరియాల్లోని కార్మికుల్లో హర్షం వ్యక్తమవుతోంది. ఈ దసరా అడ్వాన్స్ తో కార్మికులు తమ కుటుంబ సభ్యులతో సంతోషంగా గడుపుతారాని తెలుస్తోంది.

## చిన్నారి మనసు, ప్రతిభను గెలవాలి

◇ ప్రతి చిన్నారిపై ప్రత్యేకత శ్రద్ధ ఉండాలి

◇ సత్యసాయి స్కూల్ లో న్యాయ విజ్ఞాన సదస్సు..!

◇ మణుగూరు న్యాయమూర్తి, మండల న్యాయసేవాధికార సంస్థ చైర్మన్ కంబపు సూరిరెడ్డి





**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా క్రైమ్ ప్రతినిధి / మణుగూరు. అక్టోబర్ 9, ప్రజాజ్యోతి** చిన్నారుల మానసిక ఆరోగ్య పరిరక్షణ సమాజంలోని ప్రతి ఒక్కరి బాధ్యత అని మణుగూరు న్యాయమూర్తి, మండల న్యాయసేవాధికార సంస్థ చైర్మన్ కంబపు సూరిరెడ్డి పేర్కొన్నారు. ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం మణుగూరు మండల న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో సంతోష్ నగర్ లోని శ్రీ సత్యసాయి ప్రత్యేక అవసరాల చిన్నారుల పాఠశాల, ఎంపీడీవో కార్యాలయ సముదాయంలోని భవిత పాఠశాలల్లో న్యాయ విజ్ఞాన సదస్సులు నిర్వహించారు. ఈ కార్యక్రమాలకు ముఖ్య అతిథిగా హాజరైన న్యాయమూర్తి సూరిరెడ్డి మాట్లాడుతూ ప్రతి చిన్నారిలో ప్రత్యేక ప్రతిభ దాగి ఉంటుందని, ఇతర పిల్లలతో పోల్చకుండా వారి సామర్థ్యాలను గుర్తించి ప్రేమతో ప్రోత్సహించాలన్నారు. చిన్నారులు తమ భావాలను స్వేచ్ఛగా వ్యక్తపరిచేలా ఆత్మీయ వాతావరణం కల్పించాలని, వారి మనోభావాలను గౌరవిస్తూ ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించాలని సూచించారు. ప్రత్యేక అవసరాలున్న చిన్నారులకు సమాన అవకాశాలు కల్పించి, వారి హక్కులను పరిరక్షించాలన్నారు. అనంతరం చిన్నారులకు పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమాల్లో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు గురు కృష్ణ, లీగల్ ఎయిడ్ కౌన్సిల్ సభ్యురాలు వీరంకి పద్మావతి, న్యాయవాది అంకం సర్వేశ్వరరావు, కోఆర్డినేటర్ ఏ. రవీందర్, కరస్పాండెంట్ నాగమణి, శిక్షణ ఉపాధ్యాయులు నాగశ్రీ, శ్యాంనాయక్, ప్రణీత్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# అష్ట దిగ్బంధనం!?

మొదటిపేజీ తరువాయి..

చేసుకోవాలనే కండీషన్‌ని సీజేపీ ముందు ఉంచారు పోలీసులు. అయితే ఏది ఏమైనా నేడు ఆందోళన చేపట్టాలనే ఆలోచనలో సీజేపీ ఉన్నట్లుగా స్పష్టం చేయడంతో ఢిల్లీలో సుమారు 57 మెట్రో స్టేషన్లకు ఎంట్రీ, ఎగ్జిట్‌లు మూసివేశారు. పలు రూట్లలో రైళ్లను క్యాన్సిల్ చేశారు. ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ వివాదం అగ్గిలా రాజుకొని మంటలా



ఎగసిపడుతోంది. ఇప్పటికే సీఈసీ రాజీనామా చేయాల్సిందేనంటూ ఇండియా కూటమి గత మూడ్రోజులుగా ఢిల్లీలో ఆందోళనలు చేస్తోంది. దీనికి మరింత బలం చేకూర్చే విధంగా అక్టోబర్ 10న జంతర్ మంతర్ వద్ద నిరసనకు 'కాక్రోచ్ జనతా పార్టీ' సిద్ధమైంది. అయితే సీజేపీ నిరసనకు ఢిల్లీ పోలీసులు అనుమతి నిరాకరించారు. నిర్ణీత గడువులోగా దరఖాస్తు చేసుకోలేని కారణం చూపి పర్మిషన్ ఇవ్వమని తేల్చి చెప్పారు. ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ సీజేపీ ఈ ఆందోళనకు పార్టీ పిలుపునిచ్చింది. ఇందుకు పర్మిషన్ ఇవ్వాలని కోరుతూ కాక్రోచ్ జనతా పార్టీ ప్రతినిధి సౌరవ్ దాస్ అక్టోబర్ 7న పోలీసులకు లేఖ అందజేశారు. అయితే జంతర్ మంతర్ వద్ద నిరసనలకు కనీసం పది రోజుల ముందే అనుమతి కోసం దరఖాస్తు చేసుకోవాలని ఢిల్లీ పోలీసుల నిబంధనలు చెబుతున్నాయి. గడువులోగా దరఖాస్తు చేయకపోవడంతో అనుమతి ఇవ్వలేదని పోలీస్ కమిషనర్ నూపుర్ ప్రసాద్ తెలిపారు. గతంలోనూ నీట్ పేపర్ లీక్‌పై సీజేపీ నిరసనల సందర్భంగా నిబంధనలు ఉల్లంఘించినట్లు ఆరోపణలు ఉన్నాయని పేర్కొన్నారు. నిబంధనలు అతిక్రమిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని వార్నింగ్ ఇచ్చారు. మరోవైపు నిరసనల నేపథ్యంలో 'ఢిల్లీ మెట్రో రైల్ కార్పొరేషన్' (డీఎంఆర్సీ)కి పోలీసులు కీలక సూచన చేశారు. అక్టోబర్ 9 రాత్రి 9 గంటల నుంచి సెంట్రల్ ఢిల్లీకి అనుసంధానమయ్యే మార్గాల్లోని 57 మెట్రో స్టేషన్ల ప్రవేశ, నిష్క్రమణ ద్వారాలను తాత్కాలికంగా మూసివేయాలని కోరారు. రైళ్ల రాకపోకల మధ్య వ్యవధిని కూడా పెంచాలని సూచించినట్లు నివేదికలు వెల్లడించాయి. అయితే రేపు చేపట్టబోయే నిరసనలో సీజేపీతో పాటు 'అఖిల భారత విద్యార్థి సంఘం' కూడా తోడవడంతో ఢిల్లీలో శాంతిభద్రతల పరిరక్షణ కోసం పోలీసులు భద్రతను కట్టుదిట్టం చేశారు. ఢిల్లీని అష్టదిగ్బంధనం చేశారు. మరోవైపు పరిస్థితిని అదుపులోకి తెచ్చేందుకు ఢిల్లీ పోలీసులు ముందస్తు చర్యల్లో భాగంగా కఠిన ఆంక్షలు విధించారు. జన్‌పథ్–కర్తవ్య పథ్ కూడలికి నాలుగు కిలోమీటర్ల పరిధిలో మొబైల్ ఇంటర్నెట్ సేవలను 24 గంటల పాటు నిలిపివేయాలని శుక్రవారం సాయంత్రం ఆదేశాలు జారీ చేశారు. అక్టోబర్ 9, శుక్రవారం రాత్రి 10 గంటల నుంచి శనివారం రాత్రి 10 గంటల వరకు ఈ ఆంక్షలు అమల్లో ఉంటాయని వెల్లడించారు. ఈ మేరకు ఢిల్లీ డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ కార్యాలయం నుంచి ఎయిర్‌టెల్, వొడాఫోన్–ఐడియా, జియో, ఎంటీఎన్ఎల్ వంటి ప్రధాన టెలికం సంస్థలకు అధికారిక ఉత్తర్వులు వెళ్లాయి. టెలికమ్యూనికేషన్స్ చట్టం–2023లోని నిబంధనల ప్రకారం ఇంటర్నెట్ సేవలను నిలిపివేయాలన్న తాము కోరిన విన్నపాన్ని కేంద్ర హోంశాఖ కార్యదర్శి ఆమోదించినట్లు పోలీసులు తమ ఉత్తర్వుల్లో స్పష్టం చేశారు. అన్ని రకాల సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన మొబైల్ ఇంటర్నెట్ సేవలను తక్షణమే నిలిపివేయాలని ఆయా సంస్థలను ఆదేశించారు. కాగా, ఈ పరిణామం చోటుచేసుకోవడానికి కొన్ని గంటల ముందే నిరసనల అణిచివేతకు ప్రభుత్వం తీసుకుంటున్న కఠిన చర్యలపై సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. ఢిల్లీలోకి వచ్చే మెట్రోలు, రైళ్లపై ఆంక్షలు విధించడాన్ని ప్రశ్నిస్తూ, "ఈగను చంపడానికి సుత్తిని ఉపయోగించలేరు కదా" అని ప్రభుత్వాన్ని నిలదీసింది. అత్యున్నత న్యాయస్థానం ఇటువంటి వ్యాఖ్యలు చేసినప్పటికీ, పోలీసులు నిరసనలను అడ్డుకోవడానికి ఇంటర్నెట్ సేవలపై నిషేధం విధించడం గమనార్హం. సీజేపీ నిరసనల నేపథ్యంలో శాంతిభద్రతల పరిరక్షణ కోసమే ఈ నిర్ణయం తీసుకున్నట్లు పోలీసు వర్గాలు పేర్కొంటున్నాయి.

# రాష్ట్రంలో ఎల్‌నినో తాండవం

మొదటిపేజీ తరువాయి..

నీటి లభ్యత, రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులపై రాష్ట్ర ప్రభుత్వం తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తోంది. వర్షాలు తక్కువగా నమోదైన ప్రాంతాల్లో పరిస్థితిని అంచనా వేసి.. అక్కడి అన్నదాతలకు తక్షణ ఉపశమనం కల్పించేందుకు ఎలాంటి చర్యలు తీసుకోవాలి అనే అంశంపై సీఎం రేవంత్ రెడ్డి ఈ సమావేశంలో సమీక్షించనున్నారు. అవసరమైన సహాయక చర్యలను గుర్తించి.. వాటిని అమలు చేసేందుకు స్పష్టమైన ప్రణాళిక రూపొందించడంపై సమావేశంలో దృష్టి సారించే అవకాశం ఉంది. ఈనెల 12వ తేదీన జరిగే సమావేశంలో పలు కీలక అంశాలు చర్చకు రానున్నాయి. సాగునీటి ప్రాజెక్టుల్లో అందుబాటులో ఉన్న నీటి నిల్వలు, తాగునీటి అవసరాలు, గ్రామీణ ప్రాంతాల్లో నీటి సరఫరా, విద్యుత్ వినియోగం పెరిగితే తీసుకోవాల్సిన చర్యలపై అధికారులు, మంత్రులతో సీఎం రేవంత్ రెడ్డి చర్చించనున్నారు. సకాలంలో వర్షాలు కురవని ప్రాంతాల్లో రైతులకు ఎదురయ్యే సమస్యలను తగ్గించడంతో పాటు.. రాబోయే రోజుల్లో నీటి కొరత ఏర్పడకుండా ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేయడంపైనా రేవంత్ రెడ్డి ప్రభుత్వం దృష్టి పెట్టనుంది. రాష్ట్రంలో సాధారణ వర్షపాతంతో పోలిస్తే సుమారు 17 శాతం తక్కువ వర్షాలు నమోదైనట్లు రాష్ట్ర ప్రభుత్వం వెల్లడించిన వివరాల్లో పేర్కొంది. దాదాపు 235 మండలాల్లో వర్షాభావ పరిస్థితులు నెలకొన్నట్లు అంచనా వేస్తున్నారు. దీంతో ఆయా ప్రాంతాల్లో వ్యవసాయ కార్యకలాపాలు, నీటి లభ్యతపై ప్రభావం పడే అవకాశాలు ఉన్నాయి. ఇటీవల జరిగిన రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలోనూ ఈ అంశంపై చర్చ జరిగింది. వర్షాభావంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న ప్రాంతాలను గుర్తించి.. రైతులకు అవసరమైన సహాయం అందించేందుకు చర్యలు తీసుకోవాలని ప్రభుత్వం భావిస్తోంది. ఈ క్రమంలో కరువు మండలాల గుర్తింపు, బాధితులకు ఆర్థిక తోడ్పాటు, ఇతర ఉపశమన చర్యలపై కేంద్ర ప్రభుత్వ సహకారాన్ని కోరింది. వర్షాభావ పరిస్థితులను ఎదుర్కొనేందుకు ప్రత్యేక ఆర్థిక సాయం అందించాలని ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వాన్ని కోరింది. ఇందుకోసం రూ.20 వేల కోట్ల ప్రత్యేక ప్యాకేజీ కేటాయించాలని విజ్ఞప్తి చేసింది. అలాగే.. కరువు ప్రభావిత మండలాలను ప్రకటించి, బాధిత రైతులకు తగిన సహాయం అందించేలా చర్యలు తీసుకోవాలని కోరుతూ అసెంబ్లీలో తీర్మానం చేసింది. కేంద్రం నుంచి అందే సహాయం, రాష్ట్ర ప్రభుత్వం చేపట్టాల్సిన తక్షణ చర్యలపై తదుపరి నిర్ణయాలు తీసుకోవాల్సిన అవసరం ఉండగా.. ఈ నేపథ్యంలో సీఎం రేవంత్ రెడ్డి మంత్రులతో నిర్వహించనున్న సమావేశం ప్రాధాన్యం సంతరించుకుంది. వర్షాభావ పరిస్థితులపై ఇప్పటికే మంత్రివర్గ ఉపసంఘం రూపొందించిన ప్రణాళికలను కూడా



ఈ సమావేశంలో సీఎం రేవంత్ రెడ్డి పరిశీలించనున్నారు. త్వరలో నిర్వహించనున్న అఖిలపక్ష సమావేశంతో పాటు రైతు సంఘాలు, వ్యవసాయ రంగ నిపుణులు, ఇతర సంబంధిత వర్గాల నుంచి సేకరించే సలహాలు, సూచనలను పరిగణనలోకి తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తోంది. వివిధ వర్గాల అభిప్రాయాలను పరిశీలించి.. క్షేత్రస్థాయిలో రైతులకు ఉపయోగపడే చర్యలను ఖరారు చేయడమే లక్ష్యంగా ఈ భేటీ జరగనుంది. వర్షాభావం మరింత తీవ్రమైతే ఎదురయ్యే పరిస్థితులను ముందుగానే అంచనా వేసి.. వ్యవసాయం, తాగునీరు, విద్యుత్ సరఫరా వంటి రంగాల్లో ఇబ్బందులు తలెత్తకుండా కార్యాచరణ రూపొందించడంపై ప్రభుత్వం దృష్టి సారించనుంది. ఎల్‌నినో ప్రభావం, తక్కువ వర్షపాతం నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం తీసుకునే నిర్ణయాలపై తెలంగాణ రైతుల్లో ఆసక్తి నెలకొంది. ఈనెల 12వ తేదీన మంత్రులతో జరిగే సమావేశంలో వర్షాభావ ప్రాంతాలకు సంబంధించిన ప్రణాళికలు, రైతులకు అందించాల్సిన సహాయం, నీటి నిర్వహణ చర్యలపై స్పష్టత వచ్చే అవకాశం ఉంది. సమీక్ష తర్వాత ప్రభుత్వం ఎలాంటి నిర్ణయాలు తీసుకుంటుంది.. క్షేత్రస్థాయిలో వాటిని ఎలా అమలు చేస్తుంది అనేది కీలకంగా మారనుంది.

# సీఈసీ రాజీనామా చేయాలి

- 'సర్' అక్రమాలపై విచారణ జరపాలి..
- ప్రక్రియలో భారీ అక్రమాలు జరిగాయి
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్
- ప్రజల విశ్వాసాన్ని ఈసీ కోల్పోతోంది
- అన్నిటికన్నా ప్రజాస్వామ్యం గొప్పది
- బీఆర్ఎస్ సీనియర్ నేత హరీశ్ రావు
- సర్ వ్యవహారంపై బీఆర్ఎస్ పార్టీ డిమాండ్
- నేడు హైదరాబాద్‌లో నిరసనలకు పిలుపు
- ఢిల్లీలోనూ నిరసనలు చేపట్టే యోచన!!

ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ ప్రక్రియలో భారీ అక్రమాలు జరిగాయని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ధ్వజమెత్తారు. జరిగిన అక్రమాలపై తీవ్ర స్థాయిలో స్పందించారు. ఈ వ్యవహారంపై సుప్రీంకోర్టు సుమోటోగా విచారణ చేపట్టి, సిట్టింగ్ జడ్జితో స్వతంత్ర దర్యాప్తు జరిపించాలని ఆయన డిమాండ్ చేశారు. అదే సమయంలో, చీఫ్ ఎలక్షన్ కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్ తక్షణమే తన పదవికి రాజీనామా చేయాలని కోరారు. ఈ మేరకు ఎక్స్ వేదికగా కేటీఆర్ ఒక ప్రకటన విడుదల చేశారు. భారత రాజ్యాంగానికి మించింది ఏదీ లేదని, ఏ ఒక్క భారత పౌరుడి ఓటు హక్కును హరించలేరని ఆయన స్పష్టం చేశారు. ఒక వ్యక్తిని కాపాడటం కోసం 140 కోట్ల మంది భారతీయుల హక్కులను ఎలా కాలరాస్తారని ప్రశ్నించారు. ప్రజాస్వామ్యానికి మూలస్తంభమైన ఓటు హక్కును బలహీనపరిచే కుట్రలపై న్యాయవ్యవస్థ జోక్యం చేసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ప్రక్రియలో భాగంగా, ముఖ్యంగా బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గాల్లో భారీ ఎత్తున ఓటర్ల పేర్లను తొలగించారని ఆయన ఆరోపించారు. భారత ప్రజాస్వామ్య వ్యవస్థకు ఎన్నికల సంఘం (ఈసీ) వెన్నెముక వంటిదని, అది అధికారంలో ఉన్నవారికి రక్షణ కవచంలా మారకూడదని బీఆర్ఎస్ సీనియర్ నేత, మాజీ మంత్రి హరీశ్ రావు అన్నారు. ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్ వెంటనే తన పదవికి రాజీనామా చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఎన్నికల సంఘం పనితీరు, నియామకాలపై వస్తున్న ప్రశ్నలతో రాజ్యాంగ పునాదులు బలహీనపడుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఓటర్ల జాబితా సవరణలో (సర్) భాగంగా పెద్ద ఎత్తున ఓట్లను తొలగించడం వల్లే ఈసీపై ప్రజలకు నమ్మకం పోతోందన్నారు. "ప్రజాస్వామ్యం అన్నింటికన్నా గొప్పది. ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టడంలో విఫలమైతే, అందుకు బాధ్యత వహిస్తూ సీఈసీ జ్ఞానేశ్ కుమార్ తప్పుకోవాలి" అని హరీశ్ రావు స్పష్టం చేశారు. రాజ్యాంగంలోని ఆర్టికల్స్ 324, 325, 326 ప్రకారం స్వేచ్ఛాయుతమైన, నిష్పక్షపాతమైన ఎన్నికలు జరగాలని గుర్తుచేశారు.

ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (సర్) వ్యవహారం దేశవ్యాప్తంగా రాజకీయ దుమారం రేపుతోంది. సీఈసీ జ్ఞానేశ్వర్ కుమార్ రాజీనామా చేయాలనే డిమాండ్‌తో ఇండి కూటమి పార్టీలు ఢిల్లీలో తీవ్ర స్థాయిలో ఆందోళన చేపడుతున్నాయి. ఇండి కూటమి నేతలు 'సర్' విషయంలో తమ అభ్యంతరాలను రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు వివరించనున్నారు. మరోవైపు కాక్రోచ్ జనతా పార్టీ సైతం శనివారం ఢిల్లీలోని జంతర్ మంతర్‌లో నిరసనలకు పిలుపునిచ్చింది. సీఈసీ జ్ఞానేశ్వర్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ.. దేశ రాజధానిలో కాంగ్రెస్ ఆధ్వర్యంలో నిరసనలు చేస్తున్న వేళ.. రాహుల్ గాంధీతోపాటు, తమ పార్టీకి చెందిన ఇతర అగ్రనేతలకు సంఘీభావం ప్రకటించడం కోసం తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి సైతం బుధవారం ఢిల్లీ వెళ్లి వచ్చారు. మరుసటి రోజే హైదరాబాద్‌లోనూ కాంగ్రెస్, వామపక్షాలు నిరసన చేపట్టాయి. టీపీసీసీ చీఫ్, మంత్రులు లోక్ భవన్ ముట్టడికి ప్రయత్నించారు. ఈ క్రమంలోనే సీఈసీ జ్ఞానేశ్వర్ కుమార్ కచ్చితంగా రాజీనామా చేయాల్సిందేనని బీఆర్ఎస్ కూడా డిమాండ్ చేస్తోంది. అంతే కాదు అక్టోబర్ 10న తెలంగాణ ఎన్నికల సంఘం ఆఫీస్ ముందు ఆందోళనలకు సైతం పిలుపునిచ్చింది. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు ప్రాతినిధ్యం వహిస్తోన్న నియోజకవర్గాల్లో సర్ ప్రక్రియలో భాగంగా పెద్ద ఎత్తున ఓట్లను తొలగించడం పట్ల గులాబీ దళం అనుమానాలు వ్యక్తం చేస్తోంది. సర్ ప్రక్రియలో అవకతవకలపై సుప్రీం కోర్టు జడ్జితో సమగ్రమైన, స్వతంత్ర విచారణ ఏర్పాటు చేయాలని బీఆర్ఎస్ డిమాండ్ చేస్తోంది. నైతిక బాధ్యత వహిస్తూ సీఈసీ రాజీనామా చేయాలని కూడా ఆ పార్టీ డిమాండ్ చేస్తోంది. హైదరాబాద్‌లో ఆందోళనలు చేపట్టిన అనంతరం.. ఢిల్లీలోనూ ప్రదర్శనలు చేపట్టాలని భావిస్తోంది. వాస్తవానికి బీఆర్ఎస్ జాతీయ స్థాయిలో అటు కాంగ్రెస్ కూటమిలో గానీ.. ఇటు ఎన్డీయే కూటమిలో కానీ బీఆర్ఎస్ భాగంగా లేదు. కానీ 'సర్' విషయంలో మాత్రం ఆ పార్టీ విభేదిస్తోంది. 'భారత రాజ్యాంగం కంటే ఏదీ పెద్దది కాదు. ఏ ఒక్క భారత పౌరుడి ఓటు హక్కును కూడా లాగేసుకోలేరు. సీఈసీ జ్ఞానేశ్వర్ కుమార్ రాజీనామా చేయాల్సిందే. వ్యవస్థ కంటే వ్యక్తులు ఎక్కువ కాదు' అంటూ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఎక్స్‌లో పోస్టు చేశారు. 140 కోట్ల మంది ప్రజల కంటే ఒక వ్యక్తి ఎలా ఎక్కువ అవుతాడు? జ్ఞానేశ్వర్ కుమార్ వైదొలిగాల్సిన టైం వచ్చింది. సర్ ప్రక్రియలో అవకతవలను సుప్రీం కోర్టు సుమోటోగా స్వీకరించి.. సిట్టింగ్ జడ్జితో స్వతంత్ర దర్యాప్తు నిర్వహించాలని కేటీఆర్ కోరారు. రాష్ట్ర స్థాయిలో చూస్తే.. కాంగ్రెస్ అధికారంలో ఉండగా.. బీఆర్ఎస్ ప్రధాన ప్రతిపక్షంగా ఉంది.

# భూ వివాద రహిత తెలంగాణే లక్ష్యం



మొదటిపేజీ తరువాయి..

రీసర్వే పేరుతో ప్రజల నుంచి డబ్బులు వసూలు చేస్తే కఠిన చర్యలు తప్పవని మంత్రి హెచ్చరించారు. భూవివాద రహిత తెలంగాణ నిర్మాణమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం సమగ్ర భూ పునఃసర్వేను ప్రతిష్టాత్మకంగా చేపట్టింది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆలోచనలకు అనుగుణంగా భూ రీసర్వేను వేగంగా, పారదర్శకంగా పూర్తి చేయాలని రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అధికారులకు దిశానిర్దేశం చేశారు. సచివాలయంలో ఇవాళ సర్వే పర్యవేక్షణకు నియమించిన అధికారులతో మంత్రి



ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు. ప్రతి దశలోనూ నాణ్యతను నిర్ధారించాలని మంత్రి స్పష్టం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా తొలి దశలో 2,768 గ్రామాల్లో రీసర్వే కొనసాగుతోందని, ఇప్పటివరకు 245 గ్రామాల్లో పూర్తయిందని మంత్రి వెల్లడించారు. నవంబర్ చివరి నాటికి తొలి దశను పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు చెప్పిన మంత్రి మొత్తం సమగ్ర భూ పునఃసర్వేను ఏడాదిన్నరలో ముగించేలా పటిష్ట కార్యాచరణ అమలు చేయాలని అధికారులను ఆదేశించారు. భూ సర్వే పనులను క్షేత్రస్థాయిలో పర్యవేక్షించేందుకు రాష్ట్రాన్ని 7 జోన్లుగా విభజించి, ఒక్కో జోన్‌కు రెవెన్యూ, సర్వే విభాగాల నుంచి ఇద్దరు చొప్పున 14 మంది అధికారులను నియమించారు. ప్రతి మండలంలో కనీసం 2 రెవెన్యూ గ్రామాల్లో సర్వే చేపట్టేలా చర్యలు తీసుకున్నారు. ఇందుకోసం ప్రతి మండలానికి 2 సర్వే బృందాలను ఏర్పాటు చేశారు. అదేవిధంగా లైసెన్స్‌డ్ సర్వేయర్‌తోపాటు జీపీవో, డిప్యూటీ తహసీల్దార్ లేదా ఆర్ఐ లేదంటే ఇతర సిబ్బంది ఈ బృందాల్లో ఉంటారు. సర్వే జరుగుతున్న గ్రామాల్లో తహసీల్దార్లు ప్రతిరోజూ పర్యటించాలని మంత్రి పొంగులేటి ఆదేశించారు. రోజువారీగా ఎన్ని ఎకరాలు, ఎన్ని సర్వే నంబర్లు పూర్తయ్యాయి? ఎన్ని గ్రామాల్లో పనులు కొనసాగుతున్నాయి? ప్రజల నుంచి ఎలాంటి స్పందన వస్తోంది? క్షేత్రస్థాయిలో ఏమైనా సమస్యలు ఎదురవుతున్నాయా? అనే వివరాలను సేకరించాలని సూచించారు. చిన్న పొరపాటుకు కూడా తావులేకుండా సర్వే నిర్వహించాలని, భవిష్యత్తులో మళ్లీ భూ వివాదాలు తలెత్తకుండా రికార్డులను కచ్చితంగా రూపొందించాలని మంత్రి స్పష్టం చేశారు. రీసర్వే పురోగతిని రాష్ట్రస్థాయి నుంచి పర్యవేక్షించేందుకు హైదరాబాద్‌లో ప్రత్యేక డాష్‌బోర్డును ఏర్పాటు చేయాలని పొంగులేటి ఆదేశించారు. గ్రామాల వారీగా సర్వే వివరాలు, రోజువారీ పురోగతి, పనిచేస్తున్న బృందాలు, వినియోగిస్తున్న రోవర్లు, వాటి లొకేషన్ వంటి సమాచారాన్ని ఎప్పటికప్పుడు తెలుసుకునేలా సాంకేతికతను ఉపయోగించనున్నట్లు తెలిపారు. సర్వేకు అవసరమైన సిబ్బంది, రోవర్లు, సర్వర్లు, ఇతర సాంకేతిక పరికరాల కొనుగోలుకు నిధుల కొరత ఉండదని మంత్రి స్పష్టం చేశారు. అవసరమైన నిధులను వెంటనే విడుదల చేస్తామని తెలిపారు. అదనపు రోవర్లను కొనుగోలు చేయాలని ఆదేశించారు. ప్రతి వారం రాష్ట్రస్థాయిలో సమీక్ష నిర్వహించాలని, ప్రతి 15 రోజులకు తాను స్వయంగా పురోగతిని పరిశీలిస్తానని మంత్రి వెల్లడించారు. ప్రభుత్వ భూముల సర్వే సమయంలో సరిహద్దుల గుర్తింపునకు సంబంధిత శాఖల అధికారులు తప్పనిసరిగా హాజరుకావాలని సూచించారు. రీసర్వే పేరుతో ఎవరైనా ప్రజల నుంచి డబ్బులు వసూలు చేసినా, ప్రజలను ఇబ్బందులకు గురిచేసినా సహించేది లేదని హెచ్చరించారు. అలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. జీవో 59 ద్వారా స్థలాల క్రమబద్ధీకరణ కోసం దరఖాస్తు చేసుకున్న వారికి తెలంగాణ ప్రభుత్వం తీపి కబురు అందించింది. 500 చదరపు గజాల లోపు ఉన్న పెండింగ్ దరఖాస్తులన్నింటినీ రాబోయే నెల రోజుల్లోగా పరిష్కరిస్తామని రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఈ మేరకు ప్రక్రియను వేగవంతం చేయాలని స్పష్టం చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం మెమో నంబర్ 48030 ద్వారా సంబంధిత జిల్లాల కలెక్టర్లకు కీలక ఉత్తర్వులు జారీ చేసింది. నివాసాలు ఏర్పాటు చేసుకున్న ప్రభుత్వ స్థలాలను క్రమబద్ధీకరించడమే లక్ష్యంగా తెచ్చిన ఈ జీవో అమల్లో ఎలాంటి అక్రమాలకు తావులేకుండా పారదర్శకంగా నిర్ణయాలు తీసుకుంటామన్నారు. నివాసాలు ఏర్పాటు చేసుకున్న ప్రభుత్వ స్థలాల క్రమబద్ధీకరణ కోసం తీసుకొచ్చినదే జీవో 59. గతంలో జీవో 59 అమలు విషయంలో జరిగిన పొరపాట్లు, అక్రమాలు పునరావృతం కాకుండా అధికారులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఆదేశించారు. అన్ని నిర్ణయాలు పూర్తిగా నిబంధనలకు లోబడి మాత్రమే ఉంటాయని పేర్కొన్నారు. అలాగే కన్వేయన్స్ డీడ్స్‌కు సంబంధించి పెండింగ్‌లో ఉన్న కేసులను కూడా సమగ్రంగా పరిశీలించి త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులకు స్పష్టమైన మార్గదర్శకాలు ఇచ్చారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ సత్వరమే న్యాయం జరిగేలా చర్యలు చేపడుతున్నట్లు వెల్లడించారు. దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉన్న అర్బన్ ల్యాండ్ సీలింగ్ దరఖాస్తులతో పాటు.. నాలా ప్రక్రియ పూర్తి కాని పట్టా భూముల రిజిస్ట్రేషన్ల సమస్యల పరిష్కారం పైనా ప్రభుత్వం దృష్టి సారించింది. నిబంధనలకు లోబడి పారదర్శకంగా సమస్యలను పరిష్కరించాలని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి అధికారులను ఆదేశించారు. ప్రభుత్వం ఇప్పటికే 22ఏ కింద ఉన్న భూములపై ఉన్న సమస్యల పరిష్కారం కోసం హైలెవల్ కమిటీని ఏర్పాటు చేసింది. మరోవైపు భూవివాద రహిత తెలంగాణ నిర్మాణమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన సమగ్ర భూ పునఃసర్వేపై మంత్రి పొంగులేటి సమీక్ష జరిపారు. ప్రతి దశలోనూ నాణ్యతను నిర్ధారించాలని మంత్రి స్పష్టం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా తొలి దశలో 2,768 గ్రామాల్లో రీ–సర్వే కొనసాగుతోందని, ఇప్పటివరకు 245 గ్రామాల్లో సర్వే పూర్తయిందని మంత్రి వెల్లడించారు. నవంబర్ చివరి నాటికి తొలి దశను పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు చెప్పిన మంత్రి మొత్తం సమగ్ర భూ పునఃసర్వేను ఏడాదిన్నరలో ముగించేలా పటిష్ట కార్యాచరణ అమలు చేయాలని అధికారులను ఆదేశించారు.




Printed and Published by V. SRINIVAS REDDY on behalf of M/S SAI KRISHNA PUBLICATIONS Owned by M/S SAI KRISHNA PUBLICATIONS Printed at Sree Seshasai Enterprises, Plot No. 98/1, Co-operative Industrial Estate, IDA, Gandhinagar, Quthbullapur Mandal, Medchal-Malkajgiri Dist, Telangana. Published at H.No. 1-2-79/4/A, Shanthi Nagar, Adilabad, Adilabad Dist, Telangana. Editor: V. SRINIVAS REDDY, RNI No. TELTEL/2008/24799, Ph No: 9440231967